ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-5-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 114 పేజీలు: 10+4 వెల: 6.50

జులై 1 నుంచి విబి జి రామ్‌జీ అమలులోకి 3లో
క్వెట్టాలో రైలు పట్టాలపై భారీ పేలుడు, 24 మంది దుర్మరణం 5లో


అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోడీ (ఫైల్)

## ప్రధాని మోడీకి నేను మెగా ఫ్యాన్‌ను.. ఆయన గొప్ప ఫ్రెండ్

### పొగడ్తలతో ముంచెత్తిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**న్యూఢిల్లీ, మే 24:** ప్రధానిమోడీ ఒక గొప్ప వ్యక్తి. నేను ఆయన్ను ఎంతో అభిమానిస్తా, ఆయనకు మెగా ఫ్యాన్‌ను అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పొగడ్తలతో ప్రధానిమోడీని ముంచెత్తారు. మా రెండుదేశాల్లోను గొప్ప ఆర్థిక వ్యవస్థ ఉంది. రికార్డుస్థాయి స్టాక్ మార్కెట్లు పనిచేస్తున్నాయి. అమెరికానుంచి ఏది కావాలనుకుంటే భారత్ అది సాధించుకోగలదు. అమెరికాకు స్వాతంత్ర్యం వచ్చి 250 సంవత్సరాలు అయిన సందర్భంగా భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ఏర్పాటుచేసిన మెగా కార్యక్రమంలో ట్రంప్ చేసిన విడియోకాల్ వైరల్ అయింది. అతిపెద్దస్క్రీన్‌పై మోడీని ప్రశంసిస్తున్న ట్రంప్‌ను చూసి ప్రేక్షకులు చప్పట్లు మారుమోగించారు. మోడీ తన ప్రసంగంలో భారత్‌కు ఏదికావాలన్నా ఎవరికి కాల్‌చేయాలో భారత్‌కు తెలుసునని, నేరుగా తమకే కాల్‌చేస్తారని, మా ఇద్దరిమధ్య మంచి స్నేహబంధం ఉందంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇద్దరం కలిసి రికార్డులు నమోదుచేయగలమని ట్రంప్ ధీమా ప్రకటించారు. అలాగే అమెరికా రాయబారి సెర్గియోగోరే, అమెరికా విదేశాంగమంత్రి మార్కోరుబియోలను కూడాప్రశంసించారు. అమెరికాకు ఒక గొప్ప విదేశాంగ కార్యదర్శి రుబియో అని అమెరికా చరిత్రలోనే ఇంతటి >>2

## 46.5°

### ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధిక ఉష్ణోగ్రత

### వడదెబ్బకు మూడు రోజుల్లో 107 మంది బలి

### చురుకుగా కదులుతున్న నైరుతి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** తెలంగాణ నిప్పుల గుండంగా మారింది. రాష్ట్రంలో రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. పగటిపూట భానుడి ప్రతాపాగ్ని, వడగాలులకు తోడు రాత్రి వేళల్లో కూడా వేడి గాలులు వీస్తుండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10గంటల నుంచి భానుడు ప్రతాపం చూపుతుండటంతో బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తర తెలంగాణలోని 12 జిల్లాలకు వాతావరణశాఖ ఈ నెల 27 వరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇక హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో కూడా వేడి గాలుల తీవ్రత దృష్ట్యా ఎల్లోఅలర్ట్ జారీ చేసింది. ప్రధానంగా వడగాల్పుల తీవ్రతకు జనం పెద్ద సంఖ్యలో వడదెబ్బకు గురవుతున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరగనున్న దృష్ట్యా మధ్యాహ్నం వేళ ప్రజలు బయటకు రావొద్దని వాతావరణశాఖ హెచ్చరించింది. ఆదివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక >>2

## జూన్ 2 నుంచి ఇందిరమ్మ బీమా



### 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల రక్షణ కవచం

### త్వరలో ప్రతి ఇంటి వివరాల సేకరణ

### మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు: డి.సిఎం భట్టి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పేదరికంపైనే తెలంగాణ సర్కార్ సమరమని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, నిరుపేదల ముంగిటకే సంక్షేమ ఫలాలను చేరవేస్తోందన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కానుకగా జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా చారిత్రాత్మక ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. కులమతాలకు అతీతంగా, పేద ధనిక భేదం లేకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు ఈ బీమా రక్షణ కవచంలా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలు కనీసం రూ.లక్ష సాయం కోసం చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకపోయిందని విమర్శించారు. అటువంటి దుస్థితి పునరావృతం కాకూడదనే ఉద్దేశంతోనే, ప్రమాదవశాత్తు కుటుంబ యజమానిని కోల్పోయిన ప్రతి ఇంటికీ రూ.5 లక్షల బీమా వర్తింపజేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

దీనికి సంబంధించి అధికారులు త్వరలోనే ప్రతి ఇంటికీ వచ్చి వివరాలు సేకరిస్తారని వెల్లడించారు. ఇక మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అందులో భాగంగా ఈ నెల 27వ మధిర నియోజకవర్గం రాజుపాలెంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు సోలార్ పవర్‌ప్లాంట్లు కేటాయించేపథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలియచేశారు. మహిళా >>2

## బస్సులో భరోసా

### ప్రయాణికుల భద్రత కోసం వినూత్న పథకానికి ఆర్టీసీ శ్రీకారం

### బస్సుల్లో అత్యాధునిక సిసి కెమెరాలు

### కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ

### ఆదిలాబాద్‌లో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం



బస్సులో సిసి కెమెరాలు అమర్చిన దృశ్యం

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 24:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి) బస్సుల్లో ప్రయాణించే ప్రయాణీకులకు మరింత భద్రత కల్పించే దిశగా ఆర్‌టిసి చర్యలు ప్రారంభించింది. టిజి ఆర్‌టిసి బస్సుల్లో నిఘా నేత్రాలను ఏర్పాటు చేయనుంది. ప్రయాణికుల రక్షణ కోసం సంస్థ ఎండీ నాగిరెడ్డి వినూత్న పథకానికి శ్రీకారం చుట్టారు. 'బస్సులో భరోసా' పేరుతో ఆదిలాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ప్రజల ప్రయాణానికి భద్రత, నమ్మకానికి ప్రతీకగా నిలుస్తున్న ఆర్‌టిసి ప్రయాణికుల రక్షణ కోసం మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రమాదాలు, చోరీలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేసేందుకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి) నాగిరెడ్డి సరికొత్త వ్యూహాన్ని అమలులోకి తీసుకొచ్చారు. ప్రయాణికులు ఎలాంటి భయాందోళనలు లేకుండా, ప్రశాంతమైన వాతావరణంలో తమ గమ్యస్థానాలకు చేరుకునేలా చూసేందుకు బస్సుల్లో అత్యాధునిక సిసి కెమెరాల నిఘా వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ 'బస్సులో భరోసా' పేరిట రూపొందించిన ఈ సరికొత్త హైటెక్ భద్రతా ప్రాజెక్టును తొలిదశలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. అందులో భాగంగా ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని సుమారు 175 బస్సుల్లో అత్యాధునిక నిఘా నేత్రాలను అమర్చారు. డ్రైవర్ క్యాబిన్ సమీపం, మహిళల కోసం కేటాయించిన ప్రత్యేక సీట్లు, ఫుట్‌బోర్డుతో పాటు బస్సు లోపల చివరి సీటు వరకు ప్రతి అంగుళం స్పష్టంగా కవర్ అయ్యేలా ఈ కెమెరాలను ప్రత్యేక సాంకేతికతతో అమర్చారు.

బస్సు ఎక్కే ప్రతి వ్యక్తి ముఖ కదలికల నుంచి ప్రయాణంలో జరిగే ప్రతి చిన్న యాక్టివిటీ వరకు అన్నీ ఇందులో రికార్డు అవుతాయి. ఈ విజువల్స్ అటు డ్రైవర్, కండక్టర్లకు అందుబాటులో ఉండటమే కాకుండా ఆర్‌టిసి కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా కనెక్ట్ చేశారు. దీనివల్ల బస్సుల్లో దొంగతనాలు చేసే ముఠాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ముందే గుర్తించి అప్రమత్తం కావడానికి, ఒకవేళ ఏదైనా అవాంఛనీయ సంఘటన లేదా ప్రమాదం జరిగితే తక్షణమే ఖచ్చితమైన ఆధారాలను సేకరిం >>2

## లారీల కొరతకు చెక్

### ఇసుక, సిమెంట్ లారీలు సైతం ధాన్యం కొనుగోళ్లకే..

### మద్దతు ధర తగ్గిస్తే కఠిన చర్యలు: మంత్రి ఉత్తమ్


ఆదివారం సచివాలయంలో విసిలో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** యాసంగి ధాన్యం కొనుగోళ్లు మరింత వేగంగా కొనసాగేలా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రధానంగా కొనుగోళ్లు నెమ్మదించేందుకు కారణమైన లారీల కొరతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈసమస్య అధిగమించేందుకు పకడ్బంధీ యాక్షన్ ప్లాన్ సిద్ధంచేశారు. ఇందులో భాగంగా లారీల కొరత ఉన్న ప్రాంతాల్లో ధాన్యం తరలింపునకు ఇసుక, సిమెంట్ లారీలను వాడుకోవాలని సూచించారు. ఈ మేరకు రవాణాశాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారి చేసింది. రైతులకు ఇబ్బంది కలుగకుండా మిల్లులకు ధాన్యాన్ని సకాలంలో చేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విషయమై ఆదివారం సచివాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తేమ పేరుతో రైతులను మోసంచేస్తే ఎవరినైనా క్షమించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్వింటాలుకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువకు కొనుగోలు చేస్తే ఆయా రైస్ మిల్లులను బ్లాక్ లిస్టులో పెడతామని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడే దళారులు, మిల్లర్లపై >>2




## ఎబోలా అలర్ట్

### కాంగో, ఉగాండా, సూడాన్ దేశాలకు వెళ్లొద్దు

### కేంద్రం హెచ్చరిక

**న్యూఢిల్లీ, మే 24:** ఆఫ్రికన్ దేశాలలో ఎబోలా వ్యాధి వ్యాప్తి చెందినట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో ప్రస్తుతం కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్‌లకు అత్యవసరం కాని ప్రయాణాలను మానుకోవాలని కేంద్రం దేశ ప్రజలకు సూచించింది. ఆయా దేశాలలో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న భారత పౌరులు, స్థానిక అధికారులు జారీ చేసిన ప్రజారోగ్య మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, అధిక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదివారం సూచించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఒ) ఈ పరిస్థితిని అంతర్జాతీయ ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. "డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఇతర ప్రభావిత దేశాలలో మారుతున్న పరిస్థితి దృష్ట్యా, డబ్ల్యూహెచ్‌ఒ సిఫార్సులకు అనుగుణంగా, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్‌లకు అత్యవసరం కాని ప్రయాణాలను మానుకో >>2

## కోళ్లు విలవిల

### ఉష్ణోగ్రత 45° దాటడంతో పౌల్ట్రీ రంగానికి దెబ్బ

### ఎపిలో రెండు రోజుల్లో 10 లక్షలుపైగా కోళ్లు మృతి

### తెలంగాణలోనూ పెద్ద సంఖ్యలో బలవుతున్న వైనం



**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** భానుడి భగభగలకు పౌల్ట్రీ పరిశ్రమ కుదేలవుతోంది. మునుపెన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటిపోవడంతో మూగజీవాలు ఎండ వేడిని తట్టుకోలేక ప్రాణాలు విడుస్తున్నాయి. ముఖ్యంగా గుడ్లు పెట్టే లేయర్ ఫారాలపై ఈ ఎండల ప్రభావం తీవ్రంగా చూపిస్తోంది. చనిపోయిన కోళ్లను గుంతలు తీసి పూడ్చిపెడుతున్న దృశ్యాలు స్థానికంగా కలచివేస్తున్నాయి. సాధారణ రోజులతో పోలిస్తే వేసవిలో కోళ్లను కాపాడుకోవడం పౌల్ట్రి రైతులకు కత్తిమీద సాములా మారింది. షెడ్లలో చల్లదనం కోసం అదనంగా లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. కోళ్ల ఫారాల చుట్టూ గోనె సంచులు కట్టి నిరంతరం తడపడం, షెడ్ల పైన గడ్డి వేయడం, లోపల కూలర్లు, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నా ఎండ తీవ్రతకు తట్టుకోలేక కోళ్లు ప్రాణాలు విడుస్తున్నాయి.



రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, నల్గొండ, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో పెద్ద సంఖ్యలో పౌల్ట్రి రైతులు ఉన్నారు. దేశీయంగా కోళ్లు, గుడ్లఉత్పత్తి, మాంసం లభ్యతలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉంది. పౌల్ట్రి పరిశ్రమపై ఆధారపడి రాష్ట్రంలో దాదాపు 5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. దేశంలోని కోళ్లలో తెలంగాణలో రాష్ట్రంలోనే 9.39 శాతం ఉన్నాయి. రాష్ట్రంలో రోజుకు 1,397.2 టన్నుల చికెన్ ఉత్పత్తి అవుతుండగా సగటున 5.04 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నట్టు తేలింది.నెల రోజులుగా ప్రతీ రోజూ 45 డిగ్రీలకు పైగా ఎండలు నమోదవుతుండడంతో ఎండవేడిని తట్టుకోలేక ఫారాల్లోని కోళ్లు ఊపిరాడక కుప్పకూలిపోతున్నాయి. మండే >>2

## కాంగ్రెస్‌కు బంగాళాఖాతమే


సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

### 'సర్'పై అనుక్షణం అప్రమత్తం కావాలి

### ఉచిత విద్యుత్ రద్దుకే రైతుల మోటార్లకు మీటర్లు: కెటిఆర్

**హైదరాబాద్ మే 24 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు పీకల్లోతు కోపం ఉంది. ఆపార్టీని బంగాళా ఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు.రాష్ట్రంలో పాలనను కాంగ్రెస్ గాలికొదిలేసిందని విమర్శలు గుప్పించారు. ఆదివారం ముఖ్యకార్యకర్తలసమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ.. 'మోటార్లకు మీటర్లు పెట్టి పూర్తిగా రైతన్నలకు ఉచిత విద్యుత్తును కాంగ్రెస్ ఎగరగొట్టే కుట్ర చేస్తున్నదన్నారు. 'మొదట ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర మీటర్లు పెట్టనున్నారు. ఆ తర్వాత బావుల వద్ద మోటార్ల దగ్గర కూడా మీటర్లు పెట్టనున్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై మోడీ ఎంతఒత్తిడి తెచ్చినా ఆనాడు >>2

## రేసింగ్.. ఛేజింగ్

### హైదరాబాద్ రోడ్లపై భయానక వాతావరణం సృష్టిస్తున్న పోకిరీలు

### అర్ధరాత్రి కార్ల విన్యాసాలతో కంగారుపడుతున్న జనం

### కారు ఢీకొని ఓ పోలీసుకు గాయాలు.. యువకుడి అరెస్టు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), మే 24 ప్రభాతవార్త:** వారాంతం వచ్చిందంటే ఐటి కారిడార్ సువిశాలమైన రోడ్లు పోకిరీలకు అడ్డాగా మారుతున్నాయి. అర్ధరాత్రి మితిమీరిన వేగంతో కారు, బైక్ రేసింగ్‌లు నిర్వహిస్తూన్న పోకిరీలు స్థానికంగా భయానక వాతావరణం స ృష్టిస్తున్నారు. రేసింగుల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో గతంలో పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. కాగా తాజాగా మరోసారి పోకిరీలు రెచ్చిపోయి రేసింగులకు పాల్పడుతుండగా, అడ్డుకునేందుకు యత్నించిన పోలీసుల మీదకు కారు దూకించడంతో ఓ కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రేసింగ్ కారునుఅడ్డుకొని స్వాధీనం చేసుకున్న రాయ >>2



శనివారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని ఐటి కారిడార్‌లో రేసింగ్ వాహనాన్ని అడ్డుకున్న పోలీసులు

## మంటల్లో ఎల్ & టి గెస్ట్ హౌస్

### • మేడిగడ్డలో భారీ అగ్ని ప్రమాదం • సకాలంలో చర్యలతో తప్పిన ప్రాణనష్టం

**మహాదేవపూర్, మే 24, ప్రభాతవార్త :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని అంబట్ పల్లి (మేడిగడ్డ) గ్రామ సమీపంలో గల ప్రసిద్ధ ఎల్ అండ్ టి గెస్ట్ హౌస్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మధ్యాహ్నం సుమారు 3:00 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు గెస్ట్ హౌస్ నలుమూలలా వ్యాపించడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. కాగా సమీప పొలాల్లో రైతులు వ్యవసాయ వ్యర్థాలను తగులబెట్టడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. స్థానికులు మరియు ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. అంబట్‌పల్లి గ్రామ శివార్లలోని వరి పొలాల్లో పంట కోతల అనంతరం మిగిలిన దుబ్బలు, గడ్డి వంటి వ్యవసాయ వ్యర్థాలను కొందరు రైతులు తగులబెట్టారు. అయితే ఎండ తీవ్రత ఎక్కువగా >>2


ఆదివారం మేడిగడ్డలో భగ్గుమన్న ఎల్ అండ్ టి గెస్ట్ హౌస్



ఆదివారం హరిద్వార్‌లో 'గంగా దసరా' పండుగకు ముందు గంగానదిలో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

# లారీల కొరతకు చెక్

>> క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత కోసం రెవెన్యూ, పోలీస్, పౌరసరఫరాలశాఖలతో కూడిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద నిరంతరం నిఘా ఉంచుతాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు విజయవంతంగా ధాన్యం సేకరణను కొనసాగిస్తున్నాయని, రైతులకు నేరుగా వారి ఖాతాల్లోకే చెల్లింపులు చేస్తున్నామన్నారు. ఈ ఒక్క ఏడాదిలోనే రైతులకు రికార్డుస్థాయిలో రూ.45,000 కోట్లు చెల్లించామని తెలిపారు. 48 గంటల నుంచి వారంరోజుల్లోగా రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం బకాయిల చెల్లింపులన్నీ పూర్తయ్యేలా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు.

# సూడాన్ దేశాలకు వెళ్లొద్దు

>> వాలని భారత ప్రభుత్వం భారత పౌరులందరికీ సూచిస్తోంది" అని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. బండిబుగ్యో వైరస్ స్ట్రెయిన్ వల్ల కలిగే ఎబోలా వ్యాధికి సంబంధించిన ఒక్క కేసు కూడా భారతదేశంలో నమోదు కాలేదని మంత్రిత్వ శాఖ తెలిపింది. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండాలను ప్రభావితం చేస్తున్న బండిబుగ్యో స్ట్రెయిన్ ఎబోలా వైరస్ కొనసాగుతున్న వ్యాప్తిని, ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (ఆఫ్రికా సిడిసి) అధికారికంగా ఖండాంతర భద్రత దృష్ట్యా ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. అంతేకాకుండా, మే 22న డబ్ల్యూహెచ్ఒ ఐహెచ్ఆర్ అత్యవసర కమిటీ, "బండిబుగ్యో వైరస్ ఉన్నట్లు నమోదు చేయబడిన ప్రాంతాలనుండి వచ్చే, కారణం తెలియని జ్వరంతో బాధపడుతున్న ప్రయాణికులను గుర్తించడం, అంచనా వేయడం, నివేదించడం, నిర్వహించడంతో పాటు బండిబుగ్యో వైరస్ ఉన్నట్లు నమోదు చేయబడిన ప్రాంతాలకు ప్రయాణించకుండా నిరుత్సాహపరచడం" కోసం ప్రవేశ ద్వారాల వద్ద వ్యాధి నిఘాను బలోపేతం చేయడానికి తాత్కాలిక సిఫార్సులను జారీ చేసింది. ప్రకటన ప్రకారం, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండాలకు సరిహద్దు దేశాలు, దక్షిణ సూడాన్‌తోసహా వ్యాధి వ్యాప్తి చెందే అధిక ప్రమాదంలో ఉన్నట్లు అంచనా వేసింది. ఎబోలా వ్యాధి అనేది ఎబోలా వైరస్ యొక్క బండిబుగ్యో వైరస్ స్ట్రెయిన్ సంక్రమణ వలన కలిగే ఒక వైరల్ హెమరేజిక్ జ్వరం. ఇది అధిక మరణాల రేటు కలిగిన ఒక తీవ్రమైన వ్యాధి. ప్రస్తుతం బుండిబుగ్యో వైరస్ జాతి వల్ల కలిగే ఎబోలా వ్యాధిని నివారించడానికి లేదా చికిత్స చేయడానికి ఎలాంటి టీకాలు లేదా నిర్దిష్ట చికిత్సలు ఆమోదించబడలేదు. బుండిబుగ్యో వైరస్ చాలా ప్రమాదకరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది.

# నేడు మహిళా భవనాలకు సిఎం రేవంత్ శంకుస్థాపన

## వర్చువల్‌గా నిర్మాణ పనులను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు వేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్న 8000 గ్రామ మహిళా భవనాలకు సోమవారం ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. గ్రామీణ మహిళలకు ఆర్థిక, సామాజిక, పరిపాలనా కార్యకలాపాలకు కేంద్రాలుగా మారనున్న ఈ మహిళా భవనాలు స్వయం సహాయక సంఘాల శక్తికి కొత్త చిరునామాగా నిలవనున్నాయి. శంకుస్థాపన అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో మహిళా సంఘాల ప్రతినిధులతో సిఎం ప్రత్యక్షంగా ముచ్చటిస్తారు. మహిళా సాధికారతపై ప్రభుత్వ లక్ష్యాలనువివరించనున్నారు. మహిళల అభిప్రాయాలు,సూచనలు తెలుసుకుంటూ వారిఅభివృద్ధికి ప్రభుత్వం అండగాఉంటుందనే భరోసా ఇవ్వనున్నారు.

# బస్సుల్లో భరోసా

>> చడానికి ఈ వ్యవస్థ ఎంతగానో దోహదపడనుంది. మహిళా ప్రయాణికులపై వేధింపులు, దొంగతనాలు, అనుచిత ప్రవర్తన వంటి ఘటనలకు చెక్ పెట్టేలా ఆర్‌టిసి నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా రాత్రి సమయాల్లో సుదూర ప్రాంతాలకు ఒంటరిగా ప్రయాణించే మహిళలు, వృద్ధులు ఈ నిఘా కన్ను ఏర్పాటు పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని సంస్థ ప్రకటించింది. బస్సులో సిసి కెమెరా ఉందనే భయం నేరగాళ్లలో గుబులు పుట్టిస్తుందని, ప్రయాణం మరింత సురక్షితంగా మారుతుందని ప్రజలు భావిస్తున్నారన్నారు. సిసి కెమెరాల ఏర్పాటు వల్ల డ్రైవింగ్ ప్రమాణాలుకూడా మెరుగవుతాయని, సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని అధికారులు పేర్కొంటున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు సాధించే ఫలితాలను బట్టి, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల బస్సులకు సీసీ కెమెరాల రక్షణ కవచాన్ని విస్తరించడానికి ఆర్‌టిసి యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లు సాగుకు ఉండవు

## అన్నదాతలకు పూర్తి మినహాయింపు: స్పష్టం చేసిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త :** తెలంగాణలో ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమల్లోకి రానున్నాయి. అయితే వ్యవసాయ బోర్లకు వినియోగించే మోటర్లకు మాత్రం మీటర్లు ఉండవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రక్రియలో అన్నదాతలకు మాత్రం ప్రభుత్వం పూర్తి మినహాయింపు ఇచ్చింది. వ్యవసాయ రంగంలో విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అమర్చడం లేదని తేల్చిచెప్పింది. గత ప్రభుత్వ కాలంలో జరిగిన ఒప్పందాన్ని కొనసాగిస్తున్నప్పటికీ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలను ఆధునీకరించడం, నష్టాలను తగ్గించడం, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్ (రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్). పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ ఆర్డీఎస్ఎస్ పథకంలో చేరాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ పథకం ద్వారా వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. సాగునీటి కనెక్షన్లకు ఎటువంటి స్మార్ట్ మీటర్లు ఉండవని ఈసందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ స్మార్ట్‌మీటర్ల ఖర్చుపై పూర్తి స్పష్టతతో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు భారం పడదని తేల్చిచెప్పారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే మొత్తం ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 60:40 నిష్పత్తిలో భరించనున్నాయి. విద్యుత్ సంస్థల ఆదాయ వ్యయాల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించడం ద్వారా మెరుగైన సేవలు అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. గతంలోనే దీనిపై ఒప్పందం జరిగినా, ఇప్పుడు దానిని అమలు చేసేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. విద్యుత్ ఛార్జీల పెంపు వంటి అంశాలు కేవలం విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయంపైనే ఆధారపడి ఉంటాయని అధికారులు తెలిపారు.

# దహేగాంలో అత్యధిక ఉష్ణోగ్రత

>> మంచి ర్యాల జిల్లా దండేపల్లి మండలం వెలగనూరు, సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం ముకుందాపురంలో 46.4డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, ములుగు, నల్గొండ జిల్లాల్లో 46.3డిగ్రీలు, హన్మకొండ, పెద్దపల్లి జిల్లాల్లో 46.2డిగ్రీలు, జయశంకర్, మహబూబాబాద్, నిర్మల్ జిల్లాల్లో 45.9డిగ్రీలు, వరంగల్‌లో 45.8డిగ్రీలు, కరింనగర్, నిజామాబాద్‌లో 45.7 డిగ్రీలు, యాదాద్రి భువనగిరిలో 45.6, సిద్ధిపేటలో 45.5, జనగామలో 45.4, రాజన్నసిరిసిల్లలో 45.2డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**పెరుగుతున్న వడదెబ్బ మరణాలు...**

కొద్ది రోజులుగా రాష్ట్రంలో భానుడు భగభగల ధాటికి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకుతోడు తీవ్రమైన వడగాలులు వీస్తున్నాయి. గాలిలో తేమ శాతం పూర్తిగా పడిపోవడంతో వడదెబ్బ రూపంలో మృత్యువు ముంచుకొస్తోంది. రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలతోపాటు వడగాలులు తోడకావడంతో ఎండదెబ్బ కారణంగా మృతి చెందుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గురు, శుక్ర, శని ఈ మూడు రోజుల్లోనే తెలంగాణలో 107 మంది వడదెబ్బబారిన పడి చనిపోయారు. శనివారం ఒక్క రోజే 51మంది వడదెబ్బతో ప్రాణాలు వదిలారు. ఇక శుక్రవారం 34 మంది, గురువారం 22 మంది వడదెబ్బకు గురై మృతిచెందారు. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లా నిప్పుల కుంపటిలా మారడంతో వడదెబ్బ తగిలి ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. ఆదివారం జిల్లాలోని గట్టు సింగారం గ్రామంలో దుంపల సాయి చరణ్ (31) అనే వ్యక్తి వడదెబ్బతో మృతి చెందాడు. రెండు రోజులుగా పనులనిమిత్తం ఎండలో బాగా తిరగడం వల్ల ఆదివారం ఇంట్లో అస్వస్థకు గురై సాయి చరణ్ మృతి చెందినట్లు తెలిపారు. వడదెబ్బ ప్రాణాలు తీస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వైద్యులు చెబుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలని అంటున్నారు. వడదెబ్బ తగిలితే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని, ఇంట్లోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

**చురుకుగా కదులుతున్న నైరుతి....**

నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయని వాతావరణశాఖ తెలిపింది. ముందుగా అనుకున్నట్లుగానే ఈనెల 26 నాటికి కేరళ రాష్ట్రాన్ని నైరుతి రుతుపవనాలు తాకుతాయని అంచనా వేసింది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో వర్షాలుకురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని తూర్పు, ఉత్తర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

# ఇందిరమ్మ బీమా

>> సంఘాలకు ఏటా రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైతే దీనిని రూ.లక్ష కోట్లకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని వివరించారు. త్వరలోనే మహిళా వ్యాపారవేత్తల కోసం ప్రత్యేకంగా 550 ఆర్టీసీ బస్సులను కేటాయించనున్నట్లు చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో సన్న బియ్యం పండుగ చేస్తున్నామని చెప్పారు. మార్కెట్లో కిలో రూ.50.55 పలుకుతున్న మేలు రకం సన్న బియ్యాన్ని రాష్ట్రంలోని 1.6 కోట్ల కుటుంబాలకు ఉచితంగా అందజేస్తున్న ఏకైక ప్రభుత్వంగా పేర్కొన్నారు. ప్రతి మనిషికి 6 కేజీల చొప్పున నేరుగా పేదల ఇళ్లకే సన్న బియ్యాన్ని పంపిస్తామని చెప్పారు. అలాగే గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుండటం వల్ల రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలకు కరెంటు బిల్లుల భారం తప్పిందన్నారు. అనేక గ్రామాల్లో 95 శాతం ప్రజలు జీరో బిల్లులు పొందుతున్నారని ఆయన వివరించారు. గత పదేళ్లలో గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను వంచించిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం ప్రతి పేదవానికి ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామన్నారు. తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో మరో 2 లక్షల ఇళ్లను అదనంగా మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వం ప్రధమ ప్రాధాన్య లక్ష్యమన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక కార్యకర్తలే దగ్గరుండి గృహప్రవేశాలు చేయించాలని సూచించారు. ఇదే సమయంలో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ఆకలితో ఉండకూడదన్న ఉద్దేశ్యంతో దేశంలోనే తొలిసారిగా ఉచిత బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టామని వెల్లడించారు. జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. కాగా రైతుల పండించిన ప్రతి మొక్కజొన్న గింజను, ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా మొక్కజొన్న కొనుగోళ్లు జరగకపోయినా, తెలంగాణలో పండిన ప్రతి మొక్కజొన్న గింజను, ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులను ఆదుకుంటోందన్నారు. త్వరలోనే ప్రభుత్వ పథకాలపై ఇంటింటికీ పాంప్లెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు.

# గురుదేవ్ రవిశంకర్‌ను కలిసిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే24:** రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, తన సతీమణి జానకి శుక్లాతో కలిసి బెంగళూరు అర్బన్ జిల్లా ఉదయపురలోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్‌ను ఆదివారం కలిసి ఆయన 70వ జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ 45వ వార్షికోత్సవం పూర్తిచేసుకున్న సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

# గొప్ప ఫ్రెండ్

>> గొప్ప నాయకుడు లేడని కొనియాడారు. అంతకుముందురోజే అమెరికా రాయబారి సెర్గియో గోరే ప్రధాని మోడీని అమెరికా సందర్శనకు రావాలని ట్రంప్ చేసిన ఆహ్వానాన్ని అందచేసారు. రుబియో తన పర్యటనలో మాట్లాడుతూ భారత్; అమెరికాలమధ్య సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుదిదశకు చేరుతోందని, రెండుదేశాలకు ఎంతో మేలుచేస్తుందని ప్రకటించారు.

# రేసింగ్.. ఛేజింగ్

>> దుర్గం పోలీసులు డ్రైవింగ్ చేస్తున్న యువకుడిని అరెస్టు చేశారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని మోహదీపట్నం ఆసిఫ్‌నగర్‌లో నివాసంఉండే మహ్మద్ రెహ్వాన్(18) పుల్లారెడ్డి కళాశాలలో డిగ్రీ 2వ సంవత్సరం చదువుతున్నాడు. ఇతను శనివారం రాత్రి మరో ముగ్గురు స్నేహితులు ఒవైసీస్, అయాన్, వసీంలతో కలిసి (ఏపి10ఎఎల్5684) ఆధునీకరించిన హోండా సిటీ కారులో ఐటి కారిడార్ నాలెడ్జ్ సిటీకి వచ్చారు. వీరితో పాటు మరికొంతమంది కార్లు, బైక్‌లమీద అర్ధరాత్రి సమయంలో రేసింగ్‌లు, విన్యాసాలు చేయ సాగారు. ఈ విషయమై సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో నాలెడ్జ్ సిటీలోని నిలోఫర్ కేఫ్ వద్దకు వెళ్లారు. మితిమీరిన వేగంతో, భారీ శబ్దంతో రహదారి మీద విన్యాసాలు, రేసింగ్‌లు చేస్తున్న వాహనాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో రెహ్వాన్ కారును రాయదుర్గం కానిస్టేబుల్ ఎం.రమేష్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా, కారును కానిస్టేబుల్ మీదకు దూకించాడు. దీంతో కానిస్టేబుల్ రమేష్ చేతికి స్వల్పగాయమైంది. అనంతరం కారును ఆపకుండా పరుగులు పెట్టించడంతో పోలీసులు వెంటపడి కారును అడ్డుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న ఒవైసీస్, అయాన్, వసీంలు పారిపోగా, డ్రైవర్ రెహ్వాన్ పోలీసులకు చిక్కాడు. దీంతో రెహ్వాన్‌ను అరెస్టు చేసిన పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు రెహ్వాన్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎల్ & టి గెస్ట్ హౌస్

>> ఉండటం, దానికి తోడు ఈదురుగాలులు తోడవడంతో పొలాల్లో రాజుకున్న మంటలు ఒక్కసారిగా అదుపు తప్పాయి. క్షణాల వ్యవధిలోనే ఈ మంటలు పక్కనే ఉన్న ఎల్ అండ్ టి గెస్ట్ హౌస్ ప్రాంగణంలోకి చొరబడ్డాయి. మంటలు గెస్ట్ హౌస్ ఆవరణలోని ఎండిన గడ్డి, చెట్లకు అంటుకుని వేగంగా భవనం వైపు దూసుకువచ్చాయి. దట్టమైన పొగలు, మంటలు ఎగిసిపడటాన్ని గమనించిన గెస్ట్ హౌస్ సిబ్బంది, అక్కడున్న వారు తక్షణమే అప్రమత్తమై భవనం వెలుపలికి పరుగులు తీశారు. దీంతో తృటిలో ఒక పెద్ద ప్రాణనష్టం తప్పినట్లయింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, అగ్నిమాపక శకటాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఫైర్ సిబ్బంది స్థానికులతో కలిసి మంటలను అదుపు చేయడానికి తీవ్రంగా శ్రమించారు. గెస్ట్ హౌస్ చుట్టూ మంటలు వ్యాపించకుండా ఉండేందుకు నివారణ చర్యలు చేపట్టారు.

ఈ ప్రమాదంలో గెస్ట్ హౌస్ ప్రాంగణంలోని కొంత భాగం, ఫర్నిచర్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర లీగల్ అప్‌డేట్స్ ఇంకా తెలియాల్సి ఉంది. పొలాల్లో వ్యర్థాలను కాల్చేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నివాస ప్రాంతాల సమీపంలో ఇలాంటి చర్యలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. కాగా ఈ అగ్నిప్రమాదం కేవలం ప్రమాదవశాత్తూ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా, లేక దీని వెనుక మరేదైనా కుట్ర కోణం ఉందా అనే దిశగా పోలీసులు, ఉన్నతాధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## వారం - వర్జ్యం

25-05-2026, అధికజ్యేష్ఠ సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
దశమి తె.5.11
ఉత్తరఫల్గుణి తె.4.09
వర్జ్యం : ఉ.10.27-మ.12.09
దు.మ.12.30-మ.1.22, 2) మ.3.06-3.58
శుభసమయం:ఉ.6.30-7.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** విదేశములో నున్న మిత్రుల నుండి కానుకలు, ధనము, లభించు అవకాశము కనిపిస్తున్నది. బంధువుల కలయిక.

**వృషభం:** నూతన వ్యాపార యత్నమును కొద్ది కాలము పాటు వాయిదాను వేయటం మంచిది. నూతన విద్యావకాశాలు కలవు.

**మిథునం:** దూరపు బంధువుల రాక విందులు, సమావేశములు,మిత్రులతో సంప్రదింపులు, ఆనందము నిస్తాయి.

**కర్కాటకం:** వృత్తి విషయములో కొంత ఓర్పును పాటించుట అవసరము. వృత్తిలో మీ తెలివితేటలు బాగా ఉపకరిస్తాయి.

**సింహం:** రాజకీయములు, సంఘములు, యూనియన్‌లు మొదలగు కార్యములకు అనుకూలం. స్పెక్యులేషన్ దూరంగా ఉండండి.

**కన్య :** మీ నిపుణతలకు సమర్థతలకు సదవకాశము లభిస్తుంది. ఆధ్యాత్మికత పట్ల శ్రద్ధ కనబరుస్తారు. బంధువుల కలయిక.

**తుల :** సహోద్యోగులతో అనుబంధములు మెరుగు పడతాయి. పాత ఋణములు వసులౌతాయి. వాహన సౌఖ్యం కలదు.

**వృశ్చికం:** కష్టమునకు తగిన ఫలితము వస్తుంది. సంతానము విద్యా విషయములో మిత్రుల సలహాలు ఉపయోగపడతాయి.

**ధనుస్సు:** బ్యాంక్ ఖాతాలను, లాకర్స్‌ను ప్రారంభించుటకు, అనుకూలమైన సమయం. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**మకరం:** సమయమునకు ఆహారము తీసికొని మీ ఆరోగ్యమును పరిరక్షించుకోండి. వ్యవహారాలు సాఫీగా సాగుతాయి.

**కుంభం:** సంస్థలో మీరు ఆశించిన మార్పును పొందగలుగుతారు. కుటుంబ వ్యవహారాలు సైతం సానుకూలంగా ఉంటాయి.

**మీనం :** ముఖ్యమైన కార్యక్రమములను గురించి ప్రాథమిక చర్చలను ప్రాత, కోతలను పూర్తి చేస్తారు. వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఆదివారం సిఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తమిళనాడు మంత్రి పి. విశ్వనాథన్

# సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన తమిళనాడు మంత్రి విశ్వనాథన్

## విశ్వనాథన్‌కు మంత్రులు పొంగులేటి, సీతక్క సన్మానాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే24:** ఇటీవల తమిళనాడు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పి. విశ్వనాథన్ హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వనాథన్‌ను సత్కరించి సిఎం అభినందనలు తెలిపారు. తమిళనాడు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖమంత్రి పి. విశ్వనాథన్ ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి మంత్రి పొంగులేటిని సత్కరించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా వేలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించి తమిళనాడు మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న పి. విశ్వనాథన్‌ను శాలువా, పూల మొక్కతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. తమిళనాడులో దాదాపు 59 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తరఫున మంత్రివర్గంలో చోటు దక్కించుకోవడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరింత ప్రజాసేవ చేయాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశ్వనాథన్ కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజా భవన్‌లో మంత్రి సీతక్కను తమిళనాడు మంత్రి విశ్వనాథన్ మర్యాదపూర్వకంగా కలిశారు. తన నివాసానికి చేరుకున్న విశ్వనాథన్‌కు మంత్రి సీతక్క,ములుగు డిసిసి అధ్యక్షులు పైడాకుల అశోక్ సాదర స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

# కాంగ్రెస్‌కు బంగాళాఖాతమే

>> రైతుల మోటార్లకు మీటర్లు పెట్టడాన్ని కెసిఆర్ ఒప్పుకోలేదు. కానీ రేవంత్‌రెడ్డి మీద కేసులున్నాయి కదా.. పాపం ఆయనకు భయమెక్కువ. అందుకే మోడీ తానా అనగానే తందానా అన్నడు. నిన్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.. మోటార్లకు మీటర్లు పెడ్తాడట. ఈ కాంగ్రెస్ పార్టీ ఫ్యూజులు పీకి వీళ్లను బంగాళాఖాతంలో వేద్దామా? లేదా ఇట్లనే చూసుకుంట కూర్చుందామా? ఆలోచన చేయాలని కెటిఆర్ పిలుపు నిచ్చారు. ప్రీ పెయిడ్ మీటర్లు పెడితే హైదరాబాద్‌లో మీ ఇండ్లళ్లకు కూడా వస్తాయి. ఆదానీలు, అంబానీలు వాళ్లయే ఉన్నయి. వాళ్లు ఇంటింటికి వచ్చి మీటర్లు పెడ్తరు. దీంతో ఉచిత కరెంట్ ఉత్తకరెంట్ అవుతుంది. మొత్తం బతుకు మళ్లీ ఆగమైతది. కెసిఆర్ అందుకే ముందే చెప్పిండు.. ఓటేసే ముందే ఆలోచించాలే. ఆగం కావొద్దన్నారని చెప్పుకొచ్చారని" కెటిఆర్ పేర్కొన్నారు.ప్రజలు ఇచ్చిన ఐదు సంవత్సరాల కాలంలో సగం పూర్తయినా ఇప్పటిదాకా ప్రజలకు గాని, రాష్ట్రానికి గాని కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేక చేతులెత్తేసిందని ఆరోపించారు. హైడ్రా, మూసి పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు. ఉన్న నగరాన్నే సిఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడంలేదు. ఇలాంటి నాయకుడు ఫ్యూచర్ సిటి నిర్మిస్తాడంటే నమ్మాలా?.మూసిని ప్రక్షాళన చేస్తా అంటున్న ముఖ్యమంత్రి ఆలోచన పైన, ప్రణాళికల పైన కెటిఆర్ విమర్శలు గుప్పించారు.

**'సర్'పై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి..**

సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సీరియస్‌గా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో అర్హులైన ఓట్లు పోవద్దు..దొంగ ఓట్లు ఉండవద్దని కెటిఆర్ స్పష్టం చేశారు.ఈ విషయంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, లేదంటే అసలుకే మోసం వస్తుందన్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు చేపట్టనున్న సర్ ప్రక్రియ నేపథ్యంలో బూత్ లెవల్ ఏజెంట్లు ఇప్పటినుంచే తగిన కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగాలని కోరారు.ఈ సందర్భంగా నాలుగు ప్రక్రియలను పూర్తిచేయాలని సూచించారు. 'మరణించిన వారి ఓట్లు తొలగించాలి..కొత్తగా అర్హత ఉన్న వారిని చేర్పించాలి..గతంలో ఇక్కడ ఉండి మరోచోటుకు వెళ్లినవారిని గుర్తించి వారి ఛాయిస్ వారరి సూచన మేరకు ఓట్లు చేర్చడం, తొలగించడం చేయాలి' అని దిశానిర్దేశం చేశారు. ఏమాత్రం పొరపాటు చేసినా భవిష్యత్‌లో నష్టపోయేది మనమే అన్నది గుర్తుంచుకోవాలని నొక్కిచెప్పారు.

# కోళ్లు విలవిల

>> ఎండలకు తోడు తీవ్రమైన వడగాల్పులు వీస్తుండడంతో ప్రతీ రోజూ వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాతపడుతున్నాయి. ఎండ వేడిని తట్టుకోలేక అటు బ్రాయిలర్, ఇటు లేయర్ కోళ్లు పెద్ద ఎత్తున మృత్యువాత పడుతుండటంతో పౌల్ట్రి రైతులకు భారీ నష్టాలు తప్పడం లేదు. మునుపెన్నడూ లేని విధంగా ఒకేసారి ఎండలు ముదరడంతో ఏం చేయాలో పాలుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. పొరుగు రాష్ట్రం ఏపిలో రెండు రోజుల వ్యవధిలోనే సుమారు 10 లక్షల కోళ్లు చనిపోవడంతో వేసవి తాపం పౌల్ట్రీ రైతులకు ఎంతటి నష్టాలను మిగులుస్తుందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఎండల ప్రభావం కేవలం కోళ్ల మరణాలకే పరిమితం కాకుండా కోడి గుడ్ల ఉత్పత్తిని కూడా కోలుకోకుండా దెబ్బతీసింది. ఫారాలలో గుడ్ల దిగుబడి దాదాపు 5 నుండి 10 శాతం వరకు పడిపోయిందని పౌల్ట్రీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోళ్లు మేత సరిగ్గా తినకపోవడం, నీరసించిపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా మారుతోంది. వేసవి ఎండల కారణంగా రైతులు కూడా కొత్త బ్యాచ్‌లు వేయడానికి భయపడుతున్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో మార్కెట్‌లో చికెన్, కోడిగుడ్ల కొరత ఏర్పడి, వాటి ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. వాస్తవానికి పౌల్ట్రీ రంగానికి ఈ యేడాది అస్సలు కలిసిరాలేదు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వచ్చిన వ్యాధుల కారణంగా అప్పట్లో ఒక బ్యాచ్ పూర్తిగా నష్టపోయింది. ఆ నష్టం నుంచి తేరుకోకముందే.. అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ యుద్ధ వాతావరణం పౌల్ట్రీపై గట్టి దెబ్బకొట్టింది. యుద్ధ ప్రభావంతో కోడిగుడ్ల ఎగుమతులు నిలిచిపోయి, మార్కెట్‌లో ధరలు పాతాళానికి పడిపోయాయి. ఒకవైపు వ్యాధులు, మరోవైపు మార్కెట్ లేకపోవడం, ఇప్పుడు ఊపిరాడకుండా చేస్తున్న ఉక్కపోత.. ఇలా వరుస సంక్షోభాలు పౌల్ట్రీ రంగాన్ని ముంచేస్తున్నాయి.అప్పుల ఊబిలో రైతులు..ఈ ప్రాంతంలో ఆక్వా రంగం తర్వాత ఎన్నో కుటుంబాలు పౌల్ట్రీ పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. రూపాయి రూపాయి కూడబెట్టి, బ్యాంకుల దగ్గర ఆస్తులు తాకట్టు పెట్టి కోట్లలో అప్పులు తెచ్చిన నిర్వాహకులు ఇప్పుడు ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. లక్షలకు లక్షలు బ్యాంకు రుణాలు తెచ్చి, అప్పులు చేసి పౌల్ట్రి ఫారాలను ఏర్పాటు చేస్తే వేసవి ఎండల కారణంగా కోళ్లు చనిపోతుండడంతో చేతికి పైసా రాకపోగా, ప్రతి నెలా బ్యాంకు వడ్డీలు, మేత (ఫీడ్) ఖర్చుల కోసం రైతులు మళ్లీ అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ నష్టాలను భరించలేక కొందరు రైతులు తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్యలకు పాల్పడుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

# వెంపటి, గరిమెళ్లకు నేడు 'పద్మశ్రీ'లు



వెంపటి కుటుంబశాస్త్రి



బాలకృష్ణప్రసాద్(ఫైల్)

**విజయవాడ,మే24, ప్రభాతవార్తప్రతినిధి:** అన్న మయ్య సంకీర్తనాచార్యుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం), ప్రొఫెసర్ వెంపటి కుటుంబ శాస్త్రిలకు పద్మశ్రీ అవార్డులను ఈ నెల 25వ తేదీన ప్రదానం చేయ నున్నారు. అన్నమయ్య కీర్తనకారులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, కేవలం తాళపత్ర గ్రంథాలకే పరిమితమైన అన్నమయ్య కీర్తనలను అద్భుతమైన రాగయుక్తంగా స్వరకల్పన చేసి, ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లిన అత్యంత ప్రతిభావంతుడైన వాగ్గేయకారుడు ఆయన. 1948 నవంబర్ 9న ఆంధ్ర ప్రదేశ్‌లో జన్మించిన బాలకృష్ణ ప్రసాద్, చిన్ననాడే తల్లిదండ్రుల వద్ద ప్రాథమిక సంగీత పాఠాలు నేర్చుకున్నారు. అనం తరం ప్రముఖ సంగీత సమ్రాట్ డాక్టర్ నేదునూరి కృష్ణమూర్తి వద్ద శిష్యరికం చేసి, తన శాస్త్రీయసంగీత పటిమను మరింత పదును పెట్టుకున్నారు. 1978లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రారంభించిన అన్నమాచార్య ప్రాజెక్ట్ లో చేరి, దాదాపు మూడు దశాబ్దాల పాటు నిరంతరాయంగా సేవలు అందించారు. ఆ తర్వాత కూడా జీవితాంతం టిటిడి ఆస్థాన విద్వాంసునిగా కొనసాగుతూ అన్నమయ్య సంకీర్తనల వ్యాప్తికి అహర్నిశలు శ్రమించారు.సంగీత లోకానికి ఆయన చేసిన ఈ అనన్య సామాన్యమైన సేవలకు గాను భారత ప్రభుత్వం సంగీత నాటక అకాడమీ అవార్డు (2020) తో గౌరవించింది. తిరుమల తిరుపతి దేవస్థానం, కంచి కామకోటి పీఠం, అహోబిల మఠంల నుంచి ఆస్థాన విద్వాన్‌బిరుదులను పొందారు. 2025 మార్చి 9న ఈ సంగీత శిఖరం శివైక్యం చెందింది. రాష్ట్రపతి భవన్లో జరిగిన వైభవ వేడుకలో ఆయన తరపున వారి కుటుంబ సభ్యులు ఈ విశిష్ట పురస్కారాన్ని రాష్ట్రపతి చే అందుకుంటారు.ప్రొఫెసర్ వెంపటి కుటుంబశాస్త్రి భాషా సేవలకు గుర్తింపుగా ఇప్పటికే 2014లో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా సర్టిఫికేట్ ఆఫ్ ఆనర్ లభించింది.

## బాన్సువాడలో ఎస్‌బి హెడ్‌కానిస్టేబుల్ లంచం తీసుకుంటున్న వీడియో వైరల్

### విచారణకు ఆదేశించిన అధికారులు

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా బాన్సువాడలో స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ ఒకరు పాస్‌పోర్టు పరిశీలనకు దరఖాస్తుదారుడి నుంచి లంచం తీసుకుంటున్న వీడియో జిల్లా వ్యాప్తంగా వైరల్‌గా మారింది. జిల్లాలోని బాన్సువాడ డివిజన్‌లో పాస్‌పోర్టుల పరిశీ లన బాధ్యతలను సురేష్ అనే హెడ్ కానిస్టేబుల్ చూస్తుంటాడు. బాన్సువాడలోని ఓ కాలనీలో పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఇంటికి వెళ్లిన సమయంలో సురేష్ లంచం తీసుకుంటున్నట్లు వీడియో ఆదివారం జిల్లావ్యాప్తంగా టివిల్లో ప్రసారం అయ్యింది. ఈ ఘటన ఎప్పుడు జరిగిందనేది తెలియ రాలేదు. కాగా ఈ వీడియో పోలీసు శాఖలో కలకలం రేపింది. దీనిపై జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర విచారణకు ఆదేశించారు. ఈ వీడియో అసలైనదా? లేదా నకిలీదా? అని అధికారులు పరిశీలిస్తున్నారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి

### ఎపి సర్కార్‌కు బిఆర్‌ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 24:** ప్రొఫెసర్ నాగేశ్వర్.. తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసం హరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్‌రావు హితవు పలికారు. భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.




## ధాన్యం కొనుగోళ్లపై కెటిఆర్‌కు అవగాహన లేదు

### తెలిసీతెలియకుండా మాట్లాడుతున్నారు

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజం

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్ల విషయంలో బిఆర్‌ఎస్ నేత కెటిఆర్ తెలిసీతెలియని మాటలు మాట్లాడుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వరి ధాన్యం గురించి కెటిఆర్‌కు ఏం తెలుసునని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎంత ధాన్యం దిగుబడి వస్తుంది..?, ఎలా కొనాలనేది ఆయనకు తెలియదన్నారు. రాజకీయాలు చేయడం తప్పితే కెటిఆర్‌కు వాస్తవాలు తెలియదని దుయ్యబట్టారు. ఈ మేరకు ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మాట్లాడారు. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని బదనాం చేసే పనిలో నిమగ్నమై ఉందని దుయ్యబట్టారు. అయితే రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో చేస్తున్నా తాము చెప్పుకోలేక పోతున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో హమాలీల కొరతతో కొంత ఇబ్బంది పడ్డామని, ఆ సమస్య ఇప్పుడు తొలిగిపోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇందుకోసం సుమారు రూ. 9 వేల కోట్లు రైతులకు చెల్లించామని తెలిపారు. మిగిలిన 16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందని , మరో వారం రోజుల్లో సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించామన్నారు.

## నిప్పుల కుంపటిగా జమ్మికుంట

### వడదెబ్బతో ఐదుగురి మృతి

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** వారం రోజులుగా కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గంలో భానుడి భగభగలతో ఐదు మండలాల పరిధిలో గ్రామాలు నిప్పుల కుంపటిగా మారాయి. ఆదివారం జమ్మికుంట మండలంలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వృద్దులు, వయోస్సులో ఉన్నవారు అన్న తేడా లేకుండా పక్షుల్లా ఐదు ప్రాణాలు రాలిపోయాయి. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో పిన్‌రెడ్డి అశ్విని (25) సంవత్సరాల యువతి వడదెబ్బ తగిలి ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయింది. ఇది ఇలా ఉండగా జమ్మికుంట పట్టణంలో యాచక వృత్తి కొనసాగిస్తూ జీవించే 62సంవత్సరాల వృద్దుడు ఎండ వేడిమి తట్టుకోలేక రైల్వే అండర్ బ్రిడ్జి మోరి వద్ద ప్రాణాలు వదిలాడు. అనాథగా చనిపోయిన యాచకున్ని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ (దిలీప్), 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్‌లు పోలీస్ సిబ్బంది సహకారంతో మృత్యువాత పడ్డ వృద్దున్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీకి తరలించారు. జమ్మికుంట పట్టణంలో 11వార్డుకు చెందిన గుల్లి లింగయ్య వ్యవసాయ పనులకు ఆరుబయటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురై పిట్టపిల్లలా నేలరాలిపోయాడు. ఇల్లందకుంట మండలం లక్ష్మాజిపల్లి గ్రామానికి చెందిన నేతకార్మికుడు కొడారి సారయ్య (70) నిత్యం కమలాపూర్ మండలంలోని మర్రిపల్లి గూడెంలోని చేనేత సంఘంలో మగ్గం పనిచేస్తూ సంఘంలో పనిచేసి ఇంటికి తిరిగి వచ్చాక తీవ్ర అస్వస్థతకు గురైన సారయ్య ఒక్కసారిగా నేలరాలిపోయాడు. హుజురాబాద్ పట్టణంలోని 13వ వార్డుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఏకుల రాజు (35) ట్రాక్టర్ పనికి ఆరుబయటకు వెళ్లి వడదెబ్బ తాకడంతో తీవ్ర అస్వస్థతకు గురైయ్యాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే రాజు మృత్యువాత పడ్డాడు. డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించుకునే రాజు మృత్యువాత పడడంతో ఆయన కుటుంబం రోడ్డున పడింది. జమ్మికుంట ప్రాంతంలో ఒకే రోజు ఐదుగురు మృత్యువాత పడడం ఈ ప్రాంత ప్రజలు తీవ్ర భయాభ్రాంతులకు గురవుతున్నారు. ప్రజలు ఇండ్ల నుండి బయటకు రాకూడదని, తప్పనిసరి పరిస్థితి అయితే ఉదయం 6గంటల నుండి 10గంటల లోపే బయటకు వచ్చి ఇండ్లు చేరుకోవాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఆదివారం హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు, పశుపక్షాదులు ఆరుబయట కనిపించకుండా కనుమరుగైపోయారు.

# జూలై 1 నుంచి 'విబిజిరామ్‌జీ' అమలులోకి

### ఉపాధి హామీ 125 రోజులకు పెంపు

### మౌలిక వనరులు, ఆస్తుల సృష్టి పనులే ఎక్కువ

### జిల్లాస్థాయిలో కలెక్టర్, క్షేత్రస్థాయిలో పంచాయతీ అధికారులే సమన్వయకర్తలు




**న్యూఢిల్లీ, మే 24:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి గ్రామీణ పథకం స్థానంలో ఎన్డీయే ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన విబిజిరామ్‌జీ 2026 చట్టాన్ని జులై ఒకటినుంచి అమలులోకి తెస్తోంది. గ్రామీణ వేతన ఉపాధిని మరింత విస్తృత పరిచి ఉత్పాదక ఆస్తుల సృష్టికి ప్రాధాన్యతనిస్తున్న ఈ చట్టం వికసిత్‌భారత్ 2047 సాధన దిశగా మరింత పటిష్టంగా పనిచేస్తుందని కేంద్రం చెపుతోంది. ప్రతి ఆర్థికసంవత్సరంలోఉపాధి హామీని 100 రోజులనుంచి 125 రోజులకు పెంచారు. కొత్తపథకానికి గ్యారంటీ కార్డులు జారీ అయ్యేవరకూ ప్రస్తుత ఎంఎన్‌జిరేగా కార్డులు చెల్లుబాటు అవుతాయని, దరఖాస్తుచేసిన 15 రోజులలోపు ఉపాధిని విదిగా కల్పించాలని చట్టంలో సూచించారు. కూలీ వేతనాలను డిబిటి ద్వారా నేరుగా కార్మికుల బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ ఖాతాల్లోకి వారానికి ఒకసారి లేదా గరిష్టంగా పని ముగిసిన పక్షంరోజులలోపు చెల్లించాలి. వేతనాలు 15 రోజులకు మించి జాప్యం జరిగితే, అప్పటినుంచి ప్రతిరోజుకు చెల్లించని వేతనాల్లో 0.05 శాతం చొప్పున కార్మికులు నష్టపరిహారం పొందే అర్హత కూడా కలిగి ఉంటారు. మొదటి 30 రోజులకు ప్రకటించిన వేతన రేటులో కనీసం నాలుగో వంతు ఆ తర్వాత కనీస ఉపాధి అంతరాయం లేకుండా చూపించాల్సి ఉంటుంది. జులై ఒకటవ తేదీనాటికి కొనసాగుతున్న పనులన్నీ కూడా కొత్తచట్టంపరిధిలో కొనసాగుతాయని, వాటిని కూడా పూర్తిచేయాల్సి ఉంటుందని చట్టంచెపుతోంది. పనులు అంతరాయం లేకుండా ఉపాధికి అడ్డంకి లేకుండా కేంద్రం అన్ని రాష్ట్రాలుకేంద్రపాలిత ప్రాంతాలకు తగినంత కార్మిక బడ్జెట్‌లు అందుబాటులో ఉంచింది. సరిపోని పక్షంలో కొత్తచట్టంలోని షెడ్యూల్‌కి అనుగుణంగా రాష్ట్రాలు కొత్తపనులు చేపట్టాలి. ముఖధృవీకరణద్వారా కార్మిక నమోదు జరుగుతుంది. కనెక్టివిటీ లేని ప్రాంతాలకు మినహాయింపు ఉంది. ఇంటికి వీలైనంత దగ్గరగా పని కల్పించాలి. ఐదు కిలోమీటర్లపరిధిలోనే ఉండాలి. ఆదూరం దాటితే కార్మికులకు లదనంగా 10శాతం చెల్లిస్తారు. ఈ పనులన్నీ కూడా మానవవనరులతోనే జరగాలని, యంత్రాలను వినియోగిస్తే కఠిన చర్యలుంటాయని కేంద్రం చెపుతోంది. వికసిత్‌గ్రామ్‌పంచాయతీ ప్రణాలిక కేంద్రంగా ఈపనులుంటాయి. పంచాయితీపరిధిలోనే పనులన్నీ చేపట్టాల్సి ఉంటుంది. ఒకే ప్రణాళిక బహుళ నిధులు అనే వ్యవస్థనుప్రోత్సహిస్తూ కేంద్రరాష్ట్ర స్థానిక పథకాలతో సమన్వయానికి వీలు కల్పిస్తుంది. పిఎంఎవై జి కింద చేపట్టే గృహనిర్మాణ పనులను కూడా 90నుంచి 95రోజుల వేతన మద్దతుకింద పనులుచేపట్టవచ్చని కొత్తచట్టం చెపుతోంది. జిల్లాస్థాయిలో కలెక్టర్ సమన్వయకర్త అవుతారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలోపనుల నమోదు అమలు రికార్డుల నిర్వహణ వంటివిచేపడతాయి. ఈశాన్య, హిమాలయ ప్రాంత రాష్ట్రాలకు కేంద్రం 90శాతం, రాష్ట్రాలు 10శాం నిదులు భరిస్తాయి. ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాలకు కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం నిధులు భర్తీచేస్తాయి. శాసనసభలు లేని కేంద్రపాలిత ప్రాంతాలకు నూరుశాతం కేంద్రనిధులు అందుతాయి.

కొత్తచట్టం కింద పెంచిన వేతన రేట్లను కూడా నోటిఫైచేస్తారని అప్పటివరకూ ఎంజిఎన్‌రేగా వేతనరేట్లే అమలవుతాయని కేంద్రం వివరించింది. గ్రామీణ స్థాయిలో మౌలికవనరుల సృష్టి, నీటివనరుల సంరక్షణ, వంటి అత్యవసర పనులకు కూడా విబిజిరామ్‌జీ చట్టంకింద ఉపాధి కల్పించాలని ఎన్డీయే సర్కారు ఉత్తర్వులు జారీచేసింది.

# మైనింగ్ అక్రమాలపై విచారణకు ఏర్పాట్లు

### ఫైలు సిద్ధం చేస్తున్న అధికారులు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయి నప్పటి నుండి జరిగిన మైనింగ్ అక్రమాలపై విచారణకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు జరుగుతున్నాయి. తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో మైనింగ్ అక్రమాలపై సిఐడీ విచారణకు ఆమోదించిన నేపథ్యంలో అందుకు అవసరమైన వివరాలను మైనింగ్ శాఖ సిద్ధం చేస్తున్నట్లు తెలియవచ్చింది. రాష్ట్ర ఆవిర్భావం జరిగిన 2014 జూన్ 2వ తేదీ నుంచి చోటుచేసుకున్న మైనింగ్ అక్రమాలపై సీఐడీతో దర్యాప్తు జరిపించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో సైతం ఆమోదించింది. దీంతో రాష్ట్ర మైనిగ్ అధికారులు అక్రమాలు, అవినీతికి సంబంధించిన వివరాలను క్రోడీకరించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం.

కరీంనగర్, ఖమ్మంలలో జరిగిన గ్రానైట్ తవ్వకాల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని, సినరేజీ, రాయల్టీ కింద ఖజానాకు రావాల్సిన రూ.వేల కోట్ల నిధులు రాలేదని మైనింగ్ అధికారులు ఇప్పటికే నిర్ధారణకు వచ్చారు. అలాగే మహబూబ్‌నగర్‌లో క్వార్జ్ తవ్వకాల్లో కూడా అక్రమాలు జరిగాయని, సిరిసిల్లలో భారీగా ఇసుక తవ్వకాలు జరిగినప్పటికీ ప్రభుత్వ ఖజానాకు నిధులు రాకుండా మళ్లించారని తేల్చారు. మొత్తంగా ఏడు ఏజెన్సీలు రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశాయని, దీనిపై సీఐడీ చేత సమగ్ర దర్యాప్తు జరిపించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు 2014 జూన్ 2వ తేదీ నుంచి జరిగిన మైనింగ్ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు కోరుతూ సీఐడీకి విధి విధానాలు జారీ చేయాలని మైనింగ్ శాఖను మంత్రివర్గం ఆదేశించినట్లు సమాచారం.

కాగా ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో మైనింగ్ అక్రమాల అంశంపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. సీఐడీ దర్యాప్తు జరిపిస్తామని సీఎం ప్రకటించగా... విపక్షాలు మాత్రం సభాసంఘం వేయాలని, న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి. అయితే, సీఎం ప్రకటించినట్లుగానే తాజాగా సీఐడీ దర్యాప్తునకు నిర్ణయం తీసుకున్నారు.

## జూన్ 10న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు!

### ఆదివారం ప్రారంభమైన రెండో విడత మూల్యాంకనం

### జూన్ 8తో ముగియనున్న మూల్యాంకన ప్రక్రియ

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు జూన్ 10న విడుదల చేయడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. 10న వీలుకాకపోతే 11న విడుదల చేయనున్నట్టు తెలిసింది. ఈ నెల 13 నుంచి నుంచి 21 వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు ఇంటర్ బోర్డు అధికారులు ప్రకటించారు. పరీక్షలు ముగిసిన ఈ నెల 21న మొదటి విడత మూల్యాంకనాన్ని రాష్ట్ర వ్యాప్తంగా 17 కేంద్రాల్లో ప్రారంభించారు. రెండో విడత మూల్యాంకనం ఆదివారం ప్రారంభమైంది. మొదటి విడతలో గురువారం సంస్కృతం, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, పొలిటికల్ సైన్స్ పేపర్-1,2తోపాటు గణితం పేపర్ 1(ఏ), 1(బి, 2(ఏ), 2(బీ) మూల్యాంకనం ప్రారంభించారు. ఆదివారం ప్రారంభమైన సెకండ్ సెల్‌లో ఫిజిక్స్, ఎకనామిక్స్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, హిస్టరీ పేపర్-1, 2 పేపర్ల మూల్యాంకనం చేపట్టనున్నారు. మూల్యాంకనం ప్రక్రియ జూన్ 8తో ముగియనున్నట్టు ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు. మూల్యాంకనం అనంతరం నిర్వహించే అప్‌లోడింగ్, అప్‌డేటింగ్ పనులను త్వరగా పూర్తి చేసుకొని ఈ నెల 10న ఫలితాలను విడుదల చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,98,358 మంది విద్యార్థులు పరీక్షలకు ఫీజు చెల్లించారు. వారి కోసం 889 పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. మొదటి సంవత్సరం పరీక్షలకు 2,67,285 మంది విద్యార్థులు ఫీజు చెల్లించగా.. సెకండియర్ పరీక్షలకు 1,31,073 మంది ఫీజు చెల్లించారు. ఫస్టియర్ విద్యార్థుల్లో 1,43,322 మంది బాలురు ఉండగా, 1,23,949 మంది బాలికలు ఉన్నారు. సెకండియర్ విద్యార్థుల్లో 83,692 మంది బాలురు కాగా, 47,371 మంది బాలికలున్నారు. మొదటి సంవత్సరం పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించారు.

889 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. వాటిలో 327 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, 102 ప్రభుత్వరంగ జూనియర్ కాలేజీలు, 460 ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ కోసం 10,685 మంది ఇన్విజిలేటర్లను నియమించగా 75 టీమ్స్ సిట్టింగ్ స్క్వాడ్స్‌ను మరో 75 టీమ్స్ ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు.

## ప్రియుడితో కలిసి భర్త హత్య

### 9 రోజుల తర్వాత బయటపడిన నిజం

### సంగారెడ్డి జిల్లాలో దారుణ ఘటన



ముత్యంరెడ్డి (ఫైల్)

**నారాయణఖేడ్, మే 24, ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లాలో సంచలన ఘటన వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన ఘటన ఆలస్యంగా బయటపడింది. ఈ విషాదకర సంఘటన నారాయణఖేడ్ మండలం గంగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యంరెడ్డి (30) తన భార్య ప్రవర్తనపై అనుమానం వ్యక్తం చేస్తూ తరచూ ప్రశ్నించేవాడు. దీంతో అతడే తమ అక్రమ సంబంధానికి అడ్డుగా మారుతున్నాడని భావించిన భార్య కల్పన, తన ప్రియుడు చింటుతో కలిసి అతడిని అంతమొందించాలని పథకం రచించింది. అనుకున్న ప్రకారమే ఇద్దరూ కలిసి ముత్యం రెడ్డిని హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం నేరాన్ని గుట్టుగా ఉంచేందుకు జేసీబీతో గొయ్యి తీయించి మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు సమాచారం. ఆ తర్వాత భర్త కనిపించడం లేదంటూ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసి అనుమానం రాకుండా ప్రయత్నించినట్లు తెలిసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించి అనుమానాస్పద అంశాలపై దృష్టి సారించారు. తమదైన శైలిలో విచారణ చేపట్టగా ఘటన జరిగిన 9 రోజుల తర్వాత భార్య, ఆమె ప్రియుడు అసలు నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి వెల్లడించారు. అధికారుల సమక్షంలో జెసిబి సహాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపగా, స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

# హైదరాబాద్‌లో ఉగ్ర కలకలం

### పాక్ ఉగ్రవాదులతో సంబంధాలున్న యుపి యువకుడి అరెస్టు

**హైదరాబాద్, (మేడ్చల్) మే 24, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి ఉగ్ర కలకలం రేగింది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన ఓ యువకుడు పొట్టకూటి కోసం హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడ ఓ హోటల్‌లో కార్మికుడుగా పనిచేస్తూ ఏకంగా పాక్‌లోని ఉగ్రవాదులతో సంబంధాలు కలిగి, ఉగ్రవాద సంస్థల్లో చేరేందుకు సోషల్ మీడియా ద్వారా యత్నించి పోలీసులకు దొరికి పోయాడు. ఈ సందర్భంగా ఇతని వద్ద డమ్మీ తుపాకీని, ఉగ్రవాదులతో చాటింగ్‌కు వాడిన సెల్‌ఫోన్‌ను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను మేడ్చల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆదివారం మీడియాకు వెల్లడించారు.

ఘజియా బాద్‌కు చెందిన జయిద్‌ఖాన్ (26) కొన్ని నెలల క్రితం ఇదే ప్రాంతంలో పనిచేసే తన స్నేహితుడు ఫైజల్ ఆహ్వానం మేరకు పొట్టకూటి కోసం నగరా నికి వచ్చాడు. అనంతరం మేడ్చల్‌లోని ముబారక్ హోటల్‌లో కార్మికుడుగా చేరాడు. అయితే కొంత కాలంగా ఇతను డమ్మీ తుపాకీతో రీల్స్ చేస్తూ అసలైన తుపాకీలా దానిని తిప్పుతూ సినిమా స్టయిల్‌లో వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇతని రీల్స్‌కు వ్యూవ్స్ బాగానే రావడంతోపాటు పాక్‌లోని కొందరు ఉగ్రవాదులు సోషల్ మీడియా ద్వారా వీటిని గమనించారు. అనంతరం జయిద్ ఖాన్‌తో వారు వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం ద్వారా పరిచయం పెంచుకుని చాటింగ్ చేయసాగారు. దీని తరువాత పాక్‌లోని ఉగ్రవాద నెట్‌వర్క్ కలిగిన ఓ సంస్థకు చెందిన షహబాద్ అనే ఉగ్రవాది జయిద్‌ఖాన్‌తో నేరుగా చాటింగ్ చేయసాగాడు. తమతో కలిసి పనిచేయాలని, ఇందుకోసం అసలైన ఆయుధాలను ఇస్తామని అతను కోరగా అందుకు జయిద్‌ఖాన్ అంగీకరించాడు. అయితే జయిద్ ఖాన్ సోషల్ మీడియా ఖాతాలపై కొంతకాలంగా కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు నిఘా వుంచగా అతని బండారం రట్టయ్యింది.

ఇతని వివరాలపై ఆరా తీయగా అతను మేడ్చల్‌లో ఉంటున్నట్లు తేలింది. దీంతో ఆదివారం ఉదయం జయిద్‌ఖాన్‌ను అరెస్టు చేశారు. నిందితుడి వద్ద ఒక డమ్మీ తుపాకీని, పాక్‌లోని ఉగ్రవాదులతో చాటింగ్ చేసేందుకు వాడిన సెల్‌ఫోన్‌ను జప్తు చేశారు. ఇతని బ్యాంకు ఖాతాలపై ఆరా తీస్తు న్నారు. పాక్ ఉగ్రవాదులతో ఇతను ఎలా చాటింగ్ చేశాడు? దీని వెనుకున్న వారెవరు? భారత్‌లో ఇతను ఏదైనా కుట్రలకు పాల్పడ్డాడా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. నిందితుడిని రిమాండుకు తరలించారు. ఈ సమావేశంలో డిఐ కిరణ్ కూడా పాల్గొన్నారు.



పాక్ ఉగ్రవాదులతో సంబంధాలు కలిగి మేడ్చల్ పోలీసులకు పట్టుబడిన జయిద్ ఖాన్

## గిరిజన్న వర్సిటీలో కొత్త కోర్సులు

### దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ములుగు జిల్లా కేంద్రంలోని సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇందుకు సంబంధించి 2026-27 విద్యాసంవత్సరంలో కొత్త కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఐఐటీ హైదరాబాద్, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) సహకారంతో ఈ కోర్సులను అందిస్తోంది. బీటెక్ (కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), బీఎస్సీ(హానర్స్ కంప్యూటర్ సైన్స్ అండ్ డేటా అనలిటిక్స్)లో ప్రవేశానికి ఇంటర్ ఎంపీసీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని యూనివర్సిటీ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు.

## ప్రశాంతంగా జరిగిన సివిల్స్ ప్రిలిమ్స్-2026 పరీక్ష

### జూన్‌లో ఫలితాలు విడుదల

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** ఆదివారం దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసెస్ -2026 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు సుమారు 8.19 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం జరిగిన ప్రిలిమ్స్ పరీక్ష ఫలితాలను జూన్‌లో విడుదల చేయనున్నారు. అనంతరం ఆగస్టు 21 నుంచి సివిల్స్-2026 మెయిన్స్ పరీక్షలను నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 48,284 మంది పరీక్ష రాయనున్నారు. వారిలో హైదరాబాద్ నగరంలో 44,209 మంది రాయనుండగా, వరంగల్‌లో 4,075 మంది పరీక్షకు హాజరుకానున్నారు. 933 ఖాళీల భర్తీకి యూపీఎస్సీ సివిల్స్-2026 పరీక్షను నిర్వహిస్తోంది. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పేపర్-1 పరీక్షను, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్-2 పరీక్షను నిర్వహించారు. పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేశారు. హైదరాబాద్‌లో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఇంచార్జ్ కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైఫాబాద్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో 119 దృష్టి వైకల్యం గల అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. హైదరాబాద్‌లో పేపర్-1కి 44205 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో మొదటి సెషన్స్‌లో 29609 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పేపర్-2కి 44205 మంది అభ్యర్థుల్లో 29262 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు.

## రాష్ట్ర ఖజానాకు నిధుల కొరత

### కీలక రంగాలపై తీవ్ర ప్రభావం

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిధుల కొరత, రెవెన్యూ రాబడులు ఆశించిన మేర రాకపోవడం వంటి కారణాల వల్ల పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలకు రాష్ట్ర సర్కార్ భారీగా నిధుల కోత విధించింది. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఆదాయానికి గండిపడటం, రియల్ ఎస్టేట్ రంగంలో మందగమనం తదితర కారణాలతో ఈ కోతలు అనివార్యమైనట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. లక్ష్యానికి మించి అప్పులు తెచ్చి సర్దుబాటు చేద్దామని ప్రయత్నించినా వీలుకాకపోవటంతో కొన్ని పథకాలకు నిధులు తగ్గించింది. అయినప్పటికీ, కొత్తగా ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం దశలవారీగా చేపడుతోంది. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, చేనేత, తదితర పథకాల్లో ఈ కోతలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆర్థిక శాఖ నివేదికలు చూస్తే ముఖ్యమైన పథకాలకు జరిగిన కోతలు, నిధుల వివరాలు చూస్తే మార్చి నెలతో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రూ.12,571 కోట్లు కేటాయించినప్పటికీ, వాస్తవంగా కేవలం రూ.5,400 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. దీంతో రూ.7,000 కోట్ల మేర భారీ కోత పడింది. అలాగే రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో చేనేత రంగానికి గతంలో రూ.368 కోట్లు కేటాయించగా, ఈసారి కేవలం రూ.258 కోట్లు మాత్రమే కేటాయించినా అందులో కూడా రూ.110 కోట్లు కోత పెట్టింది. రైతు భరోసా పథకానికి అర్హతలపై ప్రభుత్వం పరిమితులు విధించింది. భారీ భూములున్న సంపన్నులకు ఈ పథకం దక్కకుండా కేవలం 5 ఎకరాలలోపు ఉన్న రైతులకే పరిమితం చేయాలని, లబ్ధిదారుల సంఖ్యను తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇక ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ.600 కోట్లు కేటాయించినా పథకం ఆరంభం కాలేదు. అలాగే ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, మరియు విద్యార్థుల ఉపకార వేతనాల నిధులలో కూడా కోతలు పడ్డాయి. రైతు భరోసా పథకానికి ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి రూ.18,000 కోట్లు కేటాయించగా, రూ.14,397 కోట్లు మాత్రమే వ్యయం చేయగలిగింది. రబీ సీజన్‌లో రెండు దఫాలుగా 2 ఎకరాల లోపువారికి పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. వచ్చే జూన్ నుంచి 2026-27 ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున మూడో విడత కూడా జమ చేస్తామని ప్రకటించినప్పటికీ నిధులు జమ చేస్తుందా లేదా అన్నది సందిగ్ధంగా మారింది. రైతు బీమా పథకానికి రూ.666 కోట్ల మేర నిధులు తగ్గినట్లు తెలుస్తోంది. మరోపక్క వ్యవసాయ కేంద్ర పథకాల కింద తెలంగాణకు అందే నిధుల్లో దాదాపు రూ.51 కోట్ల మేర కోత పడింది.

వార్త

సర్వ ప్రపంచాన్ని సైతం శాసిస్తూ మనిషి అసంతృప్తితో బాధపడతాడు. తనను తాను సంతోషంగా ఉంచుకోవడం చేతకాకపోతే.

- సెనెకా

# సమ్మె హక్కుకు సర్వోన్నత ముద్ర!

కార్మికుడి గళం 'సమ్మె హక్కు'కు అంతర్జాతీయ న్యాయస్థానం రాజముద్ర వేసింది. ప్రపంచ కార్మిక చరిత్రలోనే ఇదొక చారిత్రాత్మక ఘట్టం. కార్మికుడు తన గళాన్నివినిపించే ఒకేఒక సాధనం సమ్మె. తద్వారా తమ డిమాండ్లను వినిపించడం, చర్చించడం, దాని లోతుపాతుల విషయమై యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్ళడం లోని ఔచిత్యాన్ని అంతర్జాతీయ కార్మిక న్యాయ స్థానం సబబేనని పేర్కొనడమంటే కార్మిక లోకపు హక్కుల మీద పాలు పోసినట్లే. జీతాలు పెంచమని అర్థించినా, పని గంటలు తగ్గించమన్నా, భద్రత కల్పించమని కోరినా, లింగ వివక్ష చూపవద్దని ప్రాధేయపడినా యజమాన్యం సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ఉంది. వినక పోతే కార్మికుడి చేతికి అందిన చివరి ఆయుధం సమ్మె మాత్రమే. అందుకే సమ్మె హక్కును నిరాకరించడం అంటే కార్మికుడిని మౌన బానిసగా మార్చడమే. 2024 గ్లోబల్ రైట్స్ ఇండెక్స్ ప్రకారం, ప్రపంచంలోని చాలా దేశాలు సమ్మె హక్కును పరిమితం చేయడం మొదలు పెట్టాయి. అనేకచోట్ల యూనియన్ నాయకుల అరెస్టులు కూడా పెరిగాయి. ఇలాంటి నేపథ్యంలో అంతర్జాతీయ న్యాయస్థానం వెలువరించిన అభిప్రాయం కార్మిక వర్గాలకు ఒక మానసిక బలాన్ని అందిస్తోంది. ఐక్యరాజ్యసమితి అత్యున్నత న్యాయస్థానం అయిన ఇంటర్నేషనల్ కోర్టు ఆఫ్ జస్టిస్ కార్మికులకు 'సమ్మె హక్కు' అంతర్జాతీయ కార్మిక హక్కులలో అంతర్భాగమని స్పష్టంచేసింది. ఈ అభిప్రాయం అంతర్జాతీయ కార్మిక సంస్థ కోరిన మేరకు సలహా అభిప్రాయం రూపంలో వెలువడింది. ప్రపంచ వ్యాప్తంగా కార్మికోద్యమాలకు, ట్రేడ్ యూనియన్లకు, శ్రమ హక్కుల ఉద్యమాలకు ఒక నూతన నైతిక బలం. 1948లో ఆమోదించబడిన ఐఎల్ఓ కన్వెన్షన్ నం. 87లో 'సమ్మె' అనే పదం ప్రత్యక్షంగా లేకపోయినా, 'సంఘ స్వేచ్ఛ'లహక్కులో భాగంగానే సమ్మెహక్కు ఉందని ఐఎల్ఓ నిపుణుల కమిటీ దశాబ్దాలుగా భావిస్తోంది. అయితే 2012 తర్వాత కొన్ని యజమాన్య వర్గాలు ఈ వ్యాఖ్యానాన్ని వ్యతిరేకించాయి. ఒప్పందంలో స్పష్టంగా లేని హక్కును ఎలా చట్టపరంగా గుర్తిస్తారు? ఈ వివాదం అంతర్జాతీయ కార్మిక వ్యవస్థలోనే సంక్షోభాన్ని తెచ్చింది. చివరకు ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు ఐఎల్ఓ, అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఎనిమిది గంటల పని విధానం, కనీస వేతనం, ప్రసూతి సెలవులు, బాలకార్మిక నిషేధం ఇవన్నీ సమ్మెల కారణంగా సాధించుకున్న ఫలితాలే. వాటి పర్యవసానం కార్మిక సంక్షేమమే అయినప్పుడు, వాటిని వద్దనే పరిస్థితి ఉండదు. అందుకే ఉద్యమాలే ఆధునిక కార్మిక చట్టాలకు పునాదిగా భావించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ కార్మిక సంక్షోభ సమయంలో ఈ తీర్పు అందరికీ శిరోధార్యమే. ప్రపంచవ్యాప్తంగా 'గిగ్ ఎకానమీ', కాంట్రాక్టు ఉద్యోగాలు, ప్రైవేటీకరణ, ఆటోమేషన్ పెరుగుతున్నాయి. ఉద్యోగ భద్రత తగ్గుతోంది. ట్రేడ్ యూనియన్ల శక్తి క్షీణిస్తోంది. భారత రాజ్యాంగం ప్రత్యక్షంగా 'సమ్మెహక్కు'ని ప్రాథమిక హక్కుగా గుర్తించక పోయినా సామాజిక స్వేచ్ఛకు శిఖరాయమాన ప్రాధాన్యతనిస్తూనే ఉంది. భారతదేశంలో తరచుగా ప్రభుత్వ ఉద్యోగుల సమ్మెలపై ఆంక్షలు, నిత్యావసర సర్వీసుల చట్టాలు, కార్మిక చట్టాల మార్పులు వివాదాలకు దారితీస్తుంటాయి. కొత్త లేబర్ కోడ్స్ అమలులోకి వస్తున్న తరుణంలో ఈ అభిప్రాయానికి ప్రాముఖ్యత సంతరించుకుంది. భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో కార్మికుడి గొంతుకను వినడం ప్రభుత్వ బాధ్యత. సమ్మెను శత్రుత్వంగా కాకుండా సామాజిక సంభాషణలో భాగంగా చూడాల్సిన అవసరాన్ని గుర్తించడం అవసరం. అంతర్జాతీయ న్యాయస్థానం ప్రస్తావించిన అంశాలలోసమ్మె హక్కు అపరిమితం కాదు. అత్యవసర సేవలు, ప్రజాభద్రత, ఆరోగ్య రంగం వంటి కొన్ని సందర్భాల్లో పరిమితులు ఉండవచ్చు. కానీ ఆ పరిమితులు ప్రజాస్వామ్యబద్ధంగా, న్యాయబద్ధంగాఉండాలి. సమ్మెలు లేకపోతే తక్కువ జీతాలు, అధిక పని గంటలు, అసురక్షిత పరిస్థితులు పెరిగే ప్రమాదంఉంటుంది. ఎక్కడైనా, ఏసందర్భంలోనైనా హక్కులతో పాటు బాధ్యతల గుర్తుంచుకుని ప్రవర్తించినప్పుడే వర్గ ప్రయోజనాలు కాపాడబడతాయి. ప్రస్తుతం కొత్త లేబర్ కోడ్స్ నేపథ్యంలో సమ్మె హక్కుపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. సమ్మె ఒక శక్తివంతమైన ఆయుధం కాబట్టి, దాని వినియోగంలో సమతౌల్యం అవసరం. అలాంటప్పుడే హక్కుల సంరక్షణకు తిరుగులేదన్న మాటే! తరచుగా సమ్మెలు జరిగే ప్రాంతాల్లో పెట్టుబడిదారులు వెనుకంజవేయవచ్చు. దీంతో కొత్త పరిశ్రమలు రావడం తగ్గుతుంది. కొన్ని సందర్భాల్లో సమ్మెలు కార్మిక సమస్యలకంటే రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించబడతాయి. అసలు కార్మిక సమస్యలు పక్కకు వెళ్లిపోతాయి, ఈ విషయంలో జాగ్రత్త పడాల్సి ఉంటుంది. ప్రజల్లో సమ్మెలపై వ్యతిరేక భావన పెరుగుతుంది. ఎక్కడైనా, ఏ సందర్భంలోనైనా హక్కులతోపాటు బాధ్యతల గుర్తుంచుకుని ప్రవర్తించినప్పుడే వర్గ ప్రయోజనాలు కాపాడబడతాయి. భారత రాజ్యాంగం ప్రత్యక్షంగా సమ్మె హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించలేదు. కానీ సంఘస్వేచ్ఛను హామీఇస్తుంది. భారత కోర్టులుపలుమార్లు సమ్మెల సందర్భంగా హితవుపలికినసందర్భాలున్నాయి. ప్రస్తుతం కొత్త లేబర్ కోడ్స్ నేపథ్యంలో సమ్మెహక్కుపై దేశవ్యాప్తంగా చర్చజరుగుతున్న సందర్భంలో ఈతీర్పు స్వాగతించదగినది. నియంత్రణలేని సమ్మెలు ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తాయి. కార్మికుడి గౌరాన్ని కాపాడే సాధనం. సమ్మెలవల్ల సమాజంలో అనేక చారిత్రాత్మక మార్పులువచ్చాయి. అయితే సమ్మె ఒక శక్తివంతమైన ఆయుధం కాబట్టి, దాని వినియోగంలో సమతౌల్యం అవసరం.

# ఆదాయార్జనకే పెట్రో వడ్డింపులా?

ఇథనాల్‌కు సులభంగా మండే గుణం వుంది. ఈ కారణంగానే పెట్రోల్లో కలుపుతున్నప్పటికీ మోటారు వాహనాల ఇంజన్లకు హాని చేస్తుంది. ప్రస్తుతం నిపుణుల సూచనలమేరకు 10 శాతం వరకు ఇథనాలు పెట్రోల్లో కలుపుతున్నారు. అయితే 10శాతానికి మించి పెట్రోల్లో ఇథనాల్ కలిపే పక్షంలో వాహనాల ఇంజన్లు దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. కానీ ప్రజలు ఎలాపోతే మాకేంటి అనే ధోరణిలో ఇథనాల్ ద్వారా ఆదాయం పెంచుకోవాలని ఆయిల్ కంపెనీలు భావిస్తున్నాయి. అంతర్జాతీయ చమురు ధరలతో సంబంధం లేకుండానే రష్యా మనకు తక్కువ ధరకే క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తోంది. మీడియా ప్రభావం నేపథ్యంలో ప్రజలు ఈ విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొంటూనే వున్నారు. అధికారంలో వున్న ప్రభుత్వాలు ఎవరి కోసం పనిచేస్తున్నాయని సులభంగా అర్థం చేసుకొంటారు. కొందరిని కొంత కాలమే మోసం చేయగలరు అందరినీ అన్ని సమయాలలో మోసం చేయడం సాధ్యం కాదనే విషయం గుర్తించాలి.



అన్నవరపు బ్రహ్మయ్య

కేంద్ర ప్రభుత్వం ఆదాయమే పరమార్థంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచడంతోపాటు పెట్రోల్లో ఎథనాల్ కల్తీ చేయటానికి సిద్ధమవుతోంది. అమెరికా, ఇరాన్ యుద్ధం పేరు చెప్పి అనుకొన్నట్టుగానే కేంద్రప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు 3 నుంచి 3.50 రూపాయలకు పెంచింది. ఇదే సమయంలో పెట్రల్లో ప్రస్తుతం కలుపుతున్న 10 శాతం ఇథనాల్‌ను 20 శాతానికి పెంచడానికి రంగం సిద్ధం చేస్తోంది. పెరిగిన ధరలు ప్రజలకు భారంగా అనిపించకూడదనే ఎత్తుగడలో భాగంగా ఆయిల్ కంపెనీల ద్వారా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌కు కృత్రిమ కొరతను సృష్టించి, ధర సంగతి ఎలా వున్నా అసలు పెట్రోల్, డీజిల్ దొరికితే చాలనే రీతిలో ప్రజలను మానసికంగా సిద్ధం చేసి, తర్వాత రెండు దఫాలుగా ధర పెంచింది. అయినా పెరిగిన ముడిచమురు ధరలతో పోల్చితే పెరిగిన, పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలు చాలా తక్కువ అంటూ ఆంగ్ల జాతీయ పత్రికలలో వార్తలను వండి వడ్డిస్తోంది. దీనిని బట్టి మరోసారి పెట్రోలియం ధరల పెంపునకు రంగం సిద్ధం అవుతున్నట్లు అర్థం అవుతోంది. ప్రజలపై పన్నుల భారం మోపడంలో ముందుండే కేంద్ర ప్రభుత్వం నిజానికి యుద్ధం ప్రారంభమైన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచివుండేది. కానీ ఇటీవల వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల పుణ్యమా అని కొంత అలక్ష్యంగా ధరలు పెంచింది. పెట్రోలియం ధరలతో మాకేమి సంబంధం లేదు, అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ఆయిల్ కంపెనీలు ధరలు స్థిరీకరించుకొంటాయంటూ కేంద్రప్రభుత్వం అనేకమార్లు ప్రకటించింది. కాని అదే కేంద్రప్రభుత్వం అంతర్జాతీయంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు గణనీయంగా పడిపోతున్నప్పుడు పన్నుల మీద పన్నులు, సెస్లను విధిస్తూ తగ్గిన పెట్రోలియం ధరలు ప్రజలకు అందకుండా శాయశక్తులా ప్రయత్నం చేసింది. మనదేశంలో ఆర్థిక సంస్కరణలు అమలులోకి రావడానికి పూర్వంఅంటే 1980 సంవత్సరానికి ముందు వరకు దాదాపు లక్ష కోట్ల రూపాయల పెట్రోలియం రిజర్వుపూల్ మనీ వుంది. అంతర్జాతీయంగా పెట్రోలియ ఉత్పత్తుల ధరలలో ఒడిదుడుకులు వచ్చినప్పుడు ధర నియంత్రణ, క్రమబద్ధీకరణ నిమిత్తం ఈ నిధిని వినియోగించేవారు. అయితే ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో దేశంలోని చమురు కంపెనీలకు ధరల నిర్ణయంలో స్వేచ్ఛనిచ్చి, ఇక ధరలతో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని చెప్పి క్రమంగా రిజర్వుపూల్ మనీని కేంద్రప్రభుత్వం వినియోగించుకొంది. ధరల నిర్ణయం విషయంలో కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛనివ్వడంతో అంతర్జాతీయం పెట్రోలియం ధరలను చూపిస్తూ ఆయిల్ కంపెనీలు మూడు అడుగులు ముందుకి, ఒక అడుగు వెనక్కి అన్న తరహాలో పెట్రోల్ ధరలను విపరీతంగా పెంచాయి. కోట్ల రూపాయల లాభాలు పొందాయి. కొన్ని ప్రైవేటు సంస్థలు విపరీతమైన లాభాలు పొందాయి. యుపిఎ ప్రభుత్వం తరపున మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా వున్న సమయంలో అంతర్జాతీయంగా క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 160 డాలర్లు వుంది. అయినా లీటరు పెట్రోల్ ధర 74 రూపాయలకే అందించారు. ఎన్డీయే ప్రభుత్వం తర్వాత అంతర్జాతీయ చమురు కంపెనీల మధ్య పోటీ పెరగడంతోపాటు రష్యాపై అమెరికా ఆంక్షల నేపథ్యంలో బ్యారెల్ ధర రెండొంతులకు పడిపోయి బ్యారెల్ 46డాలర్లకు చేరింది. ఆ సమయంలో అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా కనీసం లీటరుపెట్రోల్ 25 రూపాయలకు తగ్గిపోవాలి. కానీ ఎన్డీఎ ప్రభుత్వం ధర



తగ్గించకపోగా వివిధకారణాలు చెబుతూ పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల మీద పన్నులు, సెస్లు విధిస్తూ క్రమంగా లీటరు పెట్రోల్ ధరను 74 నుంచి 109 రూపాయలకు పెంచుతూ వచ్చింది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలో దాదాపు 50శాతం పన్నులే వున్నాయి. నిజానికి కేంద్ర ప్రభుత్వం తొలుత పెట్రోలియం ఉత్పత్తులపై సెంట్రల్ ఎక్సయిజ్ (దిగుమతి సుంకం) విధించాలి. ఆ తర్వాత పెట్రోల్, డీజిల్ రిటైల్గా అమ్ముతున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సేల్స్ టాక్స్, టర్నోవర్ టాక్స్ విధించాలి. అయితే కేంద్రం ప్రభుత్వంపెట్రోలియం ఉత్పత్తులపై బేసిక్ ఎక్సైజ్‌టాక్స్ మాత్రమే విధించాలి. కానీ బేసిక్ టాక్స్ పూర్తిస్థాయిలో పెంచిన తర్వాత ఇంకా పెంచడానికి అవకాశం లేకపోవడంతో సెస్ ఆన్ ఎక్సయిజ్, మౌలిక సదుపాయాల సెస్ పేరుతో నాలుగు రకాలుగా విభజించి పన్నువేస్తోంది. ఈ కారణంగా అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు ఆ ఫలితం ప్రజలకు చేరకుండా లక్షల కోట్ల రూపాయలను కేంద్రప్రభుత్వం కాజేసింది. ఇక రాష్ట్ర ప్రభుత్వాలు బంక్ల నుంచి అమ్మకపు పన్నుతోపాటు టర్నోవరు టాక్స్‌తోపాటు రోడ్ సెస్, ఎడ్యుకేషన్ సెస్ పేరుతో లీటరు రూపాయి వంతున అదనంగా వసూలు చేస్తున్నారు. యుద్ధం నేపథ్యంలో బ్యారెల్ ధర 100 నుంచి 110 డాలర్ల మధ్య వున్నప్పటికీ మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా వున్న సమయంలో క్రూడ్ అయిల్ బారెల్ ధర 148 డాలర్లతో పోల్చితే తక్కువగానే వుంది. అయినా ఏదో కారణంగా ఏదో జరిగిపోతుందనే ధోరణిలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం మరల సిద్ధం అవుతోంది. ప్రస్తుతం క్రూడ్‌ఆయిల్ ధరలు 110 డాలర్లకు చేరినప్పటికీ పన్నుల మీద పన్నులు, అన్యాయంగా విధిస్తున్న సెస్లు లేకపోతే మనకు లీటరు పెట్రోల్ న్యాయబద్ధంగా వసూలు చేసే పన్నులతో కలుపుకొని 82 రూపాయలకే లభిస్తుందని ఆయిల్ రంగనిపుణులు చెబుతున్నారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయంగా రష్యాకు చెందిన క్రూడ్ ఆయిల్ కొనుగోలుపై ఆంక్షలు వున్నాయి. ఆ సమయంలో రష్యాతో మన దేశానికి వున్న స్నేహసంబంధాల నేపథ్యంలో రష్యా చాలా చౌకగా క్రూడ్ ఆయిల్ సరఫరా చేసింది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు ఏమాత్రం తగ్గించలేదు. ఇరాన్ అమెరికా యుద్ధం జరుగుతున్నప్పటికీ రష్యా మన దేశానికి అంతర్జాతీయ ధరల కంటే తక్కువ ధరకే క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తూనే వుంది. ఈ విషయాన్ని బహిర్గతం చేయకుండా మరల పెరిగిన క్రూడ్‌ఆయిల్ ధరలకు అనుగుణంగా ధరలు పెంచలేదని, అందువల్ల మరోసారి ధరలు పెంచడానికి సిద్ధం అవుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇక ఇథనాల్ విషయానికి వస్తే దేశీయంగా చౌకగా లభించే ఇథనాల్ ద్వారా కూడా కేంద్రప్రభుత్వం భారీగా ఆదాయం పొందుతోంది. మనదేశంలో దాదాపు 10 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం సూచన మేరకు ఆయిల్ కంపెనీలు 10 శాతం మేరకు పెట్రోల్లో ఇథనాల్ కలుపుతోంది. ఈ మొత్తాన్ని 20 శాతానికి పెంచే ఆలోచన చేస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఈ ఇథనాల్ చెరకు పిప్పి, మొక్కజొన్న నుంచి దేశీయంగా, చౌకగా తయారవుతుంది. దీనికి ఎక్సైజ్‌సుంకం వుండదు. కానీ ప్రభుత్వం పెట్రోల్లో కలపడం ద్వారా ఇథనాలు కూడా ఎక్సైజ్ సుంకం కలపడంతోపాటు పెట్రోల్తో సమానంగా ప్రజల నుంచి ధరవసూలు చేస్తోంది. ఇథనాల్‌కు సులభంగా మండే గుణం వుంది. ఈ కారణంగానే పెట్రోల్లో కలుపుతున్నప్పటికీ మోటారు వాహనాల ఇంజన్లకు హాని చేస్తుంది. ప్రస్తుతం నిపుణుల సూచనల మేరకు 10 శాతం వరకు ఇథనాలు పెట్రోల్లో కలుపుతున్నారు. అయితే 10 శాతానికి మించి పెట్రోల్లో ఇథనాల్ కలిపే పక్షంలో వాహనాల ఇంజన్లు దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. కానీ ప్రజలు ఎలాపోతే మాకేంటి అనే ధోరణిలో ఇథనాల్ ద్వారా ఆదాయం పెంచుకొనేందుకు ఆయిల్ కంపెనీలు భావిస్తున్నాయి. అంతర్జాతీయ చమురు ధరలతో సంబంధం లేకుండానే రష్యా మనకు తక్కువ ధరకే క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తోంది. మీడియా ప్రభావం నేపథ్యంలో ప్రజలు ఈ విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొంటూనే వున్నారు. అధికారంలో వున్న ప్రభుత్వాలు ఎవరి కోసం పనిచేస్తున్నాయని సులభంగా అర్థం చేసుకొంటారు. కొందరిని కొంత కాలమే మోసం చేయగలరు అందరినీ అన్ని సమయాల లో మోసం చేయడం సాధ్యం కాదనే విషయం గుర్తించాలి. •

ఒక అవకాశం చేజారిపోతే కళ్ల నీళ్లు పెట్టుకోకు. మరొక అవకాశం చేజారి పోకుండా జాగ్రత్తపడు.



అబ్రహం లింకన్

కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.



కె.స్టాన్‌స్లావిస్కి

## ప్రజావాక్కు



### 'బొద్దింక'ల పార్టీ

ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లోబొద్దింకల జనతా పార్టీ ఒక సెన్సేషన్. కుక్కకీ ఒక రోజొస్తుంది అన్న ఇంగ్లీషు సామెత లాగానే బొద్దింకలకీ ఒకరోజు వచ్చినట్టుంది. ఇప్పుడా పేరుట్రెండ్ అయ్యింది దేశమంతా. సాధారణంగా బొద్దింకల్ని చూడడానికి ఎవరూ ఇష్టపడరు. చివరకి హిట్ యాడ్‌లో కూడా. అబ్బే, తిండి తింటున్న టైమ్‌లో టీవీలోఈయాడ్ ఏమిట్రా బాబూ అనుకుంటారు ఎక్కువ మంది. అలాంటిది దేశమంతా ఈ పేరు ట్రెండ్ అవ్వడం అంటే దాన్నే 'టైమ్ బాబూ టైమ్' అంటారు. ఇక విషయానికి వస్తే అసలు బొద్దింకకీ, దీనికీ ఏ సంబంధమూ లేదు. ఒక రకంగా ఇది బుద్ధింకల పార్టీ. ఎందుకంటే దీన్నిస్థాపించింది, ప్రాచుర్యం చేస్తున్నదీ బుద్ధిమంతులైన యువకులు. దేశ ప్రధాన న్యాయమూర్తి ఒక తీర్పులో కొందరు యువకుల్ని ఉద్దేశించి బొద్దింకలతో పోల్చారన్న వార్తకి స్పందనగా ఈ వ్యంగ్య పక్షం అంకురం దాల్చింది. యువత పెద్ద ఎత్తున రాజకీయాల పట్ల, సామాజిక సమస్యల పట్ల దృష్టి సారిస్తే అది దేశానికి మంచిది.

- డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

### ఏదీ శాశ్వతం కాదు

అద్దెఇంట్లో కొందరు కొంతకాలం ఉంటారు. మరికొందరు చాలా కాలం ఉంటారు. అంతేకాని అద్దె ఇంట్లో ఎల్లకాలం ఉండటానికి ఎవరికి కుదరదు. లోక్‌సభ, శాసనసభలు కూడా అద్దె ఇళ్ల లాంటివే. అందులో ఉండే ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు మంత్రులుఎప్పుడో ఒకప్పుడు వాటినుంచి బయటికి పోవల సిందే. వారి స్థానంలో మరొకరు రావలసిందే. గతంలో ఇలా ఎంతోమంది వచ్చారు, పోయారు. అలానే ఎక్కడో ముఖ్యమంత్రులు అద్దెఇళ్లని ఖాళీచేస్తే ఇక్కడసంబరాలు ఎంటో.

- మిథునం, హైదరాబాద్

### రైతులకు ఆసరా కల్పించాలి

ఈ సీజన్లో తెలంగాణలో ఎక్కువ మొత్తంలో పూడిక తీత పనులు జరుగుతున్నాయి. తెలంగాణ వ్యవసాయంలో ఉత్పత్తి ఉత్పద్దకతను పెంచడంలో పూడిక తీత పనులు ఉపయోగపడుతాయి. తెలంగాణలో నీటి వసతులు వివిధ మార్గాల ద్వారా పెరిగినా ఇప్పటికీ స్థిర నీటి వసతిలేని మారుమూల గిరిజన గ్రామాలున్నాయి. కుంటలు చెరువులు పూడికతీయించడం ఉపాధి హామీపథకం కిందవచ్చేట్టు చూసిరైతులకు ఎంతోకొంత ఆసరా కల్పించాలి.

- భారత అవినాష్, జనగామ

### పంటలను కొనుగోలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు రైతులు పండించిన మొక్కజొన్న, వరివంటి పంటలు కలలాల్లో కొనుగోలు చేయక తడిసిపోతుంటే మరో పక్క ప్రగతి పేరిట 99 రోజుల సంబరాలు చేస్తుంది. రైతులు తాము పండిచ పంటను కలలాల్లో పెట్టుకొనిరోజులు తరబడి ఎదురుచూస్తున్న అధికారులు రావడం లేదంటూకొనుగోలు చేయక రైతులు ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరో వైపు ఈదురు గాలులవల్ల మామిడి రైతులు నష్టపోతున్నారు. వారికి భరోసా కల్పించి ఆదుకోవడంలో ప్రభుత్వంవిఫలమైందని చెప్పవచ్చు. రైతులపట్లప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. భవిష్యత్తు ప్రణాళికలు లేక యూరియా కష్టాలు వంటివి ఎన్నో చూశాం. కాంగ్రెస్ ప్రభుత్వంలోఒకరకంగా రైతులు అసంతృప్తిగా ఉన్నారని తెలుస్తుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### పెరుగుతున్న లింగ వివక్ష

భారతదేశంలో ఆర్థిక, సాంకేతిక రంగాలు వృద్ధి చెందుతున్నప్పటికీ లింగ వివక్షరూపం మార్చుకుని కొనసాగుతోంది. క్షేత్రస్థాయి పరిశీలనలు భిన్నమైన వాస్తవాలను చూపుతున్నాయి. గ్రామీణప్రాంతాలలో సాంప్రదాయక పురుషాధిక్య ధోరణులు, బాల్యవివాహాలు, చదువు ఆపివేయడం వంటి సమస్యలు ఉన్నాయి. వ్యవసాయ రంగంలో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ మహిళా కూలీలకు తక్కువ వేతనాలు ఇస్తున్నారు. భూమిపై యాజమాన్య హక్కులు లేకపోవడం వల్ల మహిళలు ఆర్థిక స్వయంప్రతిపత్తి సాధించలేకపోతున్నారు. పట్టణ ప్రాంతాలలో కార్పొరేట్ సంస్థల ఉన్నత పదవులలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉంది. వివాహం, పిల్లల పెంపకం వల్ల కెరీర్ మధ్యలోనే ఉద్యోగాలు వదిలివేయాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో భద్రతా లోపాలు, వేధింపులు వేధిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ధైర్యమే ఆయుధం

నేటి సమాజంలో యువత పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననో, ఇంటర్వ్యూలోఉద్యోగంరాలేదని క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్న యువతరం పిల్లలు ఎంతో మందిని చూస్తున్నాం. మనకోసం మన కుటుంబం ఎల్లప్పుడూ వేచింటుంది అనేది ఆలోచన చేయాలి. రాబోయే భవిష్యత్ కాలం అంత మనదే, ఈ ఉద్యోగం కాకపోతే ఇంకో జాబ్ అనే ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితేనే భవిష్యత్ జీవితాలు బాగుంటాయి.

-మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పొగాకు విషవాయువు పట్ల బహు పరాక్!

బుగ్గన మధుసూదనరెడ్డి

ప్రపంచ మానవాళికి పెనుశాపంగా పరిణమించిన ఈ పొగాకు వాడకం మూలాన ప్రపంచవ్యాప్తంగా ఏటా 80 లక్షల మంది మరణించడమే కాదు, వీరిలో 12 లక్షల మంది పరోక్ష ధూమపానం వల్ల కూడా మృత్యువాత పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ గణ్కాంకాలు తెలియజేయడంతో వీటి వాడకం ఎంతటి ప్రమాద ఘంటికాలు మ్రోగిస్తున్నాయో మనం ఇట్టే ఊహించవచ్చు. ముఖ్యంగా ప్రపంచ మానవాళి విలువైన ప్రాణాలను అనంత వాయువుల్లో కలిపి వేస్తున్న ఈ పొగాకు విష వాయువులో భాగమైన హుక్కా, చుట్ట, బీడీ, సిగరెట్, ఖైనీవాడకం మూలాన అవి మన ఆరోగ్యంపై పలువిధాలా దుష్పరిణామాలు చూపుతుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. అంతేగాకుండా పొగాకు వాడకంలో భారతదేశం రెండవ స్థానంలో ఉండటం, పొగాకు నుంచి వెలువడే పొగలో 40,000 పైగా హానికరమైన రసాయనాలు ఉండటం, అందులో 70కి పైగా అత్యంత అపాయకరమైన క్యాన్సర్ కారకాలు ఉండటం మనల్ని ఎంతో గగ్గుర్పాటుకు, ఒకింత భయాందోళనలకు గురిచేస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అదేవిధంగా పొగాకు వాడకంలో భాగమైన ధూమపానం చేసే వారికే కాకుండా ప్రక్కన ఉండి ఆ పొగ పీల్చేవారికి కూడా పెను ప్రమాదం పొంచి ఉండటం తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం. ఇంకా చెప్పుకుంటూపోతే ధూమపానం వల్ల వచ్చే క్యాన్సర్‌లలో ఊపిరితిత్తుల క్యాన్సర్లు, నోటి క్యాన్సర్లు, అన్నవాహిక, కడుపు, మూత్రాశయం, మూత్రపిండాల క్యాన్సర్లు ముఖ్యమైనవిగాప్రపంచ



ఆరోగ్య సంస్థ నిపుణులు నిర్ణయించిన నేపథ్యంలోయావత్ ప్రపంచ మానవాళి ఈ పొగాకు వాడకం విషయంలో ఎంతటి అప్రమత్తాన్ని పాటించాలో, వాటిని ఎంత దూరం పెట్టి మన విలువైన ఆరోగ్యాలను కాపాడుకోవాలో అంతా మన వివేకంపై ఆధారపడి ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే యావత్తు మానవాళి పొగాకు వాడకానికి ఎంత దూరంగా ఉంటే అంతగా మన జీవితాలు నిండు, నూరేళ్ల ఆరోగ్యవంతంగా, పిల్లాపాపలతో అత్యంత దిగ్విజయంగా సాగిపోవడం తథ్యం. అన్నింటికి మించి మన పెద్దలు సెలవిచ్చినట్లుగా 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే నీతి సూత్రానికి మనమంతా కట్టుబడి ఉండాలంటే మాత్రం పొగాకు వాడకానికి అల్లంతా దూరంలో ఉంటూ, దానికి సంపూర్ణంగా రాం రాం చెప్పడం, పూర్తిగా మంగళం పాడటం మనందరికీ కూడా ఎంతైనా సర్వదా శ్రేయస్కరం. ఏదిఏమైనా పొగాకులో వుండే క్యాన్సర్ కారక రసాయనాల వల్ల కేవలం ఒకే రకమైన క్యాన్సర్ వచ్చే ప్రమాదమే గాక 36 రకాల క్యాన్సర్లు సైతం వచ్చే అవకాశాలు పొంచి ఉండటంతో ఈ పొగాకు విషవాయువు ఏ స్థాయిలో మానవాళి ప్రాణాలతో చెలగాటమాడుతుందో మనం ఇట్టే ఊహించవచ్చు. ఏమైన మనం పొరపాటున ఈ పొగాకు వాడకానికి అలవాటు పడ్డామంటే మన రోగనిరోధక శక్తి తగ్గటంతో పాటు గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్, ఊపిరితిత్తుల వ్యాధి, మూత్రపిండాలు చెడిపోవడం, టీబీ వ్యాధులు, మధుమేహం, కంటి, వినికిడి సమస్యలు, చిగుర్లకు సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశాలు మెండుగా ఉండటంతో, మనకు ఒకవేళ పొగాకు వాడకం అలవాటు వుంటే ఎలాగైనా ఈ పొగాకు వాడకానికి గుడ్ బై చెప్పాల్సిందే. లేదంటే మన అమూల్యమైన ఆరోగ్యాన్ని కోరికోరి మనమే పాడుచేసుకున్న వారమవుతాము. తద్వారా మనకు మరణం సంభవించడానికిమనంతకు మనమే రాచబాట ఏర్పరచుకొన్న వారమవుతాం. •

# సమగ్ర జనగణనే అభివృద్ధికి మూలం!

డాక్టర్ సమర్ స్నేహ ఎనుగొండ

అనేక గణాంక వివరాల ప్రకారం దేశంలో 80శాతం జనాభా ప్రభుత్వ రాయితీలతో అభివృద్ధిలోకి రావాలని తాపత్రయపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోయాయి. పేదరికం పెరిగిపోయింది. కులాల గణాంకాలు తెలియకపోతే పేదరికాన్ని అంచనా వేయలేం. ఇటు రాజ్యాంగం అటు ప్రజాస్వామ్యం వైఫల్యంతో దేశంలో 80శాతం మంది తమను ఆదుకోవా లని అంటున్నారు అంటే ప్రజల ఈ దుస్థితిని మార్చాలి. కులం వర్గం ఒకటిగా ఉన్న మన సమాజాన్ని సమసమాజంగా ఎలా మార్చేది. నిలువునా చీలిన సమాజాన్ని సమాంతర పరిచేదెవరు? కులాల సామా జిక ఆర్థిక స్థితులు తెలియకుంటే ప్రభుత్వాలు చేపట్టే పథకాలు, ఉపాధి అవకాశాలు ఎలా పేదలకు చేరుతాయి? దేశ వ్యాప్త జనాభా గణనలో భాగంగా కులాల వివరాలను తెలుసుకోవడంలో ఎలాంటి తప్పులేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఏ ప్రభుత్వానికైనా ఏ రోజుకైనా ఎంతమంది వెనుకబడి ఉన్నారో, ఎంతమందికి సంక్షేమం అవసరమో తెలియాలి. ఇది విధానపరమైన (పాలసీ) విషయం, అని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. అటు కాంగ్రెస్ ఇటు బిజెపి పోటీపడి కులగణన కోసం విధాన నిర్ణయా లను రూపొందించుకోవడం నిజంగా అణగారిన వర్గాల శ్రేయస్సు కోసమేనని భావించాలి. కులాల గణాంకాలు లేకపోతే పేదలను, నిరుద్యోగులను అంచనా వేయలేం. కులం వర్గం ఒకటిగా ఉన్న మన సమాజాన్ని సమసమా జంగా మార్చలేము. కులగణన వలన మాత్రమే సమానత్వం, సామాజిక న్యాయం, సాధ్యమవుతుంది. అంటే వారి సామా జిక, విద్యా, ఆర్థిక వెనుకబాటుతనం కులగణన వల్ల తేట తెల్లమవుతుంది కాబట్టి. దానికి అనుగుణంగా ప్రణాళికలు రచించి వారి అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయడానికి వీలు ఏర్పడుతుంది. కులగణన ఈ దేశానికి ఒక దిశానిర్దేశం చేస్తుంది. దేశ ప్రగతికి దిక్సూచిగా మారుతుంది. సామాజిక న్యాయానికి బాటలు వేస్తుంది. దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించే ప్రక్రియలో భాగంగా కులాన్ని నిర్ధారించడంలో ఏ ప్రభుత్వ తప్పిదమూ ఏమీ వుండదని సుప్రీం కోర్టువ్యాఖ్యానించింది. 2027 జనగణనలో కుల గణనను చేర్చా లని గతేడాది ఏప్రిల్‌లో జరిగిన సమావేశంలో రాజకీయ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ నిర్ణయించింది. 2027 జనా భా లెక్కల రెండవ దశలో కుల గణనను పొందుపరచను న్నట్లు పార్లమెంట్‌లో ప్రభుత్వం తెలియజేసింది. తొలి దశ లో ప్రతి ఒక్క కుటుంబం ఇళ్ల పరిస్థితులు, ఆస్తులు, సదుపాయాలు వంటి వాటికి సంబంధించి హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (హెచ్ఎల్ఎ) సేకరణ వుంటుంది. రెండో దశలో,



ప్రజల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, ఇతర వివరాలు సేకరిస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారం, ఈ ప్రక్రియలో కేవలం ఎస్సీ, ఎస్టీలను మాత్రమే లెక్కించేవారు. బడుగు బలహీన వర్గాలుగా ఎవరున్నారో అనేది తెలుసుకోవాలంటే కులగణన తక్షణ అవసరం. అప్పుడు పేదలు ఎవరో తెలుస్తుంది. తద్వారా ఉత్పత్తి పద్ధతులను ఎంపిక చేయాలి. ఆ విధంగా పెట్టుబడులు పెట్టాలి. తద్వారా ఆదాయ కల్పనలు జరగాలి. అదే సంక్షేమ రాజ్యం ఇలా సామ్యవాద తరహా సమాజాన్ని నిర్మించుకోవాలని దిశానిర్దేశం చేసింది మన రాజ్యాంగం. ఆర్థిక సంస్కరణలు చేపట్టిన తర్వాత దేశంలో సంపద కేంద్రీకరణ జరగడం వలన పేదలు నిరుపేదలుగా సంపన్నులు ఎక్కువ సంపదను పోగు చేసుకుంటున్న తరుణంలో ఆర్థిక అభివృద్ధి ఫలాలు అందరికీ అందేదిగా చూసే బాధ్యత ప్రభుత్వాలదే. ఈ నేపథ్యంలో కులాల మయమైన ఈ దేశంలో ఏ కులం వెనుకబడిపోయిందో తెలుసుకోకుంటే ప్రభుత్వం సంతులిత వృద్ధినిసాధించలేదు. ఉత్పత్తి ఫలాలు అందరికీ చేరవు. ఆర్థిక అభివృద్ధి అంటే కేవలం స్థూల జాతియోత్పత్తి పెరుగుదల మాత్రమే కాదు అది ఆర్థిక వృద్ధి మాత్రమే అవుతుంది. ఈ వైరుధ్యాన్ని తొలగించాలంటే అసలైన ఆర్థిక అభివృద్ధిని సాధించాలంటే ఈ వృద్ధి ప్రక్రియలో ప్రజలందరూ మమేకం కావాలి. దేశంలో అత్యంత సంపన్నులైన ఒక శాతం వద్ద స్వాతంత్ర్యం వచ్చే నాటికి జాతీయాదాయంలో 12 శాతం వాటా కలిగి ఉంటే, 1982 నాటికి వారి వాటా 6శాతానికి పడిపోయింది. నయా ఉదారవాద విధానాలు చేపట్టిన తరువాత 2022-23 నాటికి అది ఏకంగా 23 శాతానికి పెరిగింది. గత 100 సంవత్సరాలలోనూ ఆదాయాల అసమానతలు ఇంత దారుణంగా ఎన్నడూ లేవు. ఆర్థికాభివృద్ధికి సరైన కొలమానం ఏది? ప్రజాతంత్ర రాజ్యాంగ వ్యవస్థను కలిగి వున్న ఏ దేశంలోనైనా రాజకీయాధికారం అంతిమంగా ప్రజల చేతుల్లో ఉంటుంది. అటువంటి దేశంలో ఆర్థిక వృద్ధి సాధనతోబాటు సమాంతరంగా ప్రజలను ఆర్థికంగా శక్తివంతులుగా చేయడం అన్నది కూడా కొలమానంగా ఉండాలి. దేశంలో అత్యధిక శాతంగా ఉన్న శ్రామిక ప్రజల సగటు వాస్తవ ఆదాయాలలో పెరుగుదలను పరిగణనలోకి తీసుకోవాలి. దేశ జనాభాను మొత్తంగా ఒక్కటిగానే పరిగణించి సగటు ఆదాయ పెరుగుదలను లెక్కించడం వలన ఉపయోగం లేదు. అత్యంత సంపన్నులైన ఒక్క శాతం ప్రజలవార్షికాదాయం 5.5 శాతం చొప్పున పెరిగింది. తక్కిన 99 శాతంప్రజల వార్షికాదాయాలు కేవలం 1.5 శాతం చొప్పున మాత్రమే పెరిగాయి. కాని దేశ జనాభానంతటినీ ఒక్కటిగానే పరిగణిస్తూ లెక్కిస్తే సగటు ఆదాయ వృద్ధిరేటు 2 శాతం మాత్రమే ఉంది. అత్యంత సంపన్నులైన ఒక్క శాతం జనాభాను, కడు పేదరికంలో ఉన్న జనాభాను కలిపి ఒక్కటిగానే లెక్కిస్తే ఏమిటి ప్రయోజనం? కావున కుల గణన ద్వారానే ఎవరు పేదలు ఎవరు ధనికులు తెలుసుకోవాలి. అంతేగాని కులగణనను వ్యతిరేకించడం సమాజ శ్రేయస్సుకి సంతులిత అభివృద్ధికి వ్యతిరేకం అవుతుంది. •

# కీవ్‌పై 'ఒరెష్నిక్' ప్రయోగం



- హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణితో దాడి
- నలుగురు మృతి, 60మందికి పైగా గాయాలు, భారీగా ఆస్తి నష్టం
- నాలుగేళ్ల యుద్ధంలో ఒరెష్నిక్ ప్రయోగించడం ఇది మూడోసారి

**కీవ్, మే 24:** రష్యా ఆక్రమిత తూర్పు ఉక్రెయిన్‌లో జరిగిన దాడులకు ప్రతీకారంగా మాస్కో హెచ్చరించిన నేపథ్యంలో, కీవ్, దాని పరిసర ప్రాంతాలపై క్రెమ్లిన్ భారీ క్షిపణి, డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో నలుగురు మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి జరిగిన దాడుల్లో ఉక్రెయిన్‌పై ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించినట్లు రష్యా ధ్రువీకరించింది. నాలుగేళ్లుగా జరుగుతున్న ఈ యుద్ధంలో అణ్వాయుధ సామర్థ్యం గల ఈ ఆయుధాన్ని ఉపయోగించడం ఇది మూడవసారి. ధ్వని వేగం కంటే 10 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుందని, అందువల్ల దీనిని అడ్డుకోవడం అసాధ్యమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గొప్పగా చెప్పుకుంటున్న ఒరే ష్నిక్ క్షిపణితో రష్యా ఇప్పటికే ఉక్రెయిన్‌పై రెండు సార్లు దాడి చేసిన విషయం తెలిసిందే. రష్యా భూభాగంలోని పౌర మౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ జరిపిన ఉగ్రవాద దాడులకు ప్రతిస్పందనగా, రష్యన్ ఫెడరేషన్ సాయుధ దళాలు ఒరేష్నిక్ బాలిస్టిక్ క్షిపణులు, ఇస్కాందర్ గగనతల ప్రయోగ బాలిస్టిక్ క్షిపణులు, కింజల్ హైపర్‌సోనిక్ గగనతల ప్రయోగ బాలిస్టిక్ క్షిపణులు, సిర్కాన్ క్రూయిజ్ క్షిపణులతో పాటు డ్రోన్‌లను ఉపయోగించి భారీ దాడి చేశాయని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రష్యా హైపర్‌సోనిక్ బాలిస్టిక్ కిపణిని ప్రయోగించవచ్చని ఉక్రెయిన్ వైమానిక దళం హెచ్చరించిన నేపథ్యంలో, ఆదివారం తెల్లవారుజామున 1 గంట దాటిన వెంటనే పేలుళ్లు ప్రారంభమయ్యాయి. ఉక్రెయిన్ వైమానిక దళం ప్రకారం, ఈ దాడిలో 600 డ్రోన్‌లు, 90 గగనతల, సముద్ర, భూ మార్గ ప్రయోగ క్షిపణులను కూడా ఉపయోగించారు. ఉక్రెయిన్ వైమానిక రక్షణ వ్యవస్థలు 549 డ్రోన్‌లను, 55 క్షిపణులను ధ్వంసం చేసి, వాటి పనితీరును నిలిపివేశాయని, మరో 19 క్షిపణులు తమ లక్ష్యాలను చేరడంలో విఫలమయ్యాయని వైమానిక దళం తెలిపింది. రాజధానిలో ఇద్దరు మరణించగా, 56 మంది గాయపడ్డారని కీవ్ మేయర్ విటాలి క్లిట్ష్కో తెలిపారు. కీవ్ పరిసర ప్రాంత అధిపతి కూడా అక్కడ ఇద్దరు మరణించగా, తొమ్మిది మంది గాయపడ్డారని చెప్పారు. రాజధానిలోని పలు జిల్లాల్లోని నివాస భవనాలతో సహా 40 ప్రాంతాల్లో నష్టం వాటిల్లిందని కీవ్ సైనిక పరిపాలన అధిపతి టైమూర్ త్కాచెంకో ఒక టెలిగ్రామ్ పోస్ట్‌లో తెలిపారు. "రాజధానిపై భారీ బాలిస్టిక్ క్షిపణి దాడి జరిగింది" అని ఆయన అన్నారు. తూర్పు ఉక్రెయిన్‌లోని తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో జరిగిన ఘోరమైన దాడులకు బాధ్యులైన వారిని "శిక్షిస్తామని" రష్యా ప్రకటించిన తర్వాత, కీవ్‌పై దాడి జరిగే అవకాశం ఉందని ఉక్రెయిన్ అధికారులు, అమెరికా రాయబార కార్యాలయం అంతకుముందు హెచ్చరించాయి.

ఈ దాడుల్లో ఒక కళాశాల వసతిగృహంపై దాడి జరిగి కనీసం 18 మంది మరణించారని మాస్కో పేర్కొంది. గురువారం రాత్రి నుండి శుక్రవారం తెల్లవారుజాము వరకు జరిపిన ఈ డ్రోన్ దాడి గత కొన్ని నెలల్లో ఉక్రెయిన్‌పై జరిగిన అత్యంత ఘోరమైన దాడులలో ఒకటి. ఆక్రమిత లుహాన్స్క్ ప్రాంతంలోని స్టారోబిల్స్క్‌లో 42 మందిని గాయపరిచింది, శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోయారు.

కీవ్‌లో, కార్యాలయాలు, దుకాణాలు, ఒక మెట్రో స్టేషన్ ఫోయర్‌కు నష్టం వాటిల్లిందని అధికారులు నివేదించారు. నగరంలోని ఇండిపెండెన్స్ స్క్వేర్‌లో, ఒక పోస్ట్ ఆఫీస్ దెబ్బతింది.



## క్వెట్టాలో రైలుపట్టాలపై భారీ పేలుడు

### 24 మంది దుర్మరణం, 50 మందికిపైగా తీవ్ర గాయాలు
### పేలుడు పదార్థాలున్న కారు ట్రాక్‌పైకి దూసుకురావడంతో ప్రమాదం
### మృతుల్లో పాక్ ఆర్మీ సిబ్బంది, కుటుంబ సభ్యులే ఎక్కువ

**ఇస్లామాబాద్, మే 24:** పాకిస్థాన్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఘటనలో 24 మంది మరణించగా, 50 మందికిపైగా గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఆదివారం బలూచిస్థాన్ ప్రావిన్స్‌లని క్వెట్టాలోని చమాన్ పాతక్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆర్మీ జవాన్లు, వారి కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్న రైలు అక్కడి సిగ్నల్ దాటుతుండగా, పేలుడు పదార్థాలతో ఉన్న ఒక కార్ ట్రాక్‌పైకి దూసుకొచ్చి, రైలును ఢీకొని పేలిపోయింది. ఈ ఘటనలో 24 మంది మరణించగా, 50 మంది వరకు గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువగా పాక్ ఆర్మీ సిబ్బంది, వారి కుటుంబసభ్యులే ఉన్నారు. ఇది ఆత్మాహుతి దాడిగా అధికారులు భావిస్తున్నారు. ఈ పేలుడు ధాటికి రైల్వే స్టేషన్ సమీపంలో పార్క్ చేసిన పలు కార్లు దెబ్బతిన్నాయి. రైలు బోగి కూడ ధ్వంసమైంది. పేలుడు తీవ్రతతో వాహనాలకు చెందిన గ్లాస్‌లు, వాహన భాగాలు ఎగిరిపోయి సమీపంలోని బిల్డింగ్‌లపై పడ్డాయి. పేలుడు జరగగానే స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. ఘటన సమాచారం అందుకున్న అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనతో అధికారులు క్వెట్టాలోని ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ ప్రకటించారు. డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందికి సెలవులు రద్దు చేసి అందరూ విధులకు హాజరుకావాలని ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

**మేమే దాడి చేశాం: బలోచ్ లిబరేషన్ ఆర్మీ**

రైల్వే స్టేషన్ సమీపంలో పేలుడు ఘటన తమ పనేనని బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్‌ఎ) ప్రకటించింది. క్వెట్టా కంటోన్మెంట్ నుంచి పాక్ దళాల సిబ్బందిని తీసుకువెళ్తున్న రైలును లక్ష్యంగా చేసుకున్నామని బలోచ్ ఆర్మీ ప్రతినిధి జీయాండ్ బలోచ్ వెల్లడించారు. బలోచ్ ఆర్మీలోని మహిళా షైనాజ్ బలోచ్ ఓ విడియోలో మాట్లాడుతూ.. పాక్ నేతలు తమ ప్రజలను అణచివేస్తున్నారని అన్నారు. తమ సంస్కృతి, గుర్తింపు, హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. అణచివేతకు గురైన ప్రతి బలోచ్ బిడ్డ తన మాతృభూమి విముక్తి కోసం ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాడని ఆమె పేర్కొన్నారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కు కొన్నేళ్లుగా ముప్పు పొంచి ఉంది. బలోచ్ రెబల్స్, తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) గ్రూప్ ఈ రైలును పలుమార్లు లక్ష్యంగా చేసుకొన్నాయి. దీనికి చాలా వ్యూహాత్మక కారణాలున్నాయి. ఈ రైలులో తరచూ సైనిక దళాలను క్వెట్టా నుంచి పంజాబ్‌కు తరలిస్తుంటారు. తాజాగా కూడా సైనిక కుటుంబాలు ప్రయాణిస్తుండగానే దాడి చోటుచేసుకుంది. 2025లో కూడా పాక్‌లోని బోలన్ జిల్లాలో హైజాక్‌కు గురైన జాఫర్ ఎక్స్‌ప్రెస్ నుంచి వందల మంది బందీలను భద్రతా దళాలు సురక్షితంగా కాపాడాయి.

## అడుగున్నర భూమికోసం కర్రలు రాడ్లతో దాడి: ఇద్దరు మృతి

**భోజ్‌పూర్, మే 24:** బీహార్‌లో కేవలం అడుగున్నర భూమి కోసం చెలరేగిన వివాదం తీవ్ర హింసకు దారి తీసి ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఈ దారుణ ఘర్షణలో మరో 12 మందికి పైగా గాయపడ్డారు. భోజ్‌పూర్ జిల్లాలోని చార్‌పోఖరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాద్రై గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఈ ఘోరం చోటుచేసుకుంది. మృతులను అదే గ్రామానికి చెందిన రాధేశ్యామ్ సింగ్ (30), రాజ్నాథ్ సింగ్ (72)గా గుర్తించారు. ఘర్షణ సమయంలో కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేయడంతో తల, ఛాతీ, మెడ భాగాల్లో తీవ్ర గాయాలై వారు అక్కడికక్కడే మరణించారు. గ్రామస్థుల కథనం ప్రకారం ఈ అడుగున్నర భూమి విషయంలో ఇరు వర్గాల మధ్య ఏడాది కాలంగా వివాదం నడుస్తోంది. శుక్రవారం సాయంత్రం వివాదాస్పద స్థలంలో ఇటుకలతో నిర్మాణం చేపట్టే విషయమై మాటామాటా పెరిగి, అది కాస్తా తీవ్ర ఘర్షణకు దారితీసింది.



## ముస్లిం మైనార్టీల పరిరక్షణకు కట్టుబడిన కాంగ్రెస్!

### మైనార్టీల సమావేశంలో రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, మే 24:** కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు మద్దతు ఇచ్చే విషయంలో ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్ మైనారిటీ సలహా కమిటీ సమావేశంలో తమ అధినేత ముందు పలువురు నేతలు ఆందోళనల్ని వ్యక్తపరిచారు. రాహుల్ గాంధీ తమ నేతల్ని ఉద్దేశించి మాట్లాడుతూ ముస్లింలకు మద్దతు నిలిచే విషయంలో భయపడొద్దని సూచించారు. ఇదే సమయంలో వచ్చే ఏడాదిలోగా ప్రధాని నరేంద్రమోడీ పదవి నుంచి తప్పుకోవాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఆర్థిక అసంతృప్తి, అంతర్జాతీయ పరిస్థితులు మోడీ ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని అంచనా వేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత ఇమ్రాన్ మసూద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముస్లింలు కేవలం బీజేపీని ఓడించడానికి మాత్రమే కాంగ్రెస్‌కు ఓటు వేస్తారే అభిప్రాయాన్ని పార్టీ మార్చుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లిం సమాజం కోసం చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఇది పార్టీకి మద్దతు పెంచుతుందని చెప్పారు. ఇదే సమయంలో మరికొందరు నేతలు, మైనారిటీ సమస్యలపై ఇతర సీనియర్ నేతలు మాట్లాడేందుకు వెనుకంజ వేస్తున్నారని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో కొంత మంది నేతలు ముస్లిం అనే పదానికి బదులుగా 'మైనారిటీ అనే పదాన్ని ఉపయోగించాలని కోరారు. దీనితో రాహుల్ గాంధీ విభేదిస్తూ భయపడాల్సిన అవసరం లేదని, అన్యాయాన్ని ఎదుర్కొంటున్న ఏ సమాజానికైనా బహిరంగ మద్దతు ఇవ్వాలని అన్నారు. హిందువులు, దళితులు, అగ్రవర్ణాలు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు ఎవరైనా సరే కాంగ్రెస్ అందరి హక్కుల కోసం మాట్లాడుతుందని ఆయన చెప్పారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

## భారతీయులకోసమే అమెరికా ఫస్ట్ వీసా వ్యవస్థ!

### అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో



**న్యూఢిల్లీ, మే 24:** అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఒక కీలకమైన అమెరికా ఫస్ట్ వీసా వ్యవస్థను ప్రకటించారు. అమెరికా కాన్సులేట్ కార్యకలాపాలను ఆధునికీకరించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా ఫస్ట్ పేరుతో ఒక కొత్త వీసా షెడ్యూలింగ్ టూల్‌ను ఆయన పరిచయం చేశారు. భారత్‌లో నాలుగు రోజుల పర్యటనలో ఉన్న ఆయన, ఈ కొత్త విధానం ద్వారా అమెరికాతో ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను పటిష్టం చేసే ప్రయాణికులకు వీసా అపాయింట్‌మెంట్లలో ప్రాధాన్యత లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ కొత్త విధానం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఒక్కటేనని రూబియో వివరించారు. అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసే దరఖాస్తుదారులకు షెడ్యూలింగ్‌లో తొలి అవకాశం కల్పించడం దీని లక్ష్యం. ముఖ్యంగా, వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకోవడానికి, కార్యకలాపాలు విస్తరించడానికి, లేదా అమెరికా మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే భారతీయ కంపెనీల ప్రతినిధులు వంటి వారికి ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇటువంటి వారికి వీసా అపాయింట్‌మెంట్లు వేగంగా లభిస్తాయి. భారత్ అమెరికా సంబంధాలు తరచూ వార్తల్లో కనిపించకపోయినా, ఎన్నో విధాలుగా బలపడుతున్నాయని రూబియో అన్నారు. భారత కంపెనీల నుంచి అమెరికాలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని, ఇండోపసిఫిక్‌లో సైనిక విన్యాసాల ద్వారా భద్రతా భాగస్వామ్యం కూడా విస్తరించిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత వీసా ప్రక్రియలో జాప్యం, అనిశ్చితి వల్ల వ్యాపార పర్యటనలు, పెట్టుబడి సమావేశాలు వంటి కీలకమైన కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందని ఆయన అంగీకరించారు. ఈ అడ్డంకులను తొలగించడానికి ఒక స్మార్ట్ షెడ్యూలింగ్ వ్యవస్థ అవసరం. పటిష్టమైన, సురక్షితమైన కాన్సులర్ వ్యవస్థ ఈ ముఖ్యమైన సంబంధానికి జీవనాడి అని రుబియో అభిప్రాయపడ్డారు. ఈ కొత్త సౌకర్యం కేవలం వీసా దరఖాస్తుదారుల కోసమే కాదని, అమెరికా జాతీయ ప్రయోజనాల కోసం ఫ్రంట్ లైన్స్ లో పనిచేస్తున్న కాన్సులర్ అధికారులు, సిబ్బంది పనితీరును కూడా ఇది మెరుగుపరుస్తుందని చెప్పారు. ఈ విధానం అమెరికన్ల డబ్బును ఆదా చేస్తుంది, ఎందుకంటే ఇది మమ్మల్ని మరింత సమర్థవంతంగా మారుస్తుంది. చేయాల్సిన పనిని మరింత కచ్చితంగా, వేగంగా చేయడానికి ఇది అనుమతిస్తుందని ఆయన వివరించారు.

## పెన్షన్ కోసం కష్టాల ప్రయాణం..
## అత్తను వీపుపై 9 కి.మీ. మోసిన కోడలు



**చత్తీస్‌గఢ్, మే 24:** చత్తీస్‌గఢ్‌లోని మారుమూల ప్రాంతంలో చోటుచేసుకున్న ఒక హృదయవిదారక ఘటన ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. 90 ఏళ్ల వయసున్న అత్తను వీపుపై మోసుకుంటూ ఓ మహిళ ఎండలో అడవులు, రాతి మార్గాలు, వాగులు దాటుకుంటూ కిలోమీటర్ల కొద్దీ నడుస్తున్న దృశ్యాలు విక్రమ్, భేతాళ కథలను గుర్తుకు తెస్తున్నాయి. సర్గుజా జిల్లాలోని మైన్‌పాట్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. సుఖ్మానియా బాయి అనే మహిళ తన 90 ఏళ్ల అత్తకు పింఛను డబ్బులు ఇప్పించడం కోసం ఆమెను తన వీపుపై మోస్తూ దాదాపు 9 కిలోమీటర్ల దూరంలోని బ్యాంకుకు తీసుకెళ్లింది. ఈ ప్రాంతంలో సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ప్రాథమిక అవసరాల కోసం కూడా ప్రజలు ఇలాగే కాలినడకన ప్రమాదకర మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. పింఛను డబ్బులు లబ్దిదారులకు అందచేయాలంటే వారు తప్పనిసరిగా బ్యాంకుకు వచ్చి వేలిముద్రలు వేయాలన్న నిబంధన ఉంది. ఈ కారణంగానే సుఖ్మానియా బాయి గత కొన్ని నెలలుగా ఇదే విధంగా తన అత్తను బ్యాంకుకు తీసుకెళుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియో తీస్తున్న వ్యక్తి ఇంత కష్టపడి ఎందుకు మోసుకెళ్తున్నావని స్థానిక భాషలో అడగగా సుఖ్మానియా బాయి తన ఆవేదనను వెళ్లగక్కింది. బ్యాంకుకు స్వయంగా తీసుకెళితేనే పింఛను డబ్బులు ఇస్తున్నారు. మా ఊరికి బస్సు సౌకర్యం లేదు. అడవులు, వాగులు దాటుకుంటూ వెళ్లాలి. నెలనెలా వచ్చే రూ.1500 కోసం ఈ కష్టం తప్పడం లేదు అని ఆమె వివరించింది. గతంలో పింఛను డబ్బులు స్థానికంగానే అందేవని, కానీ ఇప్పుడు ఈ కష్టాలు పడాల్సి వస్తోందని ఆమె తెలిపింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. డిజిటల్ ఇండియా, ఇంటి వద్దకే సేవలు అంటూ ప్రభుత్వాలు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు మధ్య ఉన్న వ్యత్యాసానికి ఈ ఘటనే నిదర్శనమని విమర్శిస్తున్నారు.

## దేశాన్ని అస్థిరపరిచే కుట్రలుచేస్తున్న కాంగ్రెస్, రాహుల్!

### కేంద్ర మంత్రి పియూష్ గోయల్

**న్యూఢిల్లీ, మే 26:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, విపక్ష పార్టీలపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆదివారంనాడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశాన్ని అస్థిరపరచేందుకు వీరంతా కుట్రపన్నుతున్నారని, హింసను రెచ్చగొడుతున్నారని అన్నారు. పాలకపక్షాన్ని ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎదుర్కోవడంలో విఫలం కావడంతో ఉద్దేశపూర్వకంగా దేశంలో అశాంతి సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపిస్తూ సోషల్‌మీడియాలో పోస్టుచేసారు. దేశాన్ని అస్థిరపరచేందుకు కాంగ్రెస్, విపక్ష పార్టీలు కుట్ర పన్నుతున్నాయి. దేశాన్ని అస్థిర పరచాలని ఈ టూల్‌కిట్ గ్యాంగ్ కలలు కంటోంది. రాహుల్ గాంధీ ప్రకటన ఆషామాషీగా చేసినది కాదు. దేశంలో అరాచకం వ్యాప్తి చేసేందుకు జరుగుతున్న కుట్రలో భాగం. రాజకీయ నిరాశానిస్పృహలే ఇందుకు కారణం.

## ఫాల్టా ఉప ఎన్నికలో బిజెపి అభ్యర్థి ఘనవిజయం

**ఫాల్టా,(బెంగాల్), మే 24:** పశ్చిమ బెంగాల్‌లోని ఫాల్టా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన రీపోలింగ్ ఓట్ల లెక్కింపులో బీజేపీ ఘన విజయం సాధించింది. ఆదివారం వెలువడిన ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పండా ఏకంగా 1,09,021 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి నాలుగో స్థానానికి పడిపోయి, డిపాజిట్ కోల్పోవడం గమనార్హం. అయితే పోలింగ్‌కు ముందే తాను ఎన్నికల బరిన్ంచివై దొలంగంతంన్నట్లు జహాంగీర్‌ఖాన్‌ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనివల్లనే ఆయన లెక్కింపులో నాలుగోస్థానానికి పడిపోయారు. ఓట్ల లెక్కింపులో దేబాంగ్షు పండాకు 1,49,666 ఓట్లు రాగా, సీపీఐ(ఎం) అభ్యర్థి శంభునాథ్ కుర్మీ 40,645 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుర్ రజాక్‌కు 10,084 ఓట్లు, తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి జహంగీర్ ఖాన్‌కు కేవలం 7,783 ఓట్లు మాత్రమే వచ్చాయి.

ఫాల్టా ఫలితాలు రెండు విధాలుగా చారిత్రాత్మకమైనవి. 1988లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన తర్వాత ఒక ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి నాలుగో స్థానానికి పరిమితం కావడం ఇదే తొలిసారి. 2011లో అధికారంలోకి వచ్చిన తర్వాత టీఎంసీ అభ్యర్థి డిపాజిట్ కోల్పోవడం కూడా ఇదే మొదటిసారి. ఏప్రిల్ 29న జరిగిన అసలు పోలింగ్‌లో ఫాల్టా నియోజకవర్గంలో తీవ్ర అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

## తమిళనాడులో కోటి కుటుంబాలకు ఉచిత విద్యుత్ అమలు!

**చెన్నై, మే 24:** రాష్ట్రంలో గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ పథకాన్ని విస్తరిస్తూ తీసుకున్న నిర్ణయం వచ్చే బిల్లింగ్ సైకిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ కొత్త విధానంతో రాష్ట్రంలోని కోటికి పైగా కుటుంబాలకు విద్యుత్ బిల్లు సున్నాకు చేరనుంది. ముఖ్యమంత్రిగా సి.జోసెఫ్ విజయ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తీసుకున్న ఈ తొలి కీలక నిర్ణయం లక్షలాది కుటుంబాలకు ఊరటనిస్తుందని భావిస్తున్నారు. ఈ పథకం అమలు కోసం తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ తమ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తోంది. ప్రభుత్వ నూతన విధానానికి అనుగుణంగా అర్హుల గుర్తింపు, సబ్సిడీ లెక్కింపు, బిల్లుల జారీ వంటి మార్పులను సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచినట్లు టీఎన్‌పీడీసీఎల్ అకౌంట్స్ విభాగం వెల్లడించింది. క్షేత్రస్థాయి సిబ్బందికి దీనిపై పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన వినియోగదారులకు ఎలాంటి జాప్యం లేకుండా లబ్ధి చేకూరేలా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం రెండు నెలలకు 500 యూనిట్ల లోపు విద్యుత్ వాడే గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేస్తారు. రాష్ట్రంలో మొత్తం 2.46 కోట్ల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటివరకు 100 యూనిట్ల లోపు వాడే 67 లక్షల కుటుంబాలు సున్నా బిల్లు పొందుతున్నాయి. తాజా విస్తరణతో ఈ సంఖ్య ఏకంగా 1.2 కోట్లకు పెరగనుంది. మరో 85.83 లక్షల మంది వినియోగదారుల బిల్లులు ప్రతి రెండు నెలలకు సుమారు రూ. 235 వరకు తగ్గే అవకాశం ఉంది. అయితే, 500 యూనిట్లకు మించి వాడే 34.24 లక్షల మందికి మాత్రం పాత పద్ధతిలోనే 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రయోజనం కొనసాగుతుంది. ఈ పథకం ద్వారా అయ్యే అదనపు ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

మే 10న ప్రభుత్వం ఈ ప్రకటన చేసిన వెంటనే సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ ప్రక్రియను ప్రారంభించారు.

## డిఎంకె దయాదాక్షిణ్యాలపైనే విజయ్ ప్రభుత్వం:స్టాలిన్

**చెన్నై, మే 24:** తమిళనాడు రాజకీయాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సరికొత్త యుద్ధం మొదలైంది. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె.స్టాలిన్ ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చెన్నైలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. ప్రస్తుతం అధికారంలో ఉన్న విజయ్ ప్రభుత్వం ఐదేళ్లపాటు పూర్తి కాలం కొనసాగలేదని, అది డీఎంకే దయాదాక్షిణ్యాలపైనే నడుస్తోందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలను ఒక రాజకీయ ప్రభంజనంగా తాను భావించడం లేదని, ఇదొక 'సినిమా సునామీ మాత్రమేనని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఓటర్లు ఎలాంటి రాజకీయ విశ్వాసం లేదా సిద్ధాంతాలను చూసి టీవీకే పార్టీకి ఓటు వేయలేదని, ఒక ప్రముఖ స్టార్ నటుడు పార్టీ పెట్టాడనే ఉత్సాహంతోనే విజయ్‌కు మద్దతు తెలిపారని అన్నారు. పిల్లలకు కొత్తగా ఆడుకునేందుకు ఒక ఆటవస్తువు దొరికితే ఎంత ఉత్సాహం చూపిస్తారో, ఇదీ అలాంటిదేనని కొన్ని రోజుల్లోనే ఆ ఆటవస్తువుపై ప్రజలకు ఆసక్తి తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. ఒక బిడ్డ తన తల్లి కోసం వెతికినట్టు, తమిళనాడు ఓటర్లు త్వరలోనే మళ్లీ డీఎంకే కోసం వెతకడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేజిక్ ఫిగర్ అంశాన్ని స్టాలిన్ ప్రధానంగా ప్రస్తావించారు.

## సంక్షిప్తంగా..

### బెంగళూరు కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి టివికె సై!

**చెన్నై, మే 24:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి అధికార పగ్గాలు చేపట్టిన నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలపై దృష్టి సారించారు. టీవీకే పార్టీ విస్తరణలో భాగంగా ఆయన కర్ణాటక రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ఆరాష్ట్రంలోని బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా కర్ణాటకలో పార్టీ జెండా పాతాలని విజయ్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ హబ్ బెంగళూరు నగరంలో స్థానిక కన్నడిగులతో పాటు లక్షలాది మంది తమిళ ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తున్నారు. నటుడిగా విజయ్‌కు కర్ణాటక వ్యాప్తంగా, ముఖ్యంగా బెంగళూరులో భారీ సంఖ్యలో అభిమాన సంఘాలు, బలమైన ఫాలోయింగ్ ఉంది.

### వైట్‌హౌస్ వద్ద కాల్పులు-ఎన్‌కౌంటర్‌లో ఒకరు మృతి



**వాషింగ్టన్, మే 24:** అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ దగ్గర కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. యూఎస్ సీక్రెట్ సర్వీస్ చెక్‌పాయింట్‌పై ఓ ఆగంతకుడు కాల్పులకు తెగబడ్డాడు. భద్రతాసిబ్బంది జరిపిన ఎదురుకాల్పుల్లో అతను మరణించాడు. ఈ ఘటనలో ఒక పౌరుడు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల ప్రకారం 17వ వీధి, పెన్సిల్వేనియా అవెన్యూ వద్ద ఉన్న భద్రతా చెక్‌పాయింట్ వద్దకు వచ్చిన ఓ వ్యక్తి తన బ్యాగ్‌లోంచి తుపాకీ తీసి అక్కడున్న సీక్రెట్ సర్వీస్ అధికారులపై కాల్పులు ప్రారంభించాడు. తక్షణమే అప్రమత్తమైన అధికారులు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపి నిందితుడిని నిలువరించారు. ఈ ఘటన జరిగిన సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోనే ఉన్నారని, ఆయన సురక్షితంగా ఉన్నారని అధికారులు స్పష్టంచేశారు.

### కాంగ్రెస్‌ను ఎన్నటికీ నమ్మలేం: ఉదయనిధి

**చెన్నై, మే 24:** డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఆ పార్టీ తమను వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. గత 20 ఏళ్లుగా ఆ పార్టీ తమపై ఆధారపడి ఉందని, ఈ రోజు అధికారం కోసం టివికెతో చేతులు కలిపిందని విమర్శించారు. ఈ విషయాన్ని ఎవరూ ఎప్పటికీ మరిచిపోవద్దని, ఆ పార్టీ నేతలను భవిష్యత్తులో తమ దరిదాపుల్లోకి కూడా రానివ్వకూడదని సూచించారు. రాజకీయంగా తన ఉనికిని నిలుపుకోవడానికి కాంగ్రెస్ ఎంతటి దారుణానికి అయినా ఒడిగడుతుందని మరోసారి రుజువయ్యిందన్నారు. దేశంలో బిజెపి వరుస విజయాలకు ప్రధాని మోడీ, అమిత్ షాలే ప్రధాన కారణమని తాను ఇన్నాళ్లు భావించానని, కానీ అది నిజం కాదని ఉదయనిధి అన్నారు.

### డిఎంకె కష్టకాలంలో ఎప్పుడూ అండగా నిలిచాం : కాంగ్రెస్



**చెన్నై, మే 24:** తమిళనాడులో డీఎంకే వల్లే కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు గెలిచారని, విజయ్ సారథ్యంలోని టీవీకేతో చేతులు కలిపి తమకు వెన్నుపోటు పొడిచిందని ఉదయనిధి స్టాలిన్ చేసిన విమర్శలను కాంగ్రెస్ పార్టీ తిప్పికొట్టింది.

డీఎంకే కష్టకాలంలో ఉన్నప్పుడల్లా తమ పార్టీ వెన్నంటే ఉందని కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ ఆదివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. డీఎంకే కష్టకాలంలో ఉన్నప్పుడల్లా కాంగ్రెస్ అండగా నిలిచింది. వాళ్లు మైనారిటీలో ఉన్నప్పుడు మేము బయటే వేచిచూసాం. ఉదయనిధి వ్యాఖ్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని మాణిక్యం ఠాగూర్ అన్నారు.

### ముత్యపుచిప్పల కోసం వెళ్లి నదిలో ఎనిమిది మంది మృతి

**భట్కాల్(కర్ణాటక), మే 24:** నదిలో ముత్యపు చిప్పల కోసం వెళ్లిన ఒకే కుటుంబానికి చెందినఎనిమిది మంది మరణించారు. ఇంకో ఇద్దరు గల్లంతైనట్లు తెలుస్తోంది. మృతుల్లో ఏడుగురు మహిళలు ఉన్నారు. కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా, భట్కాల్ తాలూకా, షిరాలి గ్రామ సమీపంలోని తట్టే హక్కాలు నదిలో ఆదివారం ఈ విషాదం చోటుచేసుకుంది. తట్టే హక్కాలు అనే మంచినీటి నదిలోకి 14 మంది సభ్యుల బృందం ఆదివారం ముత్యాల చిప్పల కోసం వెళ్లింది. ఈ సీజన్‌లో ఇక్కడ ముత్యపు చిప్పలు ఎక్కువగా దొరుకుతాయి. వీటిని సేకరించేందుకు స్థానికులు చాలా మంది నదిలోకి వెళ్తుంటారు. బాధితులు నదిలోకి వెళ్లి ముత్యాల కోసం వెతికే సమయానికి నీటి ప్రవాహం తక్కువగా ఉంది.

అయితే, ఉన్నట్లుండి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. వేగంగా అలలు వీచాయి. పెరిగిన నీటి ప్రవాహం, అలల ధాటికి ఒక్కొక్కరు కొట్టుకుపోయారు.

# అధిక ఉష్ణోగ్రతలతో ఈత, తాటి వనాల్లో అగ్నిప్రమాదాలు

## గౌడ సోదరులు అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు, నిప్పు రవ్వల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా వరుస అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటూ ఈత, తాటి వనాలు దగ్ధమవుతున్న నేపథ్యంలో గౌడ సోదరులు అప్రమత్తంగా ఉండాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈత, తాటి చెట్లు గీతా కార్మికుల జీవనాధారమని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామం, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్, రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం కొలనూరు ప్రాంతాల్లో ఈత వనాలు పూర్తిగా దగ్ధమై గౌడ కుటుంబాలకు భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ఈత, తాటి చెట్ల కింద ఎండిపోయిన ఆకులు, చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మంత్రి సూచించారు. గ్రామ స్థాయిలో గీతా కార్మికులు కలిసి చెట్ల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, చెట్లకు నీరు పట్టడం, ఎండు చెత్త తొలగించడం వంటి చర్యలు తీసుకుంటే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ఈత, తాటి వనాల సమీపంలో బీడీలు, సిగరెట్లు కాల్చకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎవరూ నిరక్ష్యంగా నిప్పు వేయకూడదని హెచ్చరించారు. ఎక్కడైనా మంటలు కనిపించిన వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గీతా కార్మికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎక్సైజ్ అధికారులకు మంత్రి సూచించారు.



ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావును అభినందిస్తున్న మున్నూరుకాపు ప్రతినిధులు

# మున్నూరుకాపుల అభివృద్ధికి విహెచ్ కృషి అభినందనీయం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** రాజకీయ, సామాజిక, విద్యా రంగాల్లో మున్నూరుకాపులు రాణించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. మున్నూరుకాపు కుల ప్రతినిధులు ఆకుల పాండురంగారావు, దడువై రాఘవేందర్, మండా సూర్యప్రకాష్, దడువై రాధాకృష్ణ, ఏనుగుల మాణిక్ ప్రభుల ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపి వి.హనుమంతరావుకు అభినందన సత్కారసభ కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ (బీసీల అభివృద్ధి, సంక్షేమం) సలహాదారుగా వి. హనుమంతరావు నియమితులైన సందర్భంగా ఆయనను మున్నూరుకాపులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం, మ్యాడం అంజయ్య హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మున్నూరుకాపులు. సమాజంలో అందరికి ఆదర్శంగా ఉంటూనే విద్యా, సామాజిక, రాజకీయాల్లో ముందుండాలన్నారు. గడిచిన ఆరు దశాబ్దాలుగా హనుమంతరావు మున్నూరుకాపుల అభివృద్ధి, సంక్షేమానికి చేసిన కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, పద్మశ్రీ ఎక్కా యాదగిరిరావు, పి. హనుమంతరావు, మున్నూరుకాపు కుల సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా క్రీడా వారోత్సవాలు

## వారం రోజులపాటు పలు ప్రత్యేక కార్యక్రమాలు

### అధికారులను అభినందించిన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యువజన క్రీడా వారోత్సవాలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్ర యువజన సేవలు, క్రీడలశాఖ ఆధ్వర్యంలో జిల్లా, మండల స్థాయిల్లో యువజన, క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. యువతలో శారీరక దారుఢ్యం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ వారోత్సవాల్లో పెద్ద ఎత్తున యువతను క్రీడాకారులను ఇందులో భాగస్వామ్యంచేశారు. ఆరు రోజుల కార్యక్రమాల్లో యువజన సంఘాలు, క్రీడాకారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేశారు. వారోత్సవాల్లో భాగంగా మే 18న ఫిట్ యాక్టివ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మారథాన్‌లు, వాక్‌థాన్‌లు, యోగా, ధ్యానం, ఏరోబిక్స్, జుంబా కార్యక్రమాలు నిర్వహిచారు. 19న కెరీర్ నైపుణ్యాభివృద్ధి దినోత్సవం పేరిట యువతకు నైపుణ్యాభివృద్ధి కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ అవకాశాలు, స్కిల్ యూనివర్సిటీ ప్రోగ్రాములు, అగ్నివీర్ నియామకాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలలో నిర్వహించిన వర్చువల్ సెషన్లలో విద్యార్థులు యువత పెద్ద ఎత్తున భాగస్వామ్యమయ్యారు. 20న యువజన నాయకత్వ సమ్మేళనాన్ని నిర్వహించి యువతలో నాయకత్వం, సృజనాత్మకత, సామాజిక అవగాహన కల్పించారు. 21న ప్లే పార్టిసిపేట్ - స్పోర్ట్స్ డేను క్రీడల్లో సామూహిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు జిల్లా యువజన, క్రీడాధికారుల పర్యవేక్షణలో వివిధ క్రీడా, వినోద కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో కూడా నగరంలోని వివిధ స్టేడియాల్లో క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. ఇక ఈ నెల 22న సర్వ్ సపోర్ట్ - క్లీన్ తెలంగాణ కోసం యువత పేరుతో యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించే భాగంగా యువజన స్వచ్ఛంద సేవకులు, ఎన్‌జీవోలు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులతో కలిసి క్రీడా మైదానాలు, పార్కులు, చెరువులు, ఓపెన్ ప్రదేశాలు, ప్రజా స్థలాల్లో పరిశుభ్రత పేరిట కార్యక్రమాలను నిర్వహించారు. వారోత్సవాల చివరి రోజు 23న ఉద్యోగ సాధన - అవకాశాలతో యువతకు అనుసంధానం పేరిట యువతకు ఉపాధి, కెరీర్ అవకాశాలపై రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహించారు. వివిధ జిల్లాల్లో మే ఒకటి నుండి 12 వరకు వివిధ జిల్లాల్లో నిర్వహించిన జాబు మేళా కార్యక్రమాల్లో దాదాపు 40000 మంది యువకులు నమోదు చేసుకోగా 22,000 మందికి పైగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. క్రీడా వారోత్సవాలను విజయవంతం చేసినందుకు అధికారులను రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ ఛైర్మెన్ శివసేనారెడ్డి, క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి అభినందించారు.

# విద్యుత్ వినియోగదారులపై ఆర్డీఎస్ఎస్ పిడుగు

### మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 24:** రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులందరిపై పెను భారం పడే పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించడం దారుణమని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ వినియోగ దారులందరికీ ఆర్డీఎస్ఎస్ పిడుగు లాంటిదన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేబినెట్‌లో ఆర్డీఎస్ఎస్ పథకానికి రేవంత్ సర్కార్ ఆమోదం తెలిపిందని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ కేంద్ర పథకాన్ని తన గొంతులో ప్రాణం ఉండగా ఒప్పుకునేది లేదని గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ అడ్డుకున్నాడని తెలిపారు. కేంద్రం ఎన్ని ఒత్తిళ్లు తీసుకొచ్చిన అంగీకరించ లేదని వెల్లడించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఆర్డీఎస్ఎస్ (రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) కింద ఇళ్లకు, వ్యవసాయ మోటార్లకు పెట్టిన స్మార్ట్ మీటర్లను అక్కడి ప్రజలు పీకేసి తగలబెడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అదే స్మార్ట్ మీటర్లను తెచ్చి తెలంగాణ ప్రజల నెత్తిన పెట్టాలని కేబినెట్ ఆమోదం తెలిపిందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో మంచినీళ్ల నల్లాలకు కూడా స్మార్ట్ మీటర్లు పెడుతారని తెలిపారు. విద్యుత్ సంస్థను ప్రైవేటీకరించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ వల్ల రైతులపై, వినియోగదారులపై పెనుభారం పడుతుందని అన్నారు.



ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి

కాంగ్రెస్ ఒత్తిళ్లతో యూపీ ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్‌ను ఉపసంహరించుకోగా అదే కాంగ్రెస్ తెలం గాణలో అమలుకు ఎందుకు ప్రయత్ని స్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీనా, ప్రాంతీయ పార్టీనా అని ప్రశ్నించారు. ఈ విషయంలో రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, రైతులు, వినియోగ దారులంతా సంఘటితమై ప్రభుత్వంపై ఆందోళ నలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం తొందరలోనే చీకటిలోకి నెట్టివేయబ డుతుందన్నారు. ఆర్‌డిఎస్ఎస్ విధానాన్ని మొదటి నుంచి కేసీఆర్ వ్యతిరేకించారని చెప్పారు. తెలంగాణలో ఆర్‌డిఎస్ఎస్ పథకం ద్వారా ప్రతిఒక్కరి ఇంట్లో మీటర్లు పెట్టేందుకు ఈ ప్రభుత్వం సిద్ధమైందని, ఆర్‌డిఎస్ఎస్ మీటర్ ద్వారా పెద్ద ఎత్తున ప్రజలకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. ఆర్‌డిఎస్ఎస్ ద్వారా విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు ఈ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పర్సంటేజ్ లతో మీటర్ ఖర్చు ఎంతకు పోతుందో తెలియదన్నారు. కొత్తగా రూరల్ డిస్కం తెచ్చే ఆలోచన ఈ ప్రభుత్వం చేస్తుంది. రూరల్ డిస్కంను అదానీకి కట్టబెట్టే ప్రయత్నం జరుగుతుం దన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఆర్‌డిఎస్ఎస్ పథకాన్ని శ్రీకాకుళంలో పెట్టి వెనక్కి తీసుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తే బ్రతుకులు చీకటి అవుతాయని కేసీఆర్ ముందు నుంచి చెప్తూనే ఉన్నారని,.కాంగ్రెస్ పార్టీని తొందర్లోనే బంగాళా ఖాతంలో వెయ్యడం ఖాయమన్నారు.

# ఎపి మంత్రి నారాయణతో ఎన్‌సి-రైమ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ

## ఎఐ యుగంలో ఎంబిఎ విద్యపై జాతీయ సదస్సు

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ఎన్‌సి-రైమ్ 2026 రీ ఇమేజింగ్ ఎంబీఏ ఎడ్యుకేషన్ ఇన్ ఇద ఎరా ఆఫ్ ఏఐ, ఎనాలిస్టిక్స్ అండ్ ఫిన్ టెక్నాలజీకి సంబంధించిన జాతీ సదస్సు పోస్టర్‌ను ఆదివారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆవిష్కరించారు. ఈ జాతీయ సదస్సును ఈ నెల 30న నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా వేగంగా మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా విద్యా వ్యవస్థ కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు కేవలం డిగ్రీలు సాధించడానికే పరిమితం కాకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ), ఎనాలటిక్స్, ఫిన్ టెక్ డిజిటల్ సాంకేతికతలు అన్ని రంగాల్లో విస్తృత ప్రభావం చూపుతున్నాయని, మేనేజ్ మెంట్ విద్య కూడా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపాంతరం చెందాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను మాత్రమే లక్ష్యంగా కాకుండా నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థం, నిర్ణయాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. భవిష్యత్ సవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేసే ఇటువంటి జాతీయ సదస్సులు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, కెరీర్ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీఏ డీన్, కాన్ఫరెన్స్ డైరెక్టర్ డాక్టర్ గంగినేని ధనంజయ్ మాట్లాడుతూ.. ఎన్‌సి-రైమ్2026 జాతీయ సదస్సు ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులను ఒకే వేదిక పైకి తీసుకురావడం ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థులకు అకడమిక్ పరిజ్ఞానంతోపాటు ఆచరణాత్మక అవగాహన, పరిశోధనా దృక్పథం, పరిశ్రమలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో మేనేజ్ మెంట్ విద్య సంప్రదాయ బోధనా విధానాలకు మాత్రమే పరిమితం కాకుండా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రూపాంతరం చెందుతోందన్నారు.



# మండుతున్న వంటనూనెల ధరలు

## బడ్జెట్ తలకిందులై సామాన్యుడు విలవిల

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ భయాలు వంటింట్లో మంటలు పుట్టిస్తున్నాయి. ఇరాన్-అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు సామాన్య, మధ్యతరగతి ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. గల్ఫ్ దేశాల్లో నెలకొన్న అశాంతి వల్ల క్రూడాయిల్ ధరలు పెరగడమే కాకుండా అంతర్జాతీయ రవాణా వ్యవస్థ దారుణంగా దెబ్బతింది. దీని ప్రభావం నేరుగా సామాన్యుడి కడుపు నింపే నిత్యావసరాలపై, ముఖ్యంగా వంటనూనెల ధరలపై పడింది. తెలంగాణలో రెండు నెలలుగా వంటనూనెల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. కేవలం రెండు నెలల వ్యవధిలోనే లీటర్ నూనెపై రూ.10 నుండి రూ.15 వరకు ధర పెరిగింది. మార్కెట్‌లో పామాయిల్, సన్‌ఫ్లవర్, వేరుశనగ నూనెల ధరలు రోజురోజుకూ మారుతుండటంతో వినియోగ దారులు బెంబేలెత్తిపోతున్నారు. గల్ఫ్ సంక్షోభం వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడం, అంతర్జాతీయ షిప్పింగ్ ఛార్జీలు భారీగా ఎక్కువవ్వడం వంటనూనెల ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా మారాయి. భారతదేశం వంటనూనెల అవసరాల కోసం (ముఖ్యంగా పామాయిల్, క్రూడ్ వెజిటబుల్ ఆయిల్స్) ఇతర దేశాల దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడు తుంది.

గల్ఫ్ మార్గంలో రవాణా కష్టాలు పెరగడంతో సప్లై తగ్గి, డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. వంట నూనెల ధరలు పెరుగుతుండడంతో సామాన్యుడి నెలవారీ బడ్జెట్ భారీగా పెరిగిపోతోంది. ఒకపక్క కూరగాయల ధరలు, మరోపక్క వంటనూనెల ధరలు చూస్తుంటే వంటింట్లోకి వెళ్లడానికే భయమేస్తోందని, కిలో వంట నూనె ధర రూ.15 దాకా పెరిగితే మాలాంటి మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్ ఎలా బతకాలి?" అని సామాన్య గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక ధరల పెరుగుదల వల్ల మార్కెట్‌లో వంట నూనెల కొనుగోళ్లు కూడా గణనీయంగా తగ్గాయని, కస్టమర్లు బ్రాండెడ్ ఆయిల్స్ కొనడానికి వెనుకాడుతున్నారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా రాబోయే రోజుల్లో వంటనూనెల ధర లీటరుకు రూ.200 మార్కును దాటే ప్రమాదం ఉందని మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అదే జరిగితే పేద, మధ్యతరగతి వర్గాలపై మోయలేని భారం పడటం ఖాయం.

# 30న క్రమశిక్షణ కమిటీ ముందుకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలి: ఎంపి మల్లు రవి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 24:** కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసి పని చేయాలని పాలకుర్తి నియోజకవర్గంలోని నేతలతోపాటు కేడర్‌కు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి(ఎంపీ) పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో చోటు చేసుకున్న పరిణామాలపై స్థానిక నేతలతో ఆదివారం మల్లు రవి సమావేశమయ్యారు. అనంతరం గాంధీభవన్‌లో ఎంపీ మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. క్రమశిక్షణ కమిటీ ఎదుట పాలకుర్తి నియోజకవర్గం నుంచి ఝాన్సీ రెడ్డి హాజరయ్యారన్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి విదేశాల్లో ఉండడం వల్ల ఆమె రాలేదన్నారు. ఎమ్మెల్యే యశస్విని విదేశాల నుంచి వచ్చిన తర్వాత మరోసారి రావాలని ఝాన్సీరెడ్డికి సూచించామని చెప్పారు. దీంతో మే 30వ తేదీన కమిటీ ముందు వారు హాజరవుతారని పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ స్థానిక నేతలు హరిప్రసాద్, కృష్ణ కిషోర్‌పై ఝాన్సీరెడ్డి, యశ్వస్విని రెడ్డిలు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. అలాగే ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి కూడా పార్టీ క్యాడర్‌ను పట్టించుకోకపోవడంతోపాటు వారిని వేధిస్తున్నారంటూ తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో పాలకుర్తి నియోజక వర్గంలోని ఇరు వర్గాలను పిలిచి కమిటీ మాట్లాడుతుందని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. ఇప్పటికే కిషోర్, హరిప్రసాద్‌కి షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. అందుకు వారు రికార్డు ఎవిడెన్స్‌తో సమాధానం ఇచ్చారని తెలిపారు. ఝాన్సీరెడ్డి కూడా తన వద్దనున్న సమాచారాన్ని తమకు అందజేశారన్నారు. ఈ అంశంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోపాటు జిల్లాకు చెందిన నేతలందరితో కూర్చుని మాట్లాడతామని చెప్పారు. తద్వారా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీ స్పష్టం చేశారు.

# గోవధ నిర్మూలన కోసం చర్యలు చేపట్టాలి




శాంతియుత నిరసన దీక్షలో పాల్గొన్న స్వామీజీలు, గోప్రేమికులు

## గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

## గోరక్ష చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలి

### నిరసన దీక్షలో పలువురు వక్తల డిమాండ్

**హైదరాబాద్(ధర్నాచౌక్), మే 24, ప్రభాతవార్త:** అక్రమ గోవధ నిర్మూలనకై చర్యలు చేపట్టాలని, గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో హిందూ ధర్మ దీక్ష సేవక్, తెలంగాణ రాష్ట్రశాఖ, ధర్మోరక్షిత రక్షిత ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గో సంరక్షణకై శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు. హిందూ ధర్మదీక్ష సేవక్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బైరిశెట్టి శశిధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షా కార్యక్రమంలో శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి విశ్వధర్మ పరిరక్షణ వేదిక అధ్యక్షులు శివస్వామి, బ్రహ్మపదం పీఠాధీశ్వ రులు కృష్ణమాచార్య, విశ్వేశ్వరగిరి పీఠాధిపతి ఆత్మనందభారతి, చాముండేశ్వర స్వామిజీ, బెనాస్ స్వామిజీ కృష్ణదాస్, నారాయణ స్వామిజీ, విద్యాశంకరనంద స్వామిజీ, వనితా శక్తి ఇంటర్నేషనల్ డైరెక్టర్ హేమ, శ్రీశైవక్షేత్ర పీఠం తెలంగాణ మేనేజర్ విశ్వనాధుని కోటేశ్వర్‌రావు, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎల్వీ కుమార్, హిందూ ధర్మ పరిరక్షకురాలు కరాటే కళ్యాణి, వివిధ గోశాలల నిర్వాహకులు, గోరక్షకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఎన్ని గోశాలలు ఉన్నాయి, వాటి నిర్వహణ ఎలా జరుగుతోంది అనే వివరాలను సేకరించాలని సూచించారు. గో అక్రమ రవాణా నిలిపివేసి, అక్రమ రవాణా చేసే వారిపై గోరక్ష చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గో సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని, పోలీస్ చెక్ పాయింట్లు పెంచి, గోరక్షా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# జూన్ 2న పిఆర్సీని ప్రకటించాలి

## 51 శాతం ఫిట్‌మెంట్‌తో అమలుచేయాలి

### ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం అయిన జూన్ 2న పీఆర్సీని ప్రకటించాలని ఎస్‌టియు టిఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘం 3వ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఎస్టీయూ టియస్ రాష్ట్ర అధ్యక్షుడు జి. సదానందం గౌడ్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలి, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో పలు తీర్మానాలను రాష్ట్ర కార్యవర్గం ఆమోదించింది. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జి సదానందం గౌడ్ మాట్లాడుతూ.. ఇటీవల ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాలన్నారు. నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ అమలు చేయుటకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు నూతనంగా ఉమ్మడి సర్వీస్ నిబంధనలు రూపొందించాలని, ఖాళీగా ఉన్న 600కుపైగా ఎంఈవో పోస్టులు, 80 డిప్యూటీ ఇఒ కేడర్ పోస్టులు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 20 యేళ్లుగా ఈ పోస్టులు ఖాళీగా ఉండటంతో పాఠశాలల పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టో మేరకు సిపిఎస్ రద్దు చేయాలని, కేంద్రప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మరణించిన రైతులకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

### బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి టి.జీవన్‌రెడ్డి డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 24:** రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మరణించిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే రూ. కోటి ఎక్స్‌గ్రేషియాను అందజేయాలని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టీ.జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న నిరక్ష్య వైఖరితోనే మరి కొందరు రైతులు ఆత్మ హత్యలు చేసు కుంటు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తు తం ధాన్యం కొనుగోలు లో రైతులు పడు తున్న ఇబ్బందులను కేబి నెట్ సమావేశంలో ఎందుకు చర్చించలేదని ప్రశ్నిం చారు. ధాన్యం కొను గోలులో రైతులు క్వింటా లక్కు రూ.250 నష్టపోతున్నారని, దీనిని ఆర్‌అండ్‌ఆర్ ట్యాక్స్‌గా పరిగణించాల్సి వస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను ఘోరంగా మోసం చేస్తుందని ఆరోపించారు. రైతు డిక్లరేషన్ పేరుతో రాహుల్ గాంధీ రైతులను మోసం చేశాడని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతులకు రైతు బంధు పంట పంటకు వస్తుండేదని అన్నారు. కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏనాడు కరీంనగర్ రాలేదు, ధాన్యం కొనుగోలు పై రివ్యూ చేయలేదని ఆరోపించారు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ పోటీల నిర్వహణపై పెట్టిన శ్రద్ధ రేవంత్ రెడ్డి రైతాంగ సమస్యలపై ఒక్క రివ్యూ చేయలేదని మండిపడ్డారు. ధాన్యం ఇంకా 50 శాతం కల్లాల్లోనే ఉంది. అకాల వర్షాలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొక్క జొన్న కొనుగోలులో పూర్తిగా నిరక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఫ్యూచర్ సిటీపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలతో మంత్రి శ్రీధర్‌బాబు ఉలిక్కి పడుతున్నాడని పేర్కొన్నారు. ఫార్మాసిటీ భూములను రేవంత్‌రెడ్డి అనుచరులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోలు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి స్పష్టత లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందో రాదో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అర్థమవుతుందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పోవాలా. కేసీఆర్ రావాల అనే నినాదం ప్రజల నుంచి మొదలైందన్నారు. మే 31వ తేదీ లోపు రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేయలేకపోతే జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలరోజున రేవంత్‌రెడ్డి జెండా ఆవిష్కరించే హక్కులేదని స్పష్టం చేశారు.



ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి



పోలీసులు విడుదల చేసిన నిందితుల ఫొటోలు

# లాయర్ హత్య కేసులో నిందితుల ఫొటోలు విడుదల

## చురుగ్గా సాగుతున్న దర్యాప్తు

### పోలీసుల అదుపులో నిందితులు!

**హైదరాబాద్ (కార్వాన్), మే 24, ప్రభాతవార్త:** హైకోర్టు న్యాయవాది ఖాజామొయి నుద్దీన్ హత్య కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. కారుతో ఢీకొట్టి హత్య చేసిన ఘటనకు సంబంధించి నిందితుల ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా స్కార్పియో కారులో నలుగురు నిందితులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృం దాలతో గాలింపు చర్యలు చేపట్టారు. మూడు రోజులుగా రెక్కీ నిర్వహించిన తర్వాతే దాడికి పాల్పడ్డట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వక్ఫ్ బోర్డు భూ ముల వివాదమే హత్యకు కారణమై ఉండొచ్చని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. హత్య చేసింది ముమ్మాటికీ కాంగ్రెస్ నాయకుడు వక్ఫ్ భూ ముల కబ్జాదారుడు అలాంఖాన్ అంటూ మృతుడి కుమారుడు ఇప్పటికే స్పష్టంగా ఆరోపించారు. గతంలో అలాంఖాన్ పలుమార్లు ఇంటికివచ్చి మరీ తనని, తన తండ్రిని బెదరించాడని తన తండ్రిపై ఐదుసార్లు హత్యాయత్నం కూడా చేయిం చాడని మృతుడి కుమారుడు చెప్పాడు. సీసీఫుటేజ్ ఆధారంగా చూస్తే నిందితుల కొన్నిరోజుల ముందుగానే ఆయన ఇంటి సమీపంలో మకాంవేసి మొయినుద్దీన్ కదలికలపై దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది. నిందితులు హత్యకు ముందు అక్కడ తిరిగినట్లు సీసీఫుటేజ్ స్పష్టం చేస్తోంది. హైకోర్టు న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ హత్య కేసులో కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తులో కారులో నలుగురు వ్యక్తులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ ఇంటిముందు కారులోకి ఎక్కుతుండగా వేగంగా వచ్చిన కారుతో ఢీకొట్టి హత్య చేసిన ప్రత్యర్థులు నెంబర్‌ప్లేట్ లేని స్కార్పియో కారుతో ఢీకొట్టి పరారయ్యారు. న్యాయవాది మొహిజుద్దీన్ హత్య కేసులో పోలీసుల దర్యాప్తులో కారుతో ఢీకొట్టి చంపిన నిందితుల్లో కవాడిగూడకు చెందిన వినయ్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించిన పోలీసులు, కల్వకుర్తి, గోవాలో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

## బిసి గురుకుల జూనియర్, డిగ్రీ కాలేజీ సీట్ల మొదటి దశ ఫలితాలు విడుదల

### 30 వరకు కాలేజీల్లో రిపోర్ట్ చేయాలి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్ర బీసీ గురుకుల విద్యా సంస్థ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లకు సంబంధించిన మొదటి విడత ఫలితాలను సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఆదివారం ప్రకటించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఫలితాలను, కాలేజీ వివరాలను సొసైటీ అధికారిక వెబ్‌సైట్ల ద్వారా ఇంటర్ ఫలితాలను తెలుసుకోవచ్చని తెలిపారు. ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా 10వ తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతోందన్నారు. ఎంజేపీటీబీసీఅడ్మిషన్స్ వెబ్‌సైట్ ద్వారా డిగ్రీ కాలేజీ అడ్మిషన్ల ఫలితాలు తెలుసుకోవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థులు తగిన డాక్యుమెంట్లు సిద్ధం చేసుకొని, ఈనెల 30 వరకు సంబంధిత కాలేజీల్లో అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 040-23328266లో సంప్రదించాలని బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ గురుకుల జూనియర్ కాలేజీల్లో 146 కాలేజీల్లో బాలురకు 12,640 సీట్లు అందుబాటులో ఉండగా, 144 కాలేజీల్లో బాలికలకు 12,080 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 30 డిగ్రీ గురుకుల కాలేజీల్లో 31 కోర్సులు, 9260 సీట్లు అందుబాటులో ఉన్నట్టు సెక్రటరీ ప్రకటనలో తెలిపారు.



## యాసంగి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

### నేటి నుండి రైతు గోస- బిజెపి భరోసా యాత్ర

### బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** యాసంగి ధాన్యాన్ని కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటివరకు 20 శాతం కూడా ధాన్యం సేకరణ చేయలేదని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. రైతులకు భరోసా కల్పించేందుకు 'రైతు గోస - బిజెపి భరోస్సా' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయమై ఆదివారం నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పవార్, పాల్వాయి హరీశ్, ఎమ్మెల్సీ మల్కకొమురయ్యతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. చేవెళ్ల నియోజకవర్గం నుంచి కుల్కచర్లలో ధాన్యం కేంద్రాలను మొదటి రోజు పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో 141 ధాన్యం ఉత్పత్తి అవుతుందని చెప్పి ఇప్పటివరకు 50 లక్షల మెట్రిక్‌ధాన్యం మాత్రమే కొనుగోలు చేసిందని, సీఎం రేవంత్‌రెడ్డి 80 శాతం కొనుగోలు చేసినట్లు ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బస్తాకు 4 కిలోలు తరుగు పేరుతో దోచుకుంటున్నారని, ఒకవేళ 90 లక్షల మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేస్తే అందులో 9 లక్షల మెట్రిక్‌టన్నుల కోత పెట్టిన ధాన్యం డబ్బులు ఎవరి ఖాతాలో పోతాయో చెప్పాలని నిలదీశారు. వరంగల్ డిక్లరేషన్ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేస్తుందని, రైతు భరోసా సకాలంలో పంపిణీ చేయడం లేదని మండిపడ్డారు. ఒకవైపు ఆకాల వర్షాలు కురిసి ధాన్యం తడుస్తుందనే భయంతో రైతులు దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, శనగలు వంటి పంటలను సక్రమంగా కొనుగోలు చేయడం లేదని, కేంద్రం పరిమితి విధించిందని అబద్ధాలు ప్రచారం చేస్తూ రైతులు బ్రోకర్లకు ధాన్యం అమ్మేలా కుట్రలు చేస్తుందని ఆరోపించారు. అనంతరం ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏ రాష్ట్రానికి ఇవ్వనన్ని నిధులను ధాన్యం కొనుగోలు కోసం కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇస్తోందన్నారు.0

## హిమాయత్‌సాగర్ ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ బోర్‌వెల్‌పై జలమండలి చర్యలు

### రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

### ఎఫ్‌టిఎల్ నంబర్లు 33, 34 వద్ద రెండు అక్రమ బోర్‌వెల్స్ గుర్తింపు


**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** జలమండలి దృష్టికి హిమాయత్ సాగర్ జలాశయం ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలో కొందరు వ్యక్తులు అక్రమంగా బోర్‌వెల్ తవ్వి భూగర్భ జలాలను వాణిజ్య అవసరాల కోసం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న విషయం వచ్చిన నేపథ్యంలో జలమండలి చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు హిమాయత్ సాగర్ గ్రామ సమీపంలోని ఎఫ్‌టిఎల్ నంబర్లు 33 మరియు 34 పరిధిలో తనిఖీలు నిర్వహించగా, అక్రమంగా ఏర్పాటు చేసిన రెండు బోర్‌వెల్ లు, నీటి సరఫరా వ్యాపారానికి వినియోగిస్తున్న ఒక నిల్వ ట్యాంక్‌ను గుర్తించారు. ఈ వ్యవహారంపై సంబంధిత వ్యక్తి బుచ్చిబాబుపై రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో అక్రమ వాణిజ్య నీటి కార్యకలాపాలు నిర్వహించినందుకు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 303(2) ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అదేవిధంగా భవిష్యత్తులో హిమాయత్ సాగర్ ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో ఇలాంటి అక్రమ బోర్ వెల్‌లు తవ్వకం, భూగర్భ జలాల వినియోగం లేదా వాణిజ్య నీటి సరఫరా కార్యకలాపాలు గుర్తించిన పక్షంలో తక్షణ చర్యలు తీసుకోవాలని మొయినాబాద్, శంషాబాద్ మరియు రాజేంద్రనగర్ మండలాల తహసీల్దార్లకు జలమండలి సమాచారం పంపింది. వాల్టా చట్టంతో పాటు అమల్లో ఉన్న ఇతర చట్టాల ప్రకారం సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు జారీ చేసినట్లు జలమండలి వెల్లడించింది.

# ఇంధన సరఫరా అత్యంత కీలకం

### అమెరికాకు తేల్చి చెప్పిన భారత్

### రూబియోతో చర్చల్లో జైశంకర్ పునరుద్ఘాటన

### ఢిల్లీలో విదేశాంగ మంత్రుల చర్చలు



**న్యూఢిల్లీ, మే 24:** విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఆదివారం న్యూఢిల్లీలో విస్తృత చర్చలు జరిపారు. ఇరు దేశాల నాయకులు భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య బలాన్ని పునరుద్ఘాటించారు. వాణిజ్యం, ఇంధనం, రవాణా, ప్రాంతీయ భద్రత వంటి కీలక సహకార రంగాలపై సమాలో చనలు జరిపారు. ప్రతినిధి బృందం స్థాయి చర్చల అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జైశంకర్ మాట్లాడుతూ, వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఇంధన వాణిజ్యం విస్తరించడాన్ని స్వాగతించిన ఆయన, భారతదేశ ఇంధన భద్రతకు వైవిధ్యభరితమైన ఇంధన సరఫరాలు అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. ఇరాన్ వివాదంపై జైశంకర్ మాట్లాడుతూ, ప్రపంచ ఇంధన ధరలు తక్కువగా ఉండేలా చూడటం, నిరాటంకమైన వాణిజ్యం కొనసాగేలా చూడటంలో భారత్, అమెరికా రెండింటికీ బలమైన ఆసక్తి ఉందని అన్నారు. సంప్రదింపులు, దౌత్యం, అలాగే సురక్షి తమైన, నిరాటంకమైన సముద్ర వాణిజ్యానికి భారతదేశం అనుకూలంగా ఉందని కూడా పునరుద్ఘాటించారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తో పాటు ఇతర గల్ఫ్ దేశాలతో బలమైన సంబంధాలు కలిగిన ప్రపంచంలోని అతి కొద్ది దేశాలలో భారతదేశం కూడా ఒకటని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో భారతదేశానికి సాపేక్ష ప్రయోజనాలు ఉన్నాయని, ఈ సంబంధాలన్నింటినీ కొనసాగిస్తూ దేశ ప్రయోజనాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలనేదే న్యూఢిల్లీ ముందున్న సవాలు అని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, ప్రవాస భారతీయుల సంక్షేమం, తక్కువ ఇంధన ధరలను భారతదేశం కోరుకుంటోందని ఆయన పునరుద్ఘాటించారు. ప్రజల మధ్య సంబంధాల ప్రాముఖ్యతను కూడా డాక్టర్ జైశంకర్ నొక్కిచెప్పారు. చట్టపరమైన చలనశీలత ప్రతికూలంగా ప్రభావితం కాకూడదని అన్నారు.

ప్రపంచంలో అమెరికాకు అత్యంత ముఖ్యమైన భాగస్వాములలో భారతదేశం ఒకటని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అభివర్ణించారు. కొత్త శతాబ్దాన్ని నిర్వచించే అన్ని కీలక అంశాలపై భారతదేశం, అమెరికా వ్యూహాత్మకంగా ఏకీభవిస్తున్నాయని ఆయన అన్నారు. ఉగ్రవాదం కారణంగా ఇరు దేశాలు నష్టపోయాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోని ఏ దేశంతోనైనా అమెరికాకు ఉన్న సంబంధం, భారతదేశంతో ఉన్న వ్యూహాత్మక పొత్తుకు నష్టం కలిగించేలా ఉండదని కూడా ఆయన నొక్కిచెప్పారు. ఇంధన విషయంలో కూడా ఇరు దేశాలు వ్యూహాత్మకంగా ఏకీభవిస్తు న్నాయని కార్యదర్శి రూబియో ఇంకా అన్నారు. ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, 21వ శతాబ్దానికి అను గుణంగా అమెరికా తన వలస విధానాన్ని ఆధునీ కరిస్తోందని ఆయన అన్నారు. యుఎస్ వీసా మార్పులు భారతదేశానికి మాత్రమే ప్రత్యేకమైనవి కావని ఆయన తెలిపారు. అమెరికాకు భారతీయ సమాజం అందిస్తున్న అపారమైన విలువ గురించి రూబియో ఈ సందర్గంగా గుర్తుచేశారు. అమెరికాలో భారతీయులపై జాత్యహంకార వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై స్పందిస్తూ, ప్రపంచంలోని ప్రతి దేశంలోనూ తెలివితక్కువ వారు ఉంటారని విదేశాంగ కార్యదర్శి రూబియో అన్నారు. ఇరాన్‌కు సంబంధించిన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, ఆ విషయంలో శుభవార్త ఉందని, త్వరలో మరిన్ని సానుకూల పరిణామాలు ఆశించవచ్చని ఆయన సూచించారు. రాబోయే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశానికి ముందు, గల్ఫ్, ఇండోపసిఫిక్‌లోని పరిణామాలతో సహా ప్రాంతీయ సమస్యలపై కూడా ఇరు దేశాల నాయకులు చర్చించారు. చర్చలు నిష్కాపట్యంగా, ఫలవంతంగా జరుగుతాయని డాక్టర్ జైశంకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ నెల 26వ తేదీన జరగనున్న క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో నాలుగు రోజుల పర్యటన నిమిత్తం శనివారం భారత్‌కు విచ్చేశారు. జైశంకర్, రూబియోలతో పాటు, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్, జపాన్ విదేశాంగమంత్రి తోషి మిత్సు మొటెగి కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. ప్రాధాన్యతా రంగాలలో క్వాడ్ సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడంపై ఈ నాయకులు తమ అభిప్రాయాలను పంచుకోవడంతోపాటు, ఇండోపసిఫిక్ ప్రాంతంలో కొనసాగుతున్న కార్యక్రమాల పురోగతిని, పరస్పర ఆసక్తి ఉన్న ఇతర అంశాలను సమీక్షించే అవకాశం ఉంది.

## నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు

### సంపద సృష్టికర్తలుగా ఎస్‌హెచ్‌జి మహిళలు

### మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** తెలంగాణలో మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త అర్థం చెబుతోంది. ఒకప్పుడు కేవలం పొదుపు సంఘాలుగా ఉన్న మహిళా స్వయం సహాయక బృందాలు నేడు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వామ్య శక్తులుగా ఎదుగుతున్నాయి. ఆడబిడ్డలను సంక్షేమ లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహించనుంది. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి అవకాశాలు, ఆరోగ్యం, పోషణ, పారిశ్రామిక ప్రగతిని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

మహిళా వారోత్సవాల సందర్భంగా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళాశిశు సంక్షేమ శాఖలు, సెర్ప్, మెప్మాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తం గా అవగాహన సదస్సులు, ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పారిశ్రామిక ప్రదర్శనలు, ఆరోగ్య శిబిరాలు, యువతులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నాయి. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న మహిళా సాధికారత కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలను లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామికవేత్తలుగా, సంపద సృష్టికర్తల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వారోత్సవాల్లో భాగంగా మే 25న ఇందిరా మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపనలు, 26న మహిళా సంఘాల ఆధ్వరనయంలో 553 ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవం, 27న సోలార్ ప్లాంట్ల ప్రారంభం, ప్రత్యేక సాధారణ సమావేశాలను నిర్వహించనున్నారు. 29న స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక వనరులు, ఉపాధి అవకాశాలను విస్తరించే లక్ష్యంతో జిల్లా స్థాయిలో లోన్ మేళాలు నిర్వహించనున్నారు. వ్యవసాయ, పశుసంవర్ధక, వ్యవసాయేతర రంగాల్లో కొత్త జీవనోపాధి యూనిట్లను ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని కొమురం భీమ్ భవన్‌లో ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నారు. 30న అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా అక్షరాస్యత సాధించిన మహిళలను జిల్లా, మండల స్థాయిలో సన్మానించనున్నారు. అదే రోజున బాలికల కోసం జిల్లా కేంద్రాల్లో మాక్ పార్లమెంట్ కార్యక్రమాలు నిర్వహించి నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించనున్నారు.

## గ్రామీణ ప్రాంతాలకు పాకిన బైక్, కార్ రేసింగ్

### మహబూబ్‌నగర్‌లో బైక్ రేసింగ్‌కు ఐదుగురు బలి

### విజయవాడలో కార్లతో ఢీకొంటూ నడిరోడ్డులో యువకుల యుద్ధం

### హైదరాబాద్‌లో పెట్రేగుతున్న కుర్రకారు రేసులు



మహబూబ్‌నగర్‌లో జరిగిన బైక్ రేసింగ్ ప్రమాద దృశ్యం

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో రేసర్ల జోరు ప్రమాదకరంగా మారుతోంది. నిన్నమొన్నటి వరకు హైదరాబాద్ సహా ప లు నగరాలకు బైక్ రేసింగ్ వరకే పరిమితం కాగా ఇప్పుడు కార్ రేసింగ్, ఆటోల రేసింగ్‌లు దాటి యువకులు పెద్ద కార్లతో పరస్పరం ఢీకొం టూ ముష్టి యుద్ధాలు చేసుకునే వరకు వెళ్లడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ నెల 11వ తేదీన మహబూబ్‌నగర్‌లో అర్థరాత్రి సమయం లో బైక్ రేసింగ్ కారణంగా బైక్‌పై వున్న ముగ్గురు యువకులతో పాటు వీరు ఢీకొన్న కారులో మరో ఇద్దరు చిన్నారులు మరణించిన ఘటన తె లుగు రాష్ట్రాల్లో సంచలనం రేపింది. తాజాగా శనివారం రాత్రి రాయదుర్గం పరిధిలో యువకులు బైక్, కార్ల రేసింగ్‌లో హోరెత్తించగా ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ గాయపడ్డాడు. బైక్, కార్ రేసింగ్ కారణంగా అనేకసార్లు, అనేక మంది మరణించిన ఉదంతాలు పలు కుటుంబాల్లో వి షాదం నింపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో బైక్ రేసింగ్ ప్రమాదం అంటే మొదట గుర్తుకు వచ్చేది ప్రముఖ క్రికెటర్, తెలంగాణ మంత్రి అజారుద్దీన్ తనయుడు అయా జుద్దీన్ దుర్మరణం. 2011 సెప్టెంబర్ 11వ తేదీన గచ్చిబౌలిలో అవుటర్ రింగ్ రోడ్డుపై అయాజుద్దీన్‌తో పాటు కొందరు యువకులు ఖరీదైన స్పోర్ట్స్ బైక్‌లపై వేగంగా వెళుతున్న క్రమంలో అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అయాజుద్దీన్ ఐదు రోజుల తరువాత ఆసుపత్రిలో చనిపోయాడు. ఈ ఘటనలో మరో యువకుడు కూడా మరణించాడు. అప్పట్లో అవుటర్ రింగ్ రోడ్ పూర్తిగా నిర్మాణం జరగలేదు. ఈ ఘటన అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటన తరువాత ఓఆర్ఆర్‌తో పాటు ఉమ్మడి ఎపిలో బైక్ రేసింగ్‌పై కఠిన ఆంక్ష లు విధించినా ఇది ఇప్పటికీ ఎక్కడా అమలవడం లేదు. ఇతర ప్రాంతాల విషయం అలావుంచితే హైదరాబాద్ నగరంలోనే అనేకచోట్ల నిత్యం బై క్ రేసింగ్ జరుగుతూనే వుండగా ఇప్పుడు కార్ రేసింగ్, ఆటోల రేసింగ్ తోడయ్యాయి. ఈ సందర్భంగా కొన్నిసార్లు ప్రమాదాలు జరిగి కొందరు మరణించిన ఉదంతాలు కూడా వున్నాయి. ఇంకొన్ని ఘటనల్లో రేసింగ్‌లో పాల్గొన్న వాహనాలు పూర్తిగా ధ్వంసం అవగా, రేసర్లు గాయాలతో బయటపడ్డారు. బంజారాహిల్స్, మాదాపూర్, జూబ్లీహిల్స్, రాయదుర్గం, పాతబస్తీతో పాటు నెక్లెస్‌రోడ్డు మార్గం లోనూ పలుమార్లు రేసిం గ్‌లు జరిగిన దాఖలాలు అనేకం వున్నాయి. తాజాగా మహబూబ్‌నగర్ పట్టణంలో ముగ్గురు యువకులు బైక్‌పై వేగం గా హైదరాబాద్‌కు వస్తూ వెను కాల నుంచి ఒక కారును ఢీకొన్నారు. ఈ ఘటనలో బైక్‌పై వున్న ముగ్గురితో పాటు కారు వెనుక భాగంలో వున్న ఇద్దరు చిన్నారులు మరణించారు. ఇక తాజాగా మూడు రోజుల క్రితం విజయవాడలో ఇద్దరు యువకులు ఒక అమ్మాయి కోసం కార్లతో పరస్పరం ఢీకొని నడిరోడ్డుపై అర్థరాత్రి వేళ యుద్ధం చేయడం సంచలనం రేపింది. ఈ ఘటనలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. రాయదుర్గంలో శనివారం నాడు కార్ రేస్ కారణంగా ఓ కానిస్టేబుల్ గాయపడ్డాడు.

### కఠినచర్యలు లేకపోవడంవల్లే రేసింగ్‌లు ఆగడం లేదు

ఇదిలావుండగా తరచూ వెలుగుచూస్తున్న బైక్, ఆటో, కారు రేసింగ్‌లపై పోలీసులు కఠినంగా వ్యవహరించడం లేదనే విమర్శలు వున్నాయి. దశాబ్ద కాలం క్రితం గచ్చిబౌలిలోని ఓఆర్ఆర్ బైక్ రేసింగ్‌కు కేరాఫ్‌గా వుండేది. అప్పట్లో అవుటర్ రింగు రోడ్డుపై ఇప్పటిలాగా టోల్ గేట్లు, పో లీసు పహారా లేక పోవడంతో కుర్రకారు బైక్‌లపై ఇష్టారీతిన రేసింగ్‌లకు వెళుతుండే వారు. అయాజుద్దీన్ తర హాలో పలువురు యువకులు రే సింగ్‌లో పాల్గొని ప్రాణాలు కోల్పోయారు. రేసింగ్‌లో పాల్గొనే యువకులు లక్షలాది రూపాయలు బెట్టింగ్‌లో పెడుతుంటారు. దీనిపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. మహబూబ్ నగర్, విజయవాడ ఘటనల తరువాతైనా రేసింగ్‌ల విషయం లో పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం వుంది.



ఆదివారం ఖమ్మంలో జరిగిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు-2026లో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

## రాజకీయ లాభాల కోసం భయాందోళనలు సృష్టించడం సరికాదు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

### పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు-2026

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** ప్రస్తుతం ప్రపంచం తీవ్రమైన అంతర్జాతీయ ఆర్థిక, భౌగోళిక సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొం టుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు - 2026లో రాంచందర్‌రావు మాట్లాడారు. ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు మార్కెట్ తీవ్ర ఒత్తిడికి గురైందని పేర్కొన్నారు. భారతదేశంలో కేవలం 10 శాతం మేర మాత్రమే క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి జరుగుతుండగా, మిగతా అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరిగినప్పటికీ, భారత్‌లో మాత్రం ఇంధన ధరల పెరుగుదల చాలా పరిమితంగానే ఉండటం కేంద్ర ప్రభుత్వ సమర్థ నిర్వహణకు నిదర్శనమన్నారు. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు స్వల్పంగా పెరగగానే కాంగ్రెస్ పార్టీ, ఇండీ కూటమి, తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీలు రాజకీయ విమర్శలకు దిగుతున్నాయని విమర్శించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించకుండా కేవలం రాజకీయ లాభాల కోసం భయాందోళనలు సృష్టించడం బాధ్యతారాహిత్య రాజకీయమని అన్నారు. ప్రపంచ దేశాల్లో ఇంధన ధరలు భారీగా పెరిగాయని, యూరప్‌లోని పలు దేశాల్లో 15 శాతం నుంచి 26 శాతం వరకు ధరలు పెరిగాయని తెలిపారు.

ఐర్లాండ్‌లో డీజిల్ ధరలు 28 శాతం, పెట్రోల్ ధరలు 25 శాతం వరకు పెరిగాయని చెప్పారు. పాకిస్థాన్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారి డీజిల్ ధరలు 54.9 శాతం, పెట్రోల్ ధరలు 42.7 శాతం వరకు పెరిగాయని గుర్తుచేశారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో అక్కడి ప్రభుత్వం సబ్సిడీలు కొనసాగించడం సాధ్యం కాదని స్వయంగా ప్రకటించిందన్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు 25 శాతం నుంచి 100 శాతం వరకు పెరిగిన సమయంలో కూడా భారత్‌లో కేవలం సుమారు రూ.3 మేర మాత్రమే పెంపు జరగడం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వ ముందుచూపు, ఇంధన భద్రతపై తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాల ఫలితమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని, కానీ యుపిఏ హయాంలో చేసిన ఆర్థిక దుర్వినియోగ భారాన్ని దేశం ఇప్పటికీ భరిస్తుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గిన సమయంలో కూడా ప్రజలకు ఉపశమనం ఇవ్వకుండా ఆయిల్ బాండ్ల పేరిట లక్షల కోట్ల అప్పులను భవిష్యత్ తరాలపై మోపిందని ఆరోపించారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు సుమారు రూ.10 వేల కోట్లకు పైగా పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## పూర్తిస్థాయిలో మొక్కజొన్న పంట కొనుగోలుకు నిర్ణయం

### రూ.1,800 కోట్లు కేటాయింపు

### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** పంట కొనుగోళ్లపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. మొక్కజొన్న రైతులకు భారీ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో పండిన పంటల కొనుగోళ్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడంతో అన్నదాతలను ఆదుకునేందుకు మొక్కజొన్న పంటను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం అదనంగా మరో రూ.1800 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుందని తెలిపారు. మొక్క జొన్న కొనుగోళ్ల కోసమని ఇప్పటికే ప్రభుత్వం రూ.4 వేల కోట్లు కేటాయించిందన్నారు. పరిమితికి మించి రావడంతో కొన్ని రోజులుగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మక్కల కొనుగోళ్ల ప్రక్రియలో ఇబ్బందులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పలు జిల్లాల నుంచి వచ్చిన వినతుల మేరకు శనివారం నాటి కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. మక్క రైతులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో అదనపు కొనుగోళ్లకు వెంటనే నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో అన్ని జిల్లాల్లో మక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియ ఊపందుకోనుంది. ఇక జొన్న పంట కొనుగోళ్లకు వెంటనే రూ.1,100 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. ప్రతి రైతు దగ్గర నుంచి పంట కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. జిల్లాల వారీగా జొన్న కొనుగోళ్ల ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా పొద్దుతిరుగుడు పంటను 25 శాతానికి మించి కొనుగోలు చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, రైతుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# శాంతి ఒప్పందం వైపు అమెరికా-ఇరాన్ అడుగులు!



**టెహ్రాన్, వాషింగ్టన్, మే 24:** అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన అమెరికా, ఇరాన్ మధ్య వివాదానికి తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాలు 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి దగ్గరగా ఉన్నాయని, దీనికి సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా ఇరాన్ తన చమురును అమ్ముకోవడానికి అనుమతించడం, కీలకమైన హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, వివాదాస్పద అణు కార్యక్రమాన్ని నిలువరించడం వంటి అంశాలు లీక్ అయ్యాయి. ఈ 60 రోజుల ఒప్పందంలో భాగంగా హార్మూజ్ జలసంధిని ఎలాంటి సుంకాలు లేకుండా తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. నౌకల స్వేచ్ఛా రాకపోకల కోసం అక్కడ ఏర్పాటు చేసిన మైన్‌లను తొలగించనుంది. దీనికి బదులుగా, అమెరికా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని ఎత్తివేయనుంది. ఇరాన్ చమురు అమ్మకాలకు వీలుగా కొన్ని ఆంక్షలను సడలించడంతో పాటు స్తంభింపజేసిన ఇరాన్ నిధులను కూడా విడుదల చేయనుంది. ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన ఇరాన్ అణు కార్యక్రమంపై మాత్రం ఇరు దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అణ్వాయుధాలను తయారు చేయబోమని, యురేనియం శుద్ధిని నిలిపివేస్తామని ఇరాన్ హామీ ఇవ్వాలని ఒప్పంద ముసాయిదాలో ఉన్నట్లు ఆక్సియోస్ పేర్కొంది. ప్రాథమిక చర్చల్లో అణు కార్యక్రమం అంశం ఉండదని ఇరాన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇరుపక్షాలు ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చిన తర్వాతే ఈ క్లిష్టమైన అంశంపై చర్చిస్తారని తెలుస్తోంది. భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఈ ఒప్పందంపై కొన్ని గంటల్లో ప్రపంచం ఒక శుభవార్త వినే అవకాశం ఉందని ఆదివారం ఢిల్లీలో వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఒప్పందం చాలావరకు కొలిక్కి వచ్చిందని, అయితే తుదిరూపు రావాల్సి ఉందని తెలిపారు. మరోవైపు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ అమెరికాతో సానుకూల వాతావరణం ఏర్పడుతున్నప్పటికీ, కీలక అంశాలపై ఒప్పందం కుదురుతుందని చెప్పలేమన్నారు. ఈ చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్, త్వరలోనే మరో విడత చర్చలు నిర్వహించాలని ఆశిస్తున్నట్లు ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు. శాంతి చర్చలు జరుగుతున్నప్పటికీ అమెరికా మళ్లీ యుద్ధాన్ని ప్రారంభిస్తే ఇదివరకటి కంటే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని ఇరాన్ చీఫ్ నెగోషియేటర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ హెచ్చరించడం ఉద్రిక్తతల తీవ్రతకు అద్దం పడుతోంది.

### ఇరాన్‌తో శాంతి ఒప్పందం ఖరారు: ట్రంప్

ఇరాన్ తో ఒక విస్తృత శాంతి ఒప్పందం దాదాపు ఖరారైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ ఒప్పందం తుది దశలో ఉందని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఒప్పందంపై పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, టర్కీ, ఈజిప్ట్, జోర్డాన్, బహ్రెయిన్ దేశాల అధినేతలతో ఫోన్‌లో చర్చలు జరిపినట్లు తెలిపారు. అమెరికా, ఇరాన్‌తోపాటు పలు ఇతర దేశాల మధ్య ఈ ఒప్పందంపై చర్చలు చాలావరకు పూర్తయ్యాయని ట్రంప్ పేర్కొన్నారు. కేవలం తుది మెరుగులు మాత్రమే మిగిలి ఉన్నాయని అన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కూడా తాను ప్రత్యేకంగా మాట్లాడానని, ఆ చర్చలు కూడా సఫలమయ్యాయని ట్రంప్ చెప్పారు. ఒప్పందంలోని కీలక అంశాలను ప్రస్తావిస్తూ ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్మూజ్ జలసంధిని పూర్తిస్థాయిలో తెరవనున్నట్లు స్పష్టం చేశారు. ఈ పరిణామం భారత్‌కు ఎంతో ముఖ్యమైనదని, గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు అధికంగా చమురు దిగుమతులు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గితే ఇంధన ధరలు, సరఫరా వ్యవస్థపై సానుకూల ప్రభావం పడే అవకాశం ఉందని అన్నారు. ఈ ఒప్పందం పూర్తి స్వరూపం, ఏ దేశం పాత్ర ఏంటి అనే వివరాలను ట్రంప్ వెల్లడించలేదు

# హైదరాబాద్‌లో కొనసాగుతున్న డ్రంకన్ డ్రైవ్ దాడులు..
# 438 మంది మందు బాబుల పట్టివేత

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** జంట నగరాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలు చోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 438 మంది మందు బాబులు ప ట్టుబడ్డారు. వీరిలో 365 మంది ద్విచక్ర వాహనదారులు, 25 మంది ఆటో డ్రైవర్లు, 47 మంది కార్లతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు వున్నా రు. పట్టుబడ్డ వారిలో 98 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 191 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 83 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 42 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 13 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఆరుగు రు 251 నుంచి 300 పాయింట్ల వరకు, ఐదుగురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వా హనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువా త కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలి పారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడించారు. మల్కాజిగిరి పరిధిలో 227 మంది, సైబరాబాద్‌లో 294 మంది మందు బాబుల పట్టివేత ఇదిలావుండగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 227 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 185 మంది ద్విచక్ర వాహనదారులు, 12 మంది ఆటో డ్రైవర్లు, 29 మంది కార్ల డ్రైవర్లు, ఒకరు హెవీ వాహన డ్రైవర్ వున్నారు. కాగా సైబరాబాద్ పరిధిలో 294 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 255 మంది ద్విచక్ర వాహనదారులు. ఐదుగురు ఆటో డ్రైవర్లు, 34 మంది కార్ల డ్రైవర్లు వున్నారు.

## ముఠా కార్మికుని మృతికి సిపిఎం బాబు రావు సంతాపం

**విజయవాడ మే24 ప్రభాతవార్త ప్రతినిధి:** భవన నిర్మాణ కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు డిమాండ్ చేశారు. నిర్మాణరంగంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తూ చనిపోయిన కార్మికులు కుటుంబాలకు తక్షణమే 10 లక్షల నష్టపరిహారం రాష్ట్ర ప్రభుత్వం అందించాలన్నరు. లిఫ్ట్ ముఠా పని చేస్తూ ప్రమాదవశాత్తూ మృతిచెందిన బాను నగర్‌కు చెందిన పంచాడ కన్నయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కార్మికుడి కుటుంబానికి న్యాయం జరిపించేందుకు ఆందోళన చేపట్టారు. భవన యజమాని 7 లక్షల ఆర్థిక సహాయం, మట్టి ఖర్చులు ఇచ్చేలా అంగీకారం కుదిర్చిన మేరకు చెక్‌ను అందజేస్తారు. ఈ మేరకు చెక్‌ను బాధిత కుటుంబ సభ్యులకు బాబూరావు అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని కాలరాస్తుందని విమర్శించారు. కార్మిక సంక్షేమ నిధిను దారిమళ్లించారని ధ్వజమెత్తారు.

## ప్రస్థాన సాధనలతో సంపూర్ణ ఆరోగ్యం

**విజయవాడ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్థాన సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్ఫూర్తి కుటుంబం యోగ ఇన్‌స్ట్రక్టర్ ప్రభాకర్ తెలిపారు. స్ఫూర్తి కుటుంబం ఆంధ్రప్రదేశ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మి విశ్వగురువు, సైంటిఫిక్ సెయింట్, పూర్ణ గురువులు గురు విశ్వస్ఫూర్తి గురుదేవులు అనుగ్రహించిన ఆసన ప్రాణామాయ యోగ ప్రక్రియ లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. నిరంతరం యోగ సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంత లభిస్తుందని గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి తెలిపారు. స్ఫూర్తి కోటుంబ జోనల్ ఇన్‌చార్జ్ కె. మాధవ్ ధ్యాన మనో ప్రస్థానం గురించి వివరంగా తెలియజేశారు. ధ్యాన మనో ప్రస్థానం ద్వారా మనస్సులో మంచి మారుపలు తెచ్చుకొని, దానిని మన ఆధీనంలో ఉంచుకోవచ్చని చెప్పారు. ఈ శిక్షన కార్యక్రమంలో 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లెల వరలక్ష్మి, వి.దుర్గా భవాని, స్ఫూర్తి కుటుంబ వాలంటీర్లు చొప్పరపు బాల వెంకట పవన్ సాయింరాం, ఆదిత్య స్ఫూర్తి పాల్గొన్నారు.

## ఏ సినిమాకైనా పర్సంటేజ్ ఇవ్వాల్సిందే

### తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త** రాష్ట్రంలో ఏ సినిమా విడుదల చేయాలన్నా పర్సంటేజ్ ఇవ్వాల్సిందేనని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ది సినిమా విడుదలవుతున్న నేపథ్యంలో ఈ మూవీని థియేటర్లలో రిలీజ్ చేయాలంటే తమకు పర్సెంటేజ్ ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పింది. ఇకపై ఏ సినిమా అయినా పర్సంటేజ్ కావాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తుది నిర్ణయాన్ని ప్రకటించింది. తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సభ్యులు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు, మూడు సార్లు చర్చలు జరిగాయి. హరిహర వీరమల్లు రిలీజ్ సమయంలో రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. కానీ, సంవత్సరం గడిచిపోయింది. పెద్ది సినిమాకు మాకు పర్సంటేజ్ కావాల్సిందే. మమ్మల్ని నిర్మాతలు రెచ్చగొడుతున్నారు. మొదట మూడు వారాలు అన్నారు, ఇప్పుడు ఆరు వారాలు అంటున్నారు. పర్సెంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తాము. రాష్ట్రంలోని 120 మంది థియేటర్స్ ఓనర్లు దీన స్థితిలో ఉన్నారు. పర్సంటేజ్ సిస్టంను కావాలనే నిర్మాతలు లేట్ చేస్తున్నారు. మాకు పర్సెంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి. 10,15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి రెవెన్యూ ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్స్‌కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంద్ధి. పర్సంటేజ్ విధానం కొత్త విషయం కాదు. అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఉంది. కాబట్టి కూర్చుని పర్సంటేజ్‌ను తేల్చండి. అన్ని సినిమాల రిలీజ్ సాఫీగా జరుగుతుంది. మీటింగ్‌లో కూడా పర్సంటేజ్‌కు సైన్ చేస్తేనే పెద్ది రిలీజ్‌కు ఒప్పుకుంటాం అని చెప్పాము. సబ్ కమిటీలో మెంబర్స్‌గా ఉండి మాకు కావలసిన పర్సంటేజ్‌ను సాధించుకుంటాం. మెగాస్టార్ చిరంజీవి పిలిస్తే వెళతాం. పెద్దమనిషికి మా బాధలు చెప్పుకుంటాం.

## బంకీపూర్‌నుంచే ప్రశాంత్‌కిశోర్ పోటీ



**పాట్నా, మే 24:** బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఖాళీ చేసిన బంకీపూర్ నియోజకవర్గం ఉప ఎన్నికలో జన్ సురాజ్ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ప్రకటించారు. బంకీపూర్‌లో బీజేపీని ఓడిచే సామర్థ్యం జన్‌సురాజ్‌కే ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జన్ సురాజ్ పార్టీ 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి 238 సీట్లలో పోటీ చేసి ఒక్క సీటు కూడా సాధించలేకపోయింది. అధికార ఎన్డీయే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ఎన్నికలకు ముందు పథకాల పేరుతో ఒక్కో మహిళకు రూ.10 వేలు చొప్పున ఇవ్వడం ఎన్నికల ఫలితాలను దెబ్బతీసిందని ఎన్నికల ఫలితాల అనంతరం ప్రశాంత్ కిషోర్ విశ్లేషించారు. బీజేపీకి దశాబ్దాలుగా కంచుకోటగా ఉన్న బంకీపూర్ నియోజకర్గం నుంచి గతం అసెంబ్లీ ఎన్నికల్లో నితిన్ నబిన్ పోటీ చేసి వరుసగా ఐదోసారి విజయం సాధించారు. ఆర్జేడీపై 50వేల ఓట్ల ఆధిక్యంలో ఆయన గెలుపొందగా, జన్ సురాజ్ పార్టీ మూడో స్థానంలో నిలించింది. గత జనవరిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ ఎన్నికయ్యారు. అనంతరం రాజ్యసభకు ఎన్నిక కావడంతో గత నెలలో బంకీపూర్ నియోజకవర్గానికి ఆయన రాజీనామా చేశారు. బంకీపూర్‌లో ఆరు నెలల్లోపు ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. బంకీపూర్ నియోజకవర్గం నుంచి జన్ సురాజ్ పోటీ చేస్తుందని ప్రకటించిన ప్రశాంత్ కిషోర్ ఆ నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాలపై నేరుగా సమాధానం ఇవ్వలేదు. దీనిపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పార్టీ సంస్థాగత పనులపై దృష్టి సారించేందుకే తాను గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదని, పార్టీ సమష్టి నిర్ణయానికే తాను కట్టుబడి ఉంటానని చెప్పారు. కాగా, జన్ సురాజ్ బిహార్ అధ్యక్షుడు మనోజ్ భారతి మాట్లాడుతూ, నితిన్ నబిన్ జాతీయ అధ్యక్షుడు కావడంతో బంకీపూర్ నియోజకవర్గం ఇప్పుడు వీవీఐపీ సీటుగా మారిందన్నారు. దీంతో బీజేపీ కూడా శక్తివంచన లేకుండా గెలిచేందుకు ప్రయత్నిస్తుందని, జన్ సురాజ్ నుంచి గట్టి నేతను నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గత 20 రోజులుగా నియోజకవర్గం ప్రజలతో మాట్లాడుతున్నామని, ప్రశాంత్ కిషోర్‌ను తమ అభ్యర్థిగా చూడాలని బంకీపూర్ కోరుకుంటున్నట్లు తమ పరిశీలనలో తేలిందని అన్నారు. పార్టీ కార్యనిర్వాహకవర్గం, ప్రశాంత్ కిషోర్ అంగీకరిస్తే ఈసారి పోటీ రసవత్తరంగా ఉంటుందని చెప్పారు.

## కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయిలో పెరిగింది: వైసిపి నేత అంబటి రాంబాబు

**విజయవాడ,మే 24,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయిలో పెరిగిందని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారుచంద్రబాబు వచ్చే ఎన్నికల్లో గెలవడన్నారు.ప్రజల్లో అశాంతి దాని నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారనిమండిపడ్డారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే భయం చంద్రబాబుకు పట్టుకుందని, అందుకే నిరంతరం వైసీపీపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజ మెత్తారు. వైఎస్ కుటుంబానికి పులివెందులలో ఎన్నడూ ఓడిపోయిన చరిత్ర లేదని ఆయన గుర్తుచేశారు.చంద్రబాబు నియంతలా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, అధికారంలోకి వచ్చాక రూ.3.5 లక్షల కోట్లు అప్పు తెచ్చిన కూటమి ప్రభుత్వం ఆ నిధులతో రాష్ట్రానికి ఏం చేసిందని అంబటి ప్రశ్నించారు. వైసీపీని తిట్టడం తప్ప వీరికి పాలన చేతకావడం లేదన్నారు. రాష్ట్రంలో పంటలకు గిట్టుబాటు ధర లేదని... మొక్కజొన్న ధరలపై ప్రశ్నిస్తే గోడౌన్లపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ యుద్ధాల నెపంతో పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించి ప్రజలపై భారం పడకుండా చూసే కనీస ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయడం లేదని, చంద్రబాబు, లోకేష్ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు.

## విదేశాల్లో ఉద్యోగం పేరుతో మోసం

**జూబ్లీహిల్స్, మే 24, ప్రభాతవార్త:** విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ఘటనపై పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైంది. మలేషి యాలో ఉద్యోగం పేరుతో రూ.2.50 లక్షలు వసూలు చేసి, చివరకు టూరిస్ట్ వీసాపై పంపి మోసం చేసినట్లు బాధితుడు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.పంజాగుట్ట తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన గొల్ల సాయి రాహుల్(24) సోమాజిగూడలోని ఏఈ స్క్వేర్ ఐఎం మైగ్రేషన్ ఓపీసీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఆశ్రయించాడు. మలేషియాలో ఉద్యోగం కల్పిస్తామని, వర్క్ వీసా ఏర్పాటు చేస్తామని కన్సల్టెన్సీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. మొత్తం రూ.3.50 లక్షలు అవుత ందని, ముందుగా రూ.35 వేలును చెల్లించాలని కోరడంతో ఆన్‌లైన్ ద్వారా ఆ మొత్తాన్ని చెల్లించాడు. తరువాత లోన్ వెంటనే రాదని, ముందుగా డబ్బులు చెల్లిస్తే మలేషియాకు వెళ్లిన 10 రోజుల్లో ఉద్యోగం వస్తుందని సేల్స్ మేనేజర్ శ్యామ్‌బాబు నమ్మించాడు. దీంతో మరో రూ.95 వేలును చెల్లించాడు. అనంతరం ప్రయాణ ఏర్పాట్ల కోసం మరో రూ.1.20 లక్షలు. ఏప్రిల్ 22న మలేషియాకు బయలుదేరే సమయంలో రూ.50 వేలు, మరోసారి రూ.70 వేలు చెల్లిం చాడు. మలేషియాలోని కౌలాలంపూర్ ఎయిర్ పోర్ట్‌కు వెళ్లాడు. అక్కడ నాలుగు గంటల పాటు వేచి ఉన్న తరువాత ఒక వ్యక్తి వచ్చి పాస్‌పోర్ట్ ఇవ్వాలని కోరడంతో అనుమానం వచ్చి రాహుల్ అతనికి పాస్‌పోర్ట్ ఇవ్వలేదు. అప్పటికే మోస పోయినట్లు గ్రహించిన రాహుల్ హైదరాబాద్‌కు తిరిగి టికెట్ బుక్ చేసుకుని ఏప్రిల్ 24న తిరిగి వచ్చాడు. కన్సల్టెన్సీ ప్రతినిధులను తన డబ్బులు తనకు చెల్లించాలని కోరగా 45 రోజులు అక్కడ ఉండకపోవడంతో ప్రాసెస్ ఫెయిల్ అయ్యిందంటూ మరో రూ. లక్ష డిమాండ్ చేశారు. సేల్స్ మేనేజర్ శ్యామ్‌బాబు, ప్రాసెసింగ్ మేనేజర్ అష్ఫాక్, యజమాని అంకిత అతన్ని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మలేషియాలో ఉద్యోగం, వర్క్ వీసా పేరుతో టూరిస్ట్ వీసాపై పంపించి రూ.2.50 లక్షలు మోసం చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొనడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గోదావరి జలాల వినియోగంలో నిర్లక్ష్యం వీడండి

### న- 968 టిఎంసిలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోండి

### - కాళేశ్వరం మరమ్మతులపై నిర్లక్ష్యం తగదు

### సిఎం రేవంత్ రెడ్డికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఘాటు లేఖ

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:**తెలంగాణకు కేటాయించిన గోదావరి జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం నిరక్ష ్యంగా వ్యవహరిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై సిఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం ఆయన ఘాటుగా లేఖ రాశారు. తెలంగాణకు ట్రిబ్యునల్ కేటాయించిన సుమారు 968 టిఎంసిల గోదావరి జలాల వినియోగం ఇప్పటికీ పూర్తిస్థాయిలో జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువ కాలం కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ తెలంగాణ ప్రాంతంలో గోదావరి జలాల వినియోగం కేవలం 400 టిఎంసిలకే పరిమితమైందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత కేంద్రంలోని మోది ప్రభుత్వం తెలంగాణకు గోదావరి నదిపై 360 టీఎంసీల వినియోగానికి సంబంధించిన పలు ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇందులో కాళేశ్వరం - 237 టీఎంసీలు, సీతారామసాగర్ - 67 టీఎంసీలు, సమ్మక్కసాగర్ - 47 టిఎంసిలు సహా పలు ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల రూపకల్పన, నిర్మాణంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిరక్ష ్యం ప్రదర్శించడంతో బ్యారేజీలు దెబ్బతిన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రెండున్నరేళ్లలో జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డిఎస్ఎ) కాళేశ్వరం బ్యారేజిల పునరుద్ధరణపై పలుమార్లు నివేదికలు ఇచ్చినా అమలు చేయడంలో చొరవ తీసుకోలేదని విమర్శించారు. దీంతో రాష్ట్ర ప్రజలు సుమారు 200 టిఎంసిల గోదావరి జలాలను వినియోగించుకోలేకపోతున్నారని ఆరోపించారు. ఇక సీతారామ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం హైడ్రాలజీ సహా అన్ని అనుమతులు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయలేదని సిఎంకు రాసిన లేఖలో రాంచందర్‌రావు విమర్శించారు. దీంతో 67 టిఎంసిల గోదావరి జలాల వినియోగం ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. అలాగే సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు 47 టీఎంసీల హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చినప్పటికీ, కమాండ్ ఏరియా గుర్తింపులో ప్రభుత్వం నిరక్ష ్యం చూపుతోందని ఆరోపించారు. అదేవిధంగా.. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-కావేరి నదుల అనుసంధానం.



# ఉచిత డిస్కమ్‌కు అనుమతి వద్దు!

**కొత్త పంపిణీ సంస్థ ఏర్పాటు వెనుక కుట్ర**

**అన్నదాతల పేరిట మరణ శాసనం**

**అప్పులు పెంచడమే తప్ప ప్రయోజనం లేదు**

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త** కొత్తగా ఏర్పాటు చేస్తున్న మూడో ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థకు అనుమతి ఇవ్వ వద్దని తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఈఆర్సీ)కి పలువురు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో "మూడో ఉచిత డిస్కమ్, ప్రకటిత లక్ష్యాలు, ఆచరణ సవాళ్లు" అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు.. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని దుస్సాహసాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేస్తూ మూడో ఉచిత డిస్కమ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి రైతులను కష్టాల్లోకి నెట్టుతుందని, థర్డ్ డిస్కమ్ రైతుల పాలిట మరణశాసనం అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తంచేశారు. అప్పులతో పుట్టిన డిస్కమ్ సేవలు ఏలా సాధ్యం అని వారు ప్రశ్నించారు. ఇందులో పాల్గొన్న మాజీ మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతు కొత్తగా ఏర్పాటు చేస్తున్న రైతు డిస్కమ్ భవిష్యత్‌లో రైతుల పాలిట మరణశాసనంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త డిస్కమ్ ఏర్పాటుకు ఈఆర్సీ నుంచి అనుమతులు లేక ముందే ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడం శోచనీయమన్నారు. ఎవరి అభిప్రాయం లేకుండానే ఏక పక్షంగా మూడవ డిస్కమ్ ఏర్పాటు చేసి రైతులను నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం ఉద్యోగుల విభజన తీరు గమనిస్తే సుమారుగా 600 డీటీఆర్‌లను ఒకరు చూడాలంటే సాధ్యమా అని ప్రశ్నించారు. అప్పుల డిస్కమ్ ఏలా నిర్వహిస్తారని ఇంజనీర్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. మూడవ డిస్కమ్ ఏర్పాటు అవసరం లేదని, రెండు డిస్కమ్‌లతో గత పన్నెండు సంవత్సరాలుగా వినియోగదారులకు మంచి సేవలు అందుతున్నాయని అన్నారు. 3వ డిస్కమ్‌తో అప్పులు పెంచడమే తప్ప ఏలాంటి ప్రయోజనం లేదన్నారు. టీఈఈఏ మాజీ ప్రధాన కార్యదర్శి రామేశ్వరయ్య శెట్టి మాట్లాడుతు మూడవ డిస్కమ్‌తో ప్రభుత్వంతో పాటు ఏ వర్గానికి ఉపయోగం లేదన్నారు. రైతుసంఘం నాయకుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతు రైతు డిస్కమ్ అంటే వ్యాపారమన్నారు. ఈ డిస్కమ్‌తో రైతులకు సేవలు అందుతాయనేది భ్రమ అన్నారు. సీపీఐ(ఎం) సహకార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతు కొత్త డిస్కమ్ ఏర్పాటు వెనుక కుట్ర దాగి ఉందన్నారు. ప్రభుత్వానికి రైతులపై నిజమైన ప్రేమ ఉంటే తక్కువ ఖర్చుతో వచ్చే విద్యుత్ కేటాయించేదన్నారు. కానీ అధిక ధరతో వచ్చే థర్మల్ విద్యుత్‌ను కేటాయించడం వెనుక సంస్థను నిర్వీర్యం చేసే కుట్ర దాగి ఉందన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కోటేశ్వర్‌రావు మాట్లాడుతు ఇది రైతు డిస్కమ్ కాదని, డబ్బులు లేని డిస్కమన్నారు. ఇది రూ. 35 వేల కోట్ల అప్పుతో పుడుతుందన్నారు. ఆదాయం లేని డిస్కమ్‌కు స్మార్ట్ మీటర్లు ఎందుకన్నారు. ప్రభుత్వం రైతు డిస్కమ్ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 1104 ట్రెడ్ యూనియన్ మాజీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతు రైతు డిస్కమ్ ఏర్పాటు ఏక పక్ష నిర్ణయమని, 30 శాతం స్టేక్ హోల్డర్స్ అయిన ఉద్యోగులతో కూడా చర్చించకుండానే డిస్కమ్ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఒక కొత్త డిస్కమ్ ఏర్పాటు చేయాలంటే ప్రజలతో పాటు ఉద్యోగులు, విద్యుత్ నిపుణులు, రైతు సంఘ నాయకులతో చర్చించాల్సిన అవసరం ఉందని టీఈఈఏ అధ్యక్షులు శివాజీ అన్నారు. కానీ ఇక్కడ ఎవరితో చర్చించకుండానే తాము చేయదలుచుకుంది చేసుకుంటున్నామనే దోరణితో వెళ్లడం బాధకరమన్నారు. రైతు డిస్కమ్ వాటా 42 శాతం ప్రకారం ప్రతి ఏటా రూ. 32 వేల కోట్ల విద్యుత్ కావాలని, ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న క్రాస్ సబ్సిడి కేవలం రూ. 16 వేల కోట్లు అన్నారు. మరి ఇంకా 16 వేల కోట్లు ఏలా సర్దుబాటు చేస్తారని ప్రశ్నించారు. రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తుల్జారాంసింగ్ మాట్లాడుతు కొత్త డిస్కమ్ ఏర్పాటుతో మళ్లీ తెలంగాణ లో పాత రోజులు రాబోతున్నాయన్నారు. ప్రభుత్వం ప్రజల, వినియోగదారుల శ్రేయస్సు కోరి థర్డ్ డిస్కమ్ ప్రతిపాదన వి రమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు డిస్కమ్‌కు లైసెన్స్ ఇవ్వకూడదంటూ నాలుగు తీర్మానాలు సమావేశం ఏకగ్రీవంగా చేసింది.

## తెలంగాణ థర్మల్ యూనిట్లలో స్థిరంగా బొగ్గు నిల్వలు
## అధిక లోడ్‌తో విద్యుత్ ఉత్పత్తి

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త** ప్రస్తుత వేసవిలో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవు తుండటంతో గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. ఇందుకు గాను భారీగా బొగ్గును వినియోగి స్తున్నప్పటికీ, రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలు సంతృప్తికరమైన బొగ్గు నిల్వలను నిర్వహిస్తున్నాయని బొగ్గు మంత్రిత్వ శాఖ డేటా వెల్లడించింది. రాష్ట్రంలో విద్యుత్‌కు రికార్డు స్థాయిలో డిమాండ్ చోటు చేసుకోవడంతో విద్యుత్ ఉత్పాదన కేంద్రాలు అధిక లోడ్ స్థాయిలలో పనిచేస్తున్నాయి. సింగరేణి 77, భద్రాద్రి 83, కాకతీయ 71, కొత్తగూడెం (కొత్త) 62, కొత్తగూడెం స్టేజ్7 థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) 80 శాతంగా ఉండగా, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఇది 21 శాతంగా ఉంది. మొత్తం మీద చూస్తే, అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం సింగరేణి కాలరీస్ థర్మల్ ప్లాంట్లు ప్రామాణిక స్థాయిలలో 19 శాతం బొగ్గు నిల్వలను కలిగి ఉండగా, తెలంగాణ విద్యుత్ 26 శాతం నిల్వలను కొనసాగిస్తోంది, ఈ రెండూ 621.7 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో, అధిక వేడి కారణంగా విద్యుత్ వినియోగం పెరగడంతో, విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో 4,766 మెగావాట్లకు చేరగా, వినియోగం 100.83 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. బొగ్గు నిల్వలు, సరఫరా ప్రణాళికల ద్వారా వ్యవస్థకు తగినంత మద్దతు ఉందని విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు తెలిపారు.

జాతీయంగా, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నివేదికల ప్రకారం, గరిష్ట డిమాండ్ ఉన్నప్పటికీ, భారతదేశంలోని థర్మల్ ప్లాంట్లు ఈ నెల ప్రారంభంలో 53.702 మిలియన్ టన్నుల బొగ్గును నిల్వ ఉంచుకున్నాయి. మార్చి 22 నాటి ఈ నిల్వలు 58.2 మిలియన్ టన్నులుగా ఉన్నాయి, ఇది గణనీయమైన నిల్వలను సూచిస్తోంది. సుమారు మూడు వారాల విద్యుత్ ఉత్పత్తికి మద్దతు ఇవ్వడానికి నిల్వలు సరిపోయాయి,

ఈ ధోరణిలో తెలంగాణలోని థర్మల్ కేంద్రాలు కూడా బొగ్గు నిల్వల పట్ల అప్రమత్తంగా ఉన్నాయి.

# నేటి నుండి రోహిణి కార్తె

### వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు

### వేసవి దుక్కులు, పచ్చిరొట్ట సాగు పనులు ముమ్మరం

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:**ఈ ఏడాది వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. రోహిణి కార్తె సోమవారం నుండి మొదలుకానుండడంతో వ్యవసాయ పనులు జోరందుకోనున్నాయి. ఈ సారి రుతుపవన వర్షాలు సకాలంలో కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. మరోవైపు ఎత్తిపోతల పథకాల జలాలతో చెరువుల్లో నీళ్లు ఉండడం, భూగర్భజలాలు పెరగడంతో ఇబ్బందులు ఉండవని రైతులు భావిస్తున్నారు. రోహిణి కార్తె ప్రవేశించడంతో ఓ పక్కన యాసంగి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుంటూనే వానాకాలం వ్యవసాయానికి కావాల్సిన విత్తనాలు, ఎరువులను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. అదే సమయంలో రోహిణికార్తెలో కురిసే వర్షాలకు వేసవి దుక్కులు దున్నుకునేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. రోహిణికార్తెలో (సోమవారం నుండి) వానాకాలం వరి నారు పోసేందుకు పెద్ద సంఖ్యలో అన్నదాతలు సిద్ధమయ్యారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వరి నారు మడులను సిద్ధం చేశారు.అయితే వానాకాలం సాగు ఊపందుకోనున్న రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టడానికి పల్లెల్లో దళారులు ప్రయత్నాలు మొదలుపెట్టడంతో విత్తనాల కొనుగోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నకిలీ గుర్తింపు తదితర అంశాలపై టాస్క్‌ఫోర్స్, పోలీసు బృందాలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. రోహిణిలో కురిసే వర్షాలకు అన్నదాతలు ప్రధానంగా జీలుగ, పెసర, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు.. రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు ఉంటాయని పెద్దలు చెబుతుంటారు. ప్రస్తుతం అకాల వర్షాలతో వాతావరణం చల్లబడినట్లు కనిపించినా వేడి, ఉక్కపోతతో ప్రజలుసతమతమవుతున్నారు. వాస్తవానికి రోహిణి కార్తెతో వేసవి కాలం పూర్తయిపోతుంది. ఆ తర్వాత వర్షాకాలం ప్రారంభమవుతుంది. ఈ సమయంలో వ్యవసాయంపై ఆధారపడ్డ రైతులు ఏరువాకను ప్రారంభిస్తారు. తమ పంట పొలాల్లో పనులను ముమ్మరం చేస్తారు. అయితే రోహిణీ కార్తె వచ్చిందంటే సంప్రదాయ బద్ధంగా రైతులు చేసే సంబరాలు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు రోహిణీ కార్తెకు వాతావరణమంతా చల్లబడి మబ్బులు కమ్ముకునేవని, రోహిణీకార్తె ప్రవేశాన్ని పెద్ద పండుగలా రైతులు జరుపుకునేవారు. కాగా.. ఈ ఏడాది మే 25వ తేదీన సోమవారం రోజున రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించనున్నాడు. ఇదే నక్షత్రంలో జూన్ 8వ తేదీ వరకు ఉంటాడు. ఈ పక్షం రోజుల పాట ఎండలు విపరీతంగా మండిపోతాయి. వేసవి కాలంలో నాలుగు నెలలుగా వచ్చే వేడి గాలులు ఒక ఎత్తు అయితే కేవలం రోహిణి కార్తె సమయంలో మాత్రం నేరుగా రోళ్లు పగిలేంత ఎండలు పెరిగిపోతాయి. జూన్ 8న రోహిణి కార్తె ముగిసి మృగశిర కార్తె ప్రవేశించనుంది. మృగశిరకార్తెలో తొలకరి వర్షాలు రైతులను పలకరించనున్నాయి.

## బడిబాటతో ప్రభుత్వ బడుల్లో పెరగని విద్యార్థుల సంఖ్య!

### ప్రైవేటులో చేర్పించడానికే మొగ్గు చూపిస్తున్న తల్లిదండ్రులు



**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 24:** రాష్ట్రంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తారు. బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వ స్కూల్స్‌లో విద్యార్థులను చేరమని ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరుగుతూ కోరుతారు. 5 సంవత్సరాలు నిండిన ప్రతి పిల్లవాన్ని ప్రభుత్వ స్కూల్‌లో చేరేలా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దాంతోపాటు బడిఈడు పిల్లలు బడిబయట ఉంటే వారిని ప్రభుత్వ స్కూల్స్‌లో చేర్పించడం బడిబాట కార్యక్రమం నిర్వహిస్తారు. చాలా కాలం నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వం అనుకున్నంత ప్రయోజనం జరగడం లేదని ప్రభుత్వ పెద్దలతోపాటు విద్యార్థి సంఘాలు విమర్శి స్తున్నాయి. ప్రతి ఏడాది బడిబాటను జూన్ 1 నుంచి నిర్వహించే వారు. కానీ ఈ ఏడాది ఇప్పటికే బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నారు. 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా బడిబాట కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఈ ఏడాది బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ పాల్గొనడం లేదు. సగానికిపైగా ఉపాధ్యాయులు సెన్సస్ పనుల్లో ఉండగా.. మిగిలిన వారు మాత్రమే బడిబాట కార్యక్రమంలో పాల్గొంటున్నారు. బడిబాటలో ఉపాధ్యాయులు గ్రామాల్లోని 5 సంవత్సరాల పిల్లలున్న ఇళ్లకు వెళ్లి వారి పిల్లలను ప్రభుత్వ స్కూల్‌కి పంపించమని కోరుతున్నారు. ఈ సమయంలో తల్లిదండ్రులు అడిగే ప్రశ్నలకు చాలా వాటికి ఉపాధ్యాయుల దగ్గర సమాధానం ఉండటం లేదు. స్కూల్స్‌లో కనీస సౌకర్యాలు ఉన్నాయా, పంతులు రెగ్యులర్‌గా బడికి వస్తారా? పిల్లలపై శ్రద్ధ పెడతారా? వంటి ప్రశ్నలకు ఉపాధ్యాయుల దగ్గర సమాధానాలు లేని పరిస్థితి. అయినప్పటికీ ఉపాధ్యాయులు వారిని ఒప్పించి వారి పిల్లలను ప్రభుత్వ బడికి రప్పించేలా ప్రయత్నం చేసినప్పటికీ కొద్ది రోజుల తరువాత వారు ప్రైవేటు బడికి వెళుతున్న సందర్భాలే ఉంటున్నాయి. బడిబాటలో బడిబయట ఉన్న పిల్లల తల్లితండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడతారు వారి పిల్లలను గవర్నమెంట్ స్కూల్‌కి పంపించమని కోరుతారు. ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని చెబుతారు. బడిబాటలో బడిబయట ఉన్న పిల్లలే ఎక్కువగా ప్రభుత్వ బడులకు వస్తున్నట్టు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని ప్రభుతనతవ పాఠశాలల్లో 1740 స్కూల్స్‌లో ప్రీప్రైమరీ తరగతులు కొనసాగుతున్నాయి. వాటిల్లో గత ఏడాది 2024-25 విద్యా సంవత్సరంలో 6431 మంది చేరగా.. 2025-26 విద్యా సంవత్సరంలో అదికాస్త 19,872కి చేరింది.

# వేడిలో చర్మం జాగ్రత్త !



పెరుగుతున్న ఎండ వేడి,చెమట. పొక్కులు, దద్దుర్లకు కారణమవుతాయి. నొప్పి, దురదతోపాటు చర్మమూ దెబ్బతింటుంది. వీటి బారిన పడొద్దంటే ఈ చిట్కాలు పాటించండి.

**కోల్డ్ కంప్రెషర్ :** ఎండ తగ్గేవరకూ ఇంట్లోనే ఉండటం అందరికీ సాధ్యం కాదు. కాబట్టి, బయటికి వెళ్లొచ్చాక చర్మం ఎర్రగా మారితే.. ఐస్ క్యూబ్‌లను మెత్తని వస్త్రంలో పెట్టి, సమస్య ఉన్నచోట మృదువుగా అద్దండి చాలావరకూ ఉపశమనం కలుగుతుంది.

**ఓట్‌మీల్ స్నానం..** ఓట్‌మీల్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎక్కువ. రోజూ ఒకపూట ఓట్‌మీ పౌడర్ రెండు స్పూన్లు స్నానం చేసే నీటిలో కలిపి, వాటితో స్నానం చేయండి. కావాల్సిన తేమ అందడమే కాదు చర్మ సమస్యలూ దరిచేరవు.

**కుం హైడ్రేటెడ్‌గా ఉండాలి...** శరీరానికి తగినన్ని నీరు అందకపోయినా సమస్యే! కనీసం 2 లీటర్లు తాగితే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఇంకా స్నానమయ్యాక కొన్ని చుక్కల కొబ్బరినూనెగానీ మాయిశ్చరైజర్‌గానీ తప్పక రాయండి. దద్దుర్లకు ఆస్కారం ఉండదు. వీటితోపాటు శరీరానికి గాలి తగిలేలా వదులుగా, లేతవర్ణాల్లో ఉండే దుస్తులనే ధరించాలి. ఎండలోకి వెళ్లాల్సి వస్తే రెండు గంటలకోసారి కనీసం ఎస్‌పీఎఫ్ 30 ఉండే సన్‌స్క్రీన్ లోషన్‌ను రాస్తుండాలి.

# అది టెక్స్‌లేషన్‌షిప్ మాత్రమే..

ఇరువురి మధ్య కేవలం ఫోన్‌లో సమాచారం ఇచ్చిపుచ్చుకొనే బంధం ఉంటే దాన్ని టెక్స్‌లేషన్‌షిప్ అని పిలుస్తున్నారు. అంటే రోజంతా ఎదుటివారి వివరాలను తెలుసుకోవడానికీ, తమ గురించి చెప్పడానికీ మెసేజ్‌లనే వాడుతున్న వారితో స్నేహం లేదా ప్రేమ బంధం ఉందని భావించొద్దంటున్నారు నిపుణులు. అలాంటి దాన్ని బలమైన బంధంగా ఊహించకోవద్దనీ హెచ్చరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా బంధాలేర్పడుతున్న ఈ కాలంలో కాలక్షేపం కోసం ఎదుటివారిని ఇలా మెసేజ్‌లతో మభ్యపెట్టే వాళ్లూ ఉంటారు.



ప్రతి చిన్న విషయాన్నీ మెసేజ్ చేస్తూ, మాట్లాడ టానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదంటే అవతలివారు మీతో ఎటువంటి బంధాన్నీ కొనసాగించడం లేదని ముందుగానే అర్థం చేసుకోవాలి. ఎదుటివారికి మీరు టైంపాస్ కావొచ్చు. లేదా మిమ్మల్ని తమ సమాచారంతో మాత్రమే మోసగిస్తూ.. దాన్ని స్నేహంగా చెప్పుకొంటూ ఉండొచ్చు. ఇటువంటి బంధాల నుంచి వీలైనంత త్వరగా బయటపడటం మంచిది.

స్నేహంతో కాదు.. ఉదయాన్నే 'హలో' పలకరింపుతో మొదలుపెట్టి రాత్రి నిద్రపోయేవరకూ మీ గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటే మీరు ఆలోచించాల్సిందే అవతలివారికి మీపై ప్రేమ ఉందనుకుంటే అది మీ అపోహే అవుతుంది. వర్చువల్‌గా మాత్రమే మీతో స్నేహం చేయడానికి వారు ఆసక్తి చూపిస్తుంటారు. దాన్ని ప్రేమ అనుకుంటూ ఊహల్లోకి జారితే మాత్రం ఆ తర్వాత మీరు కుంగుబాటుకి గురవడం ఖాయం. ఎందుకంటే ఇలాంటి వాళ్లే, మీరు కలిసి మాట్లాడదామన్న వెంటనే సాకులు చెబుతారు. ఇలా వాళ్ల తప్పించుకున్నప్పుడు మీర తీవ్ర వేదనకు గురికావాల్సి ఉంటుంది. ఎన్నిసార్లు అడిగినా కలవడానికి ఆసిక్తి చూపించకుండా, ఫోన్‌లో సమాచారంతో మాత్రమే బంధాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తుంటే నమ్మకపోవడం.

# కుంగుబాటుకు దూరంగా ..!



ఎన్ని పనులున్నా ఏదోలా చేసుకుంటూ పోతాంగానీ ఏదో చిరాకు ఆవహించినట్లుం టుంది. నిజంచెప్పాలంటే ఏదీ తోచదు. అలాంటిది ఒక్కోసారి మనసంతా దిగులు ఆవరిస్తుంది. ఎందుకోసం కష్టపడుతున్నాం అనే నైరాశ్యం వెంటాడుతుంది. ఇవన్నీ మానసిక అలసటకు చిహ్నాలే. పనిలో పడితే మామూలే అనుకోకుండా..దీన్నుంచి బయటపడటం ఎలానో ఆలోచించండి.

**తీరు మార్చుకుందాం :** వైఫల్యాలు ఎదురవనిది ఎవరికి చెప్పండి? కొన్ని అపజయాలు ఎదురవగానే ఢీలా పడిపోవడం వల్లే ఇలా జరుగుతుంటుంది. దీనికి విరుగుడు మన ఆలోచనా ధోరణిని మార్చుకోవటమే. ఆడవాళ్లం మనం బలహీనులం అన్న భావనను పెంచుం టాం. దాన్ని పక్కన పెట్టాలి. మీపై మీరు నమ్మకాన్ని, సాను కూల దృక్పథాన్ని ఏర్పరచుకోవాలి. ఏదైనా చేయగలను, సాధించ గలను అని మీరు నమ్మితే.. దాన్ని ఆమార్చుకునే మార్గం కనిపిస్తుంది.

**లక్ష్యాన్ని ఏర్పరచుకుని :** బాగా చదవాలి, మంచి ఉద్యోగం సాధించాలి అనుకున్నారు. అవన్నీ సాధించారు. ఆ తర్వాత?.. ఒకలాంటి శూన్యం ఏర్పడుతుంది. అందు వల్లనే ఈ నిరాశ. ఇది దరిచేరొద్దంటే కొత్త లక్ష్యాలు ఏర్పరచు కోండి. అది చేరుకోవ డానికి కష్టపడండి. అప్పుడు నిరాశకి చోటుండదు. మీరు ఏర్పరుచుకున్నది పెద్ద లక్ష్యం అయితే దాన్ని చిన్న చిన్న లక్ష్యాలుగా విభజించుకోండి. అప్పుడు సాధించడమూ తేలిక అవుతుంది.

**నమ్మకాన్ని పెంచుకుని :** పిల్లలు ఎన్నిసార్లు కింద పడుతుం టారు? ఇంకెన్నిసార్లు దెబ్బలు తగిలించుకుంటారు. అప్పుడేం చేస్తాం? దగ్గరకు తీసుకొని ఊరడిస్తాం, ధైర్యం చెబుతాం. మనకీ అలాంటి ప్రోత్సాహం అవసరమే! అలా ఓదార్పు నిచ్చేవారు మీకూ ఒకరుంటే మంచిది.అది భర్త కావొచ్చు. స్నేహితురాలు కావొచ్చు. ఎప్పుడూ ఇల్లు, ఆఫీసంటూ బిజీగా గడిపేయక అలాంటి ఆత్మీయులతో మాట కలపండి. మీ ఆలోచనలను పంచుకోండి. నిరంతర పనుల బడలిక కూడా మనసుని నీరు గారుస్తుంది. అలని పోయేలా చేస్తుంది. ఫలితమే నాకే ఎందుకిలా అనే నిరాశ వగైరా.

**మీలో ఉత్సాహాన్ని నింపే..** మీ మాటలను మనసారా వినే వారితో గడిపితే తెలియని ఉత్సాహం మీలో వచ్చి చేరుతుంది. ఆందోళన, కుంగుబాటు వంటివి ఆమడ దూరంలో ఉంటాయి. ఇంకా సామాజిక బంధాలు బలపడతాయి.



# విభూతి



పార్వతీదేవి సమేతమై ఉన్న పరమేశ్వరుడికి నమస్కరించి వెనువెంటనే జరిగిన ఘోరం గురించి తెలిపారు యముడు.. కుంభీపాక నరకం ఉన్నట్లుండి స్వర్గధామంగా మారి పోయిందని, దానికి కారణమేమిటో తెలియడం లేదని, పాపులంతా అలా స్వర్ణసుఖాలను అనుభవించటం ధర్మవిరుద్ధం కదా అని తెలిపారు.శివుడు వారి మాటలను విని..చిరునవ్వు నవ్వి.. దీనిలో వింత ఏమీ లేదు. నరకకూపం దగ్గరకు దూర్వాసుడు వెళ్లి లోనికి తొంగి చూసిన సమయంలో ముని నుదటి మీద ఉన్న మూడు విభూతి రేఖల్లోని కొన్ని అణువులు కెల్లి ఆ కూపంలో పడ్డాయి. ఆ పవిత్ర అనువుల ప్రభావమే ఇది అని చెప్పారు. ఆ సమయంలోనే కుంభీపాక కూపంలో పడి ఉన్న ప్రాణి కోటి అంతా దివ్య విమానం అధిరోహించి కైలాసం చేరుకున్నారు. భరదగణాలు అనే పేరుతో ఇప్పటికీ వారక్కడే ఉంటున్నారు. పరమేశ్వరుడు ఆ కుంభీపాక కూపాన్ని పితృదేవతలకు పనికి వచ్చే ఉత్తమ తీర్థంగా మార్చారు. ఆ తీర్థం పక్కనే శివపర్వాతుల మూర్తులను ప్రతిష్ఠించమని చెప్పి ఆ మూర్తులు పూజలందుకుంటారని, ఆ ప్రాంతం పితృతీర్థంగా మారిపోతుందని చెప్పాడు. యముడు చేసేదిలేక పితృలోకానికి చాలా దూరంగా మళ్లీ ఒక కొత్త కుంభీపాక నరక కూపాన్ని నిర్మించి పరిసరాలకు విభూతి ధరించిన శివభక్తులెవరూ రాకుండా కట్టడి చేశాడు. విభూతిలోని కొన్ని కణాలకే అంతటి మహత్తర శక్తి ఉందని ఈ కథ తెలుపుతోంది. అందుకే విభూతిని ధరించటం మనతో పాటు ఇతరులకు శుభాన్ని అందిస్తుంది.

# గోబీ ఎంత మంచిదో !



క్యాలీఫ్లవర్. ఇది రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం. బంగాళదుంప, టొమాటో, బీన్స్, క్యారెట్, బఠాణీ.. ఇలా దేనితో కలిపి వండినా.. మహా రుచిగా ఉంటుంది. తాలింపు వేసి.. వేయించినా సూపర్ రుచిగా ఉండే ఆధరవు మనదవుతుంది. దీంతో చేసే ఊరగాయ పచనచడి కూడా చాలా బాగుంటుంది. ముఖ్యంగా ఫ్రైడ్‌రైస్, బిర్యానీలకు స్పెషల్ టేస్ట్ తెప్పిస్తుంది. క్యాలీఫ్లవర్ పకోడీలు చేస్తామా! ఒక్కటి కూడా మిగలదు. ఇంత నోరూరించే క్యాలీఫ్లవర్‌లో ప్రోటీన్లు, విటమిన్లు, క్యాల్షియం, ఐరన్, సోడియం, పొటాషియం, ఫొలేట్, భాస్వరూం, మాంగనీస ఇలా మన శరీరానికి అవసరమైనవెన్నో ఉన్నాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్స్ అనారోగ్యాలను తరిమికొడితే.. ఇ-విటమిన్ కళ్ల కింది వలయాలను పోగొడుతుంది. ఇది మధుమేహాన్ని, క్యాన్సర్లను నిరోధిస్తుంది. ఊబకాయం రానివ్వదు. రక్తనాళాలు బిరుసెక్కడం, రక్తపోటు లాంటి సమస్యలను నివారిస్తుంది. ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంచుతుంది. చర్మం ముడతలు పడకుండా నిగారింపుతో ఉండేట్లు చేస్తుంది. రక్తం ఐరన్‌ను గ్రహిం చడంలో తోడ్పడుతుంది. క్యాలీఫ్లవర్ తినడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఎముకలు దృఢంగా ఉంటాయి. హిమెగ్లోబిన్ శాతం పెరుగుతుంది. జీర్ణప్రక్రియ మెరుగుపడుతుంది. జ్ఞాపకశక్తికి, నరాల వ్యవస్థకు కీలకమైన కోలిన్ ఇందులో విస్తారంగా ఉంది.

**చెలి** సామాజిక పరిణామంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్:Cheli@vaartha.com

# 'మర' పాతదే! కొత్త టచ్'తో

**పాత తరం పిండిమరకి కొత్తతరం** ఎలక్ట్రిక్ టచ్ ఇస్తే ఎలా ఉంటుందీ అనుకున్నారేమో తయారీదారులు ఇదిగో ఇక్కడున్న వుడ్ అండ్ గ్రానైట్ స్టోన్ ఎలక్ట్రిక్ గ్రైన్ మిల్‌ని తీసుకొచ్చారు. దీంతో పప్పులూ, ధాన్యాలూ ఇంట్లోనే పిండి పట్టుకోవచ్చు. మామూలు మిక్సర్, గ్రైండరు అయితే ధాన్యాలూ, పప్పులూ ఆడించి పిండి చేసుకోవడానికి వీలుగా ఉండవు. కానీ ఇంటి అవసరాల కోసమే తయారు చేసిన ఈ ఎలక్ట్రిక్ మిల్‌లో మాత్రం బయట మిల్లులో పట్టించినట్టే పిండి వస్తుంది. ఎన్నిరకాల



మిక్సీలు వచ్చినా కొందరు సంప్రదాయ పద్ధతుల్లో పట్టిన పిండే రుచిగా ఉంటుందంటారు. అలాంటి వారికి ఈ హోమ్ మిల్ మెషీన్ మంచి చాయిస్.. బయటికి వెళ్లే పని లేకుండా ఇంట్లోనే పిండిని పట్టుకోవచ్చు.

# 'పెద్ది' అందరి మనసుని తాకుతుంది



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'పెద్ది' దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన గ్లింప్స్, రెండు చార్ట్ బస్టర్ పాటలు, పవర్ ఫుల్ థియేట్రికల్ ట్రైలర్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది. జూన్ 3న ప్రత్యేక ప్రీమియర్‌లు ప్రదర్శించనున్నారు. 'పెద్ది కి ఆవాజ్' ఈవెంట్‌లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్ ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. నా మనసులో మీ అందరికీ ప్రత్యేకమైన స్థానం ఉంది. 'పెద్ది' ప్రమోషన్స్‌ను భోపాల్ నుంచి ప్రారంభించడం నాకు చాలా ఎమోషనల్‌గా అనిపిస్తోంది అన్నారు. జాన్వీ కపూర్ మాట్లాడుతూ.. 'మీ అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉంది.'పెద్ది'లో చాలా గొప్ప సందేశం ఉంది అన్నారు. ఎఆర్ రెహమాన్ మాట్లాడుతూ.. 'మీ అందరి సమక్షంలో ఈ ప్రదర్శన ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. రవి కిషన్ మాట్లాడుతూ.. 'ఎఆర్ రెహమాన్ గారు వంటి లెజెండ్ సమక్షంలో ఈ వేడుక జరగడం నిజంగా ఒక అద్భుతమైన అనుభూతి అన్నారు. క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రి విశ్వాస్ సారంగ్ మాట్లాడుతూ.. 'భోపాల్ ప్రజలు కళాకారులను ఎంతో ప్రేమిస్తారు, గౌరవిస్తారు అన్నారు. దివ్యేందు శర్మ మాట్లాడుతూ 'ఇది నాకు ఎంతో ముఖ్యమైన సినిమా. ఈ చిత్రంతోనే నేను తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నాను' అన్నారు. నిర్మాత వెంకట సతీష్ కిలారు మాట్లాడుతూ ..'నాకు ఈ నగరంతో ఎంతో ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఇంజినీరింగ్ పూర్తయ్యాక ఉద్యోగం కోసం భోపాల్ వచ్చాను. ఇక్కడ దాదాపు ఐదేళ్లు గడిపాను. అందుకే మధ్యప్రదేశ్‌ను మా రెండో ఇల్లుగా భావిస్తాను. ఇంత పెద్ద వేడుక కోసం మళ్లీ ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది అన్నారు.

# 'చిరు158' రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో చిరు బాబి2/చిరు 158 చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.'వాల్తేరు వీరయ' భారీ బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ విజయవంతమైన కాంబో మరోసారి చేతులు కలపడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. నిన్న పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో పాటు పలువురు ప్రముఖుల సమక్షంలో ఈ చిత్రం ఘనంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. మేకర్స్ ప్రకటించినట్లుగానే నేడు హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. తొలి షెడ్యూల్‌లో చిరంజీవి, అనస్వర రాజన్‌లపై కీలక టాకీ పార్ట్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం బిటిఎస్ వీడియోను విడుదల చేసింది. ఇందులో సినిమా ప్రధాన సాంకేతిక బృందాన్ని పరిచయం చేశారు. వీడియోలో ఉత్సాహంగా కనిపించిన చిరంజీవి, 'లెట్స్ సెట్ ది బ్లడీ బెంచ్‌మార్క్' అంటూ సందడి చేశారు. దర్శకుడు బాబీ కొల్లి మరింత భారీ స్థాయిలో కథను సిద్ధం చేశారు. దశాబ్దాలుగా తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న చిరంజీవి ఈ చిత్రంలో తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్, ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఇందుకోసం ఆయన మరోసారి అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. అలాగే అనస్వర రాజన్ కూడా మెగాస్టార్‌తో కలిసి నటించబోతుండటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సంగీతాన్ని ఎస్. థమన్ అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తిక్ కన్నన్ చిత్రానికి అద్భుతమైన విజువల్స్ అందించనున్నారు. ప్రొడక్షన్ డిజైన్ అవినాశ్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్‌ను ఆంటోని ఎల్. రూబెన్ చేస్తున్నారు. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందిస్తుండగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి ఆడిషనల్ స్క్రీన్‌ప్లే రచయితలుగా పనిచేస్తున్నారు. భాను-నందు ద్వయం సంభాషణలను అందిస్తున్నారు. ఈ చిత్రంలో కథానాయికతో పాటు ఇతర ప్రధాన తారాగణానికి సంబంధించిన వివరాలను త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు.

# శరవేగంగా 'స్వయంభూ' పోస్ట్‌ప్రొడక్షన్ పనులు



నిఖిల్ సిద్ధార్థ తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'స్వయంభూ'తో రాబోతున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో, పిక్సెల్ స్టూడియోస్ భువన్, శ్రీకర్‌ల నిర్మాణంలో, టాగోర్ మధు సమర్పణలో భారీ పీరియడ్ యాక్షన్ చిత్రంగా రూపొందుతోంది. 'స్వయంభూ' భారతీయ సినిమా రంగంలోనే బిగ్గెస్ట్ ప్రాజెక్టులలో ఒకటిగా రూపుదిద్దుకుంటోంది. తాజాగా విడుదలైన వీడియోలో సినిమా పోస్ట్ ప్రొడక్షన్, ముఖ్యంగా వీఎఫ్‌ఎక్స్ పనుల విస్తృత స్థాయిని చూపించారు. ఇందులో హీరో నిఖిల్ సిద్ధార్థ, దర్శకుడు భారత్ కృష్ణమాచారి, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్ కలిసి ప్రముఖ వీఎఫ్‌ఎక్స్ సంస్థ ఫాంటమ్ ఎఫ్‌ఎక్స్‌ను సందర్శించారు. భారీ యుద్ధ సన్నివేశాలు, విశాలమైన ప్రాచీన రాజ్యాలు, అద్భుతమైన విజువల్ ప్రపంచాన్ని రూపొందిస్తున్నారు. ఈ మాగ్నమ్ ఓపస్‌లో నిఖిల్ సరసన సంయుక్త, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. 'స్వయంభు' గ్రాండియర్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తోంది. అంతర్జాతీయ స్థాయి విజువల్స్‌ను కేకే సెంథిల్ కుమార్ తన కెమెరాతో ఆవిష్కరిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. స్వయంభూ పాన్‌ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది.

# రాయ్‌లక్ష్మి 'దేశీ మ్యాజిక్' మల్టీ కలర్ లెహాంగా



తన అందం, ఆకర్షణీయమైన రూపంతో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న ముద్దుగుమ్మ రాయ్ లక్ష్మి .తన అందం, ఆకర్షణీయమైన రూపంతో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న ముద్దుగుమ్మ రాయ్ లక్ష్మి. కేవలం వెండితెరపైనే కాకుండా, తన ఫిట్‌నెస్, స్టన్నింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాలోనూ ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని బిహైండ్ ది సీన్స్ ఫొటోలు నెట్టింట మంటలు పుట్టిస్తున్నాయి. సాంప్రదాయ దుస్తుల్లోనే మోడ్రన్ కిక్ ఇస్తున్న ఆ ఫొటోషూట్ విశేషాలు మీకోసం.. ఇన్‌స్టాగ్రామ్‌లో 'దేశీ మ్యాజిక్' పోస్ట్: రాయ్ లక్ష్మి చెన్నై లొకేషన్ నుండి తన అఫీషియల్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక క్రేజీ పోస్ట్ పెట్టింది, ఈ షూటింగ్ కోసం రాయ్ లక్ష్మి గుజరాతీ స్టైల్‌లో ఉండే రంగురంగుల 'చనియా చోలి' ని ధరించింది. పింక్, ఎల్లో, బ్లూ, ఆరెంజ్ రంగులతో కూడిన చెకర్డ్ ప్యాటర్న్ ఈ డ్రెస్‌కు ప్రత్యేక లుక్‌ను ఇచ్చింది. ఇక దీనికి మ్యాచింగ్‌గా సాంప్రదాయ భారతీయ జ్యువెలరీ, నుదుటిన మాంగ్ టిక్కా, పెద్ద చెవి రింగులు పెట్టుకుంది. డాన్స్ చేయడానికి వీలుగా దుపట్టా లేకుండా ఈ ఔట్‌ఫిట్‌ను డిజైన్ చేశారు.ఇప్పుడు ఆమె అవుట్ ఫిట్ వైరల్ అవుతుంది. నటి లక్ష్మి రాయ్ రాఘవ లారెన్స్ సరసన బ్లాక్‌బస్టర్ హారర్‌కామెడీ చిత్రం 'కాంచన' (ముని 2) లో 'ప్రియా' పాత్రలో నటించి తెలుగు, తమిళ ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. కేవలం కాంచన మాత్రమే కాకుండా రాయ్ లక్ష్మి ఖాతాలో మరికొన్ని క్రేజీ సినిమాలు ఉన్నాయి. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కాబోతున్న యాక్షన్‌డ్రామా థ్రిల్లర్ 'జనతా బార్'చిత్రంతో పాటు సీనియర్ నటుడు శ్రీకాంత్‌తో కలిసి 'గర్జన' అనే తెలుగు యాక్షన్ సినిమాలో కూడా ఆమె నటిస్తోంది.

# దుల్కర్ సల్మాన్ DQ41 కీలక షెడ్యూల్ పూర్తి



వర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం తన 41వ చిత్రం DQ41 షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. రవి నెలకుడితి దర్శకత్వంలో సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి తన ప్రతిష్టాత్మక ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. బ్యానర్ నుంచి వస్తున్న 10వ చిత్రం SLV10గా రూపొందుతున్న ఈ మూవీపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. దుల్కర్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, అద్భుతమైన భావోద్వేగాలతో కూడిన అందమైన ప్రేమకథగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. తాజాగా చిత్ర బృందం మంచుతో కప్పుకున్న అద్భుతమైన ప్రకృతి మధ్య కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసింది. సెట్స్ నుంచి విడుదలైన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రానికి అనయ్ ఓం గోస్వామి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆట

# రాయల్‌గా ప్లే ఆఫ్‌లోకి రాజస్థాన్

*అర్చర్ ఆల్‌రౌండ్ షో * ముంబైపై విక్టరీ * పంజాబ్ కింగ్స్ ఆశలు గల్లంతు * తొలి ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌తో ఢీ *





*అందరి చూపు వాంఖడేపైనే. ఐపీఎల్‌లో ఇప్పటివరకు జరిగిన 68 మ్యాచ్‌లు ఒకెత్తయితే, ఇది నాలుగు జట్ల భవిష్యత్‌ను నిర్ణయించే మ్యాచ్. మైదానంలో ఆడుతున్న జట్లలో ముంబైకైతే గెలిచినా, ఓడినా పరక్ పడదు. గుజరాత్ రాయల్స్‌కైతే డూ ఆర్ డై, గెలిస్తేనే ముందుకు. ఆ జట్టుతో పాటు మరో మూడు జట్లు పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు మైదానంలో ఆడకున్నా ఈ ఫలితంపై వారి భవిష్యత్తు. చివరకు ఒక్క హాఫ్ సెంచరీ నమోదుకాకున్నా తలా ఓ చేయి వేసి మొదట ముంబైకు 206 టార్గెట్ ఇచ్చారు. 200 ప్లస్ దాకా రావడం అంటేనే గ్రేట్. అలాంటిది ఈ స్కోరును కాపాడుకుంటూ స్టార్ ఆటగాళ్లున్న ముంబైకు ముకుతాడు వేశాడు. అనుకున్నది సాధించారు. నాలుగో ప్లే ఆఫ్ బెర్త్‌ను అందుకున్నారు.*

**ముంబై:** రాజస్థాన్ రాయల్స్ గెలిచి నిలిచిది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌పై 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసిన రాజస్థాన్ రాయల్స్... ఆ తర్వాత ముంబైను 20 ఓవర్లలో 9 వికెట్లకు 175 పరుగులకే పరిమితం చేసింది. పంజాబ్ కింగ్స్, కోల్‌కతా ఆశలపై నీళ్లు చల్లుతూ ప్లే ఆఫ్‌లోకి దూసుకెళ్లింది. 26న న్యూ చండీఘర్‌లో జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడేందుకు సిద్ధమైంది.

లక్ష్య చేధనలో ముంబై ఇండియన్స్ మరోసారి తడబడింది. కనీసం పరుగుల ఖాతా కూడా ఓపెన్ చేయకుండానే మొదటి వికెట్ కోల్పోయింది. హిట్ మ్యాన్ రోహిత్‌శర్మను జోఫ్రా ఆర్చర్ డకౌట్ చేశాడు. అదే ఊపులో తన రెండో ఓవర్‌లో నమన్ ధీర్(6)ను అద్భుత బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. మరో ఎండ్ నుంచి బర్గర్...రికల్టన్(12)ను అవుట్ చేసి ముంబైని మరో దెబ్బతీశాడు. క్రీజులోకి వచ్చిన తిలక్(3) కూడా పెవిలియన్‌కు క్యూ కట్టాడు. దీంతో ముంబై 38 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది.

ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన విల్ జాక్స్ కిరాక్ షాట్లతో బెంబేలెత్తించాడు. 18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులతో 33 పరుగులు చేసిన జాక్స్ దూకుడుకు యష్‌రాజ్ పుంజా ఫుల్ స్టాప్ పెట్టాడు. ఇక కెప్టెన్ హార్దిక్ పాండ్యా (15బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్సులు) క్రీజులోకి రాగానే భారీ షాట్లతో రాయల్స్ జట్టులో ఆందోళన రేపాడు. మరో ఎండ్‌లో క్రీజ్‌లో నిలదొక్కుకున్న సూర్యకుమార్(42 బంతుల్లో 60; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా ధాటిగా ఆడడంతో ముంబై గెలిచే ఊపులో కనిపించింది. ఈ దశలో మరోసారి అర్చర్ మ్యాజిక్ చేశాడు. హార్దిక్ పాండ్యాను అవుట్ చేశాడు. మరో ఎండ్‌లో బర్గర్, యష్ పుంజా, బ్రిజేష్ వికెట్లు తీయడంతో ముంబై 175 రన్స్‌కే పరిమితమైంది.రాజస్థాన్ బౌలర్లలో అర్చర్ 3వికెట్లు.. బర్గర్, బ్రిజేష్, యష్‌రాజ్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

**ఆరంభంలో తడబడ్డ రాజస్థాన్**

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్‌కు యశస్వీ జైస్వాల్(17 బంతుల్లో 27) ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చే ప్రయత్నం చేశాడు. మూడు సిక్స్‌లతో విరుచుకుపడ్డ యశస్వీ.. స్పిన్నర్ విల్‌జాక్స్ బంతిని బాదే ప్రయత్నంలో అవుటయ్యాడు.జైస్వాల్ అవుట్ తర్వాత స్కోరు పెంచే ప్రయత్నంలో వైభవ్(4)కూడా అదేస్కోరు వద్ద చాహర్‌కు చిక్కాడు. దీంతో 33 పరుగుల వద్దే ఇద్దరూ విధ్వంసక ఓపెనర్లు అవుటవడంతో రాజస్థాన్ తడబడింది. క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ రియాన్(14) రెండు ఫోర్లు,ఓ సిక్స్‌తో చెలరేగాడు. అదే క్రమంలో ఘజన్‌ఫర్ బంతిని స్టాండ్‌లోకి ఆడే ప్రయత్నం చేయగా, బౌండరీ లైన్ పైన అంతెత్తున ఎగిరి తిలక్ వర్మ అద్భుత క్యాచ్ అందుకున్నాడు. దీంతో రాజస్థాన్ 54 పరుగులకే 3 టాప్ ఆర్డర్ వికెట్లు కోల్పోయింది.

**మిడిల్ ఓవర్లలో పుంజుకుని...**

కష్టాల్లో పడ్డ రాజస్థాన్‌ను ధృవ్ జురెల్(26 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), దాసున్ షనక(15 బంతుల్లో 29; 3 సిక్స్‌లు)కాసేపు వికెట్ల పతనానికి అడ్డుగా నిలిచారు. ముఖ్యంగా షనక... ధాటిగా ఆడుతూ స్కోరును పరిగెత్తించాడు. వందకు చేరువవుతున్న దశలో లేని పరుగుకు యత్నించి రనౌటయ్యాడు. దీంతో 45 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. షనక అవుటైన తర్వాత జురెల్ గేర్ మార్చి ఆడే ప్రయత్నం చేశాడు. కార్బిన్ బాష్ యార్కర్ లెంగ్త్ బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. క్రీజ్‌లోకి వచ్చిన డోనోవన్ ఫెరీరా (18) దీపక్ చాహర్ బౌలింగ్‌లో, శుభమ్ దూబే (5) శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో వరుసగా అవుట్ అవుటయ్యారు.

**స్లాగ్ ఓవర్లలో అర్చర్ మెరుపులు**

స్లాగ్ ఓవర్లలో టెయిలెండర్లు దూకుడు చూపారు. జోఫ్రా ఆర్చర్(15 బంతుల్లో 32; 1ఫోర్, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ముంబై బౌలర్లపై సిక్స్‌లతో విరుచుకుపడుతూ రాజస్థాన్ స్కోరును 175 దాటించాడు.ఇక ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా క్రీజ్‌లోకి వచ్చిన రవీంద్ర జడేజా(11 బంతుల్లో 19), నండ్రే బర్గర్(3 బంతుల్లో 10) చివరి రెండు ఓవర్లలో 30పరుగులు జోడించడంతో రాజస్థాన్ స్కోరు 200 పరుగులు దాటింది. మిడిల్ ఓవర్లలో పుంజుకుని.. గట్టిగ నిలబడి రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోరు చేసింది. ముంబై బౌలర్లలో దీపక్ చాహర్, శార్దూల్ ఠాకూర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.


## విజయంతో ముగించిన ఢిల్లీ క్యాపిటల్స్

**కోల్‌కతా:** ఐపీఎల్ ఈ సీజన్‌లో ప్లే ఆఫ్ చేరడంలో విఫలమైన ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపుతో ముగించింది. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన నామమాత్ర మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను 40 పరుగుల తేడాతో ఓడించింది. మొత్తం ఏడు విజయాలతో 14 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. కోల్‌కతా 13 పాయిట్లతో ఏడో స్థానం పొందింది. రెండు జట్లు కూడా ప్లే ఆఫ్ చేరకుండానే ఐపీఎల్ నుంచి నిష్క్రమించాయి.

మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. అభిషేక్ పోరెల్(18బంతుల్లో 22)తో కలిసి కెఎల్ రాహుల్ (30 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఫ్లయింగ్ స్టార్ట్ అందించాడు. పోరెల్ ఉన్నంతసేపు ధాటిగా ఆడాడు. అతను అవుటైన తర్వాత రాహుల్ ఎదురుదాడికి దిగాడు. తన క్లాసీ షాట్లతో అలరించాడు. కోల్‌కతా బౌలర్లను చితక్కొడుతూ 24 బంతుల్లోనే 3 ఫోర్లు, 4 సిక్స్‌ల సహాయంతో మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. చివరకు రాహుల్ ఇన్నింగ్స్‌కు అనుకుల్ రాయ్ తెరదించాడు. మరోవైపు క్రీజ్‌లోకి వచ్చిన సాహిల్ పారిఖ్(17 బంతుల్లో 24), అక్షర్ పటేల్(25 బంతుల్లో 39), డేవిడ్ మిల్లర్ (19 బంతల్లో 28), అషుతోష్ శర్మ(11 బంతుల్లో 18) ధాటిగా ఆడడంతో ఢిల్లీ స్కోరు 200 మార్కు దాటింది.

అనంతరం లక్ష్యచేధనలో తడబడ్డ కోల్‌కతా 18.4 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. ఢిల్లీ బౌలర్లు కోల్‌కతా ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. ముఖ్యంగా కుల్‌దీప్ స్పిన్ తిప్పేశాడు. చివరి నాలుగు వికెట్లు 9 పరుగులకే పడ్డాయి. కెప్టెన్ రహానే 63 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కోల్‌కతా బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్, ఎంగిడి మూడేసి వికెట్లు, స్టార్క్ రెండు వికెట్లు పడగొట్టారు.





### 100 మీటర్లలో సరికొత్త రికార్డు

## అథ్లెటిక్స్‌లో నయా చిరుత

**రాంచీ:** భారత అథ్లెటిక్స్‌లోకి సరికొత్త చిరుత దూసుకువచ్చింది. రాంచీలో జరుగు తున్న 2026 అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్‌లో పంజాబ్‌కు చెందిన 25 ఏళ్ల గురిందర్‌వీర్ చిరుతలా పరుగెత్తాడు. పురుషుల 100 మీటర్ల ఫైనల్‌లో కేవలం 10.09 సెకన్లలోనే గమ్యాన్ని చేరి సరికొత్త జాతీయ రికార్డును నెలకొల్పాడు. స్వర్ణాన్ని అందుకున్నాడు. అనిమేష్ కుజూర్ (10.20 సెకన్లు) రజతం, ప్రణవ్ గురవ్ (10.29 సెకన్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు.

తన అద్భుత ప్రదర్శనతో గురిందర్‌వీర్ భారత అథ్లెటిక్స్ చరిత్రలో ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించాడు. 10.10 సెకన్ల కంటే తక్కువ సమయంలో 100 మీటర్ల దూరాన్ని పూర్తి చేసిన మొట్టమొదటి భారత అథ్లెట్‌గా నిలిచాడు. సెమీఫైనల్లో 10.17 సెకన్ల టైమింగ్ నమోదుచేసిన గురిందర్ సింగ్... తన రికార్డును మరింత మెరుగుపర్చుకున్నాడు.

అద్భుతమైన టైమింగ్‌తో గురిందర్‌వీర్ 2026 గ్లాస్లో కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించాడు. కామన్వెల్త్ క్రీడల అర్హత మార్క్ 10.16 సెకన్లు కాగా.. దాన్ని గురిందర్‌వీర్ సునాయాసంగా అధిగమించాడు. ఇక విశాల్ 400 మీటర్ల పరుగులో 44.98 సెకన్లతో జాతీయ రికార్డు నెలకొల్పాడు.

## 500 బిలియన్ డాలర్ల దిగుమతులకు అంగీకారం

**ఐదేళ్లపాటు అమెరికా ఉత్పత్తుల కొనుగోళ్లు**



**న్యూఢిల్లీ, మే 24:**అమెరికా ఉత్పత్తులను వచ్చే ఐదేళ్లపాటు 500బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు కొనుగోలు చేసేందుకు భారత్ డీల్ కుదిరిందని, ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయం రంగాలే ప్రధానంగా భారత్‌తో చర్చలు కూడా పూర్తి చేసినట్లు విదేశాంగమంత్రి మార్కో రుబియో అన్నారు.వాణిజ్యం, భద్రత,ప్రాంతీయ అంశాలవారీగా భారత ప్రతినిధి బృందంతో అమెరికా బృందం సమగ్ర చర్చలుజరిగాయన్నారు. క్వాడ్ మంత్రుల సమావేశాలో పాల్గొనేందుకు భారత్‌లో నాలుగు రోజుల పర్యటనకు వచ్చిన రుబియో ఇంధన భద్రత, వాణిజ్య రంగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. భారత్‌నుంచి అమెరికాకు ఎగుమతులతో పాటు అమెరికానుంచి భారత్‌కు వచ్చే దిగుమతులపైనా ఎక్కువ చర్చలుజరిగాయి. ఇందు కోసం తమకు భారత ప్రభుత్వంనుంచి 500 బిలియన్ డాలర్లమేర ఉత్పత్తుల కొనుగోలుకు అంగీకార ఒప్పందం జరిగిందని రుబియో చెప్పారు. అలాగే అమెరికా భారత్‌లమధ్య వాణిజ్య ఒప్పందం సత్వరమే ఖరారవుతుందన్న విశ్వాసం ప్రకటించారు. చర్చల్లో సానుకూలత పెరిగిందని, తుదిదశకు వాణిజ్య ఒప్పందం చేరుకుంటున్నట్లు ఆదేశ విదేశాంగమంత్రి వెల్లడించారు. వాణిజ్యం, ఇతర రాంగాల్లో కేవలం మిత్రలుగానే కాకుండా వ్యూహాత్మక మైత్రీబంధం రెండుదేశాలమధ్య పెరుగుతున్నదని రుబియో ఆశాభావం వ్యక్తంచేసారు.

## భారీ డివిడెండ్ ప్రకటించిన 3ఎం ఇండియా




**ముంబయి, మే 24:** టెక్నాలజీ అండ్ సైన్స్ దిగ్గజ కంపెనీ 3ఎం ఇండియా ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం ఫలితాల్ని ప్రకటించడంతో పాటు డివిడెండ్ కూడా ప్రకటించింది. ఫైనల్ డివిడెండ్ రూ. 160 తో పాటు రూ.346 స్పెషల్ డివిడెండ్ కూడా ప్రతిపాదించింది.మొత్తంగా చూస్తే ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.506 చొప్పున డివిడెండ్ అందించనుంది. రూ. 10 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుకు ఈ స్థాయిలో అర్హులైన షేర్ హోల్డర్లకు డివిడెండ్ ఇవ్వనుంది. ఇక ఈ డివిడెండ్ చెల్లింపులకు జులై 17 రికార్డ్ డేట్‌గా ప్రకటించింది. ఆ తేదీలోపు ఈ సంస్థ షేర్లను కలిగి ఉన్న వారు డివిడెండ్ పొందేందుకు అర్హులు అన్నమాట. ఆగస్టులో జరగనున్న తమ 39వ వార్షిక సర్వసభ్య సమావేశంలో బోర్డు, షేర్ హోల్డర్ల ఆమోదానికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతాయని స్పష్టం చేసింది. ఇక్కడ ఆమోదం లభిస్తే అప్పటి నుంచి 30 రోజుల్లోగా డివిడెండ్ చెల్లింపులు చేయనున్నట్లు పేర్కొంది. ఈ కంపెనీ ఈ స్థాయిలో డివిడెండ్ ప్రకటించడం ఇదేం తొలిసారి కాదు. ఇలా భారీ డివిడెండ్స్ గతంలోనూ ఆఫర్ చేసింది. 2025 జులైలో ఫైనల్ డివిడెండ్, స్పెషల్ డివిడెండ్ కలిపి రూ. 535 చొప్పున చెల్లించగా దానికి ముందటి ఏడాది రూ. 685 అందించింది. 2023 జులైలో రూ. 100 డివిడెండ్ ఆఫర్ చేయగా 2022 నవంబరులో స్పెషల్ డివిడెండ్ ఏకంగా రూ. 850 ఆఫర్ చేయడం విశేషం.

## టాప్10 బిలియనీర్ల సంపద 3.93 లక్షల కోట్లు

**ముంబై:** ఫోర్బ్స్ 2026 ప్రపంచ బిలియనీర్ల జాబితాలో భారత రియల్ ఎస్టేట్ రంగం తన సత్తా చాటింది. ఈ జాబితాలో 13 మంది భారత రియల్టీ దిగ్గజాలు స్థానం సంపాదించగా, వారిలో హైదరాబాద్‌కు చెందిన మై హోమ్ గ్రూప్ అధినేత జుపల్లి రామేశ్వర్ రావు మరోసారి తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. మొదటిస్థానంలో ఎప్పటిలాగే డిఎల్ఎఫ్ నిలిచింది. మాజీ ఛైర్మన్ సిఇఒ కుశాల్ సింగ్ అగ్రస్థానంలో నిలిస్తే లోథాగ్రూపు, రహేజాకార్ప్ వరుసగా రెండుమూడు స్థానాల్లో నిలిచాయి. గత ఏడాదితో పోలిస్తే రియల్టీ బిలియనీర్ల సంఖ్యలో మార్పులేదు. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, మైహోమ్స్ రామేశ్వర్ రావు భారత రియల్టీ బిలియనీర్ల జాబితాలో ఆయన 6వ స్థానంలో నిలిచారు. ఆయన సంపద రూ.22,011కోట్లుగా ఉంది. సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం వల్లే భారత రియల్టీ వ్యాపారులు తమ సంపదను కాపాడుకోగలిగారని ఫోర్బ్స్ ఇండియా విశ్లేషించింది.


మైహోమ్స్‌తో పాటు డిఎల్ఎఫ్ మాజీ సిఇఒ కుశాల్‌పాల్ సింగ్, లోథా గ్రూప్ వ్యవస్థాపకుడు మంగళ్ ప్రభాత్ లోథా, కె.రహేజా కార్ప్ ఛైర్మన్ చంద్రు రహాజా, ఓబరాయ్ రియాల్టీ ఛైర్మన్ వికాస్ ఒబెరాయ్, ఫోనిక్స్ మిల్స్ అతుల్ రూయా, ఫైవ్ హోల్డింగ్స్ ఛైర్మన్ కబీర్ ముల్చందానీ, కల్పతరు ఫౌండర్ మొఫత్‌రాజ్ మునోత్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ నుంచి రెజ్వాన్ ఇర్ఫాన్, నోమన్‌రజాక్‌లు బిలియనీర్స్ టాప్ టెన్ జాబితాలో చేరారు. మొత్తం టాప్‌టెన్ రియాల్టీ బిలియనీర్ల సంపద భారత్‌వరకే రూ.3.93 లక్షలకోట్లకుపైగా ఉన్నట్లు ఫోర్బ్స్ వెల్లడించింది.

### పెట్రోలుపై రూ.13, డీజిల్‌పై రూ.38 చొప్పున నష్టం

## చమురు కంపెనీలకు ఇప్పటికీ నష్టాలే

**ముంబయి, మే 24:** పదిరోజుల్లోపే వరుసగా మూడుసార్లు పెట్రోలుడీజిల్‌ధరలు పెంచినప్పటికీ చమురు మార్కెటింగ్‌కంపెనీలకు ఇంకా నష్టాలు ఎదురవుతూనే ఉన్నాయి. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో చమురు సరఫరాలో ఆటంకాలు, ముడిచమురు కొరతకారణంగా ధరలు పెంచుతున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో కూడా ముడిచమురు బ్యారెల్‌కు 100 డాలర్లకుపైబడటంతో చమురుశుద్ధి కంపెనీలకు ఈ భారం మరింత పెరుగుతోంది. ఇప్పటికీ కూడా పెట్రోలుపై లీటరుకు 13, డీజిల్‌పై రూ.38 చొప్పున నష్టాలు భరించాల్సి వస్తోందని చెపుతున్నాయి. సర్దుబాట్లు జరుగుతున్నప్పటికీ చమురు కంపెనీలకు నష్టాలభారం రూ.1.98 లక్షలకోట్లు అని ఇప్పటికే ప్రకటించాయి. ఈ ధరల పెంపును ప్రకటించకముందు కేంద్ర పెట్రోలియం మంత్రి హార్దీప్‌సింగ్‌పూరి మాట్లాడుతూ రోజుకు రూ.1000 కోట్లు నష్టం ఎదుర్కొంటున్నాయని, పెట్రోలు, డీజిల్, ఎల్పీజీ సిలిండర్లను తక్కువధరలకే అందిస్తున్నట్లు గుర్తుచేసారు. సమిష్టిగా ఈ మూడు విబాగాల్లో రూ.1.98 లక్షలకోట్లు నష్టం వస్తోందని చెప్పిన సంగతి తెలిసిందే.

పెట్రోలు డీజిల్‌దరలు రూ.3 చొప్పున పెంచిన తర్వాత కూడా ఇక్రారేటింగ్స్ అంచనాలప్రకారం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రోజుకు రూ.500 కోట్లు నష్టం ఎదుర్కొనక తప్పదని అంచనా వేసాయి. అందువల్ల భవిష్యత్తులో మరిన్ని రేట్లపెంపు ఉంటాయనికూడా హెచ్చరించింది. ఇప్పటికి మూడుసార్లు ధరలు పెంచిన పెట్రో డీజిల్‌కంపెనీలు భవిష్యత్తులో నష్టాలను పూర్తిగా భర్తీచేసుకునేందుకు రేట్లపెంపు ఒక్కటే మార్గమని సంకేతాలిస్తున్నాయి. హార్ముజ్ జలసంధి ఉద్రిక్తతలు, పశ్చిమాసియా యుద్ధ విరమణ అంటూ జరిగితే కొంతమేర ఉపశమనం లభిస్తుందని, లేనిపక్షంలో ధరల పెరుగుదల ఒక్కటే మార్గమని కూడా రేటింగ్ సంస్థలు అంచనావేసాయి.








### భారీగా ఆరు కంపెనీల మార్కెట్

## రూ.74,112కోట్ల ఎంక్యాప్ వృద్ధి

**ముంబయి, మే 24:**దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారంలో సానుకూలంగా స్పందించడంతో దేశంలోని టాప్10 కంపెనీలలో ఆరు కంపెనీల మార్కెట్ విలువ భారీగా పెరిగింది. ఈ ఆరు కంపెనీల సంయుక్త మార్కెట్ విలువలు ఏకంగా రూ.74,111.57 కోట్లు వృద్ధి చెందింది. ఈక్విటీ మార్కెట్లలో సానుకూల ధోరణి కనిపించడంతో ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, ఎల్ఐసీ వంటి దిగ్గజాలు లాభాల్లో పయనించాయి. గడిచిన వారంలో లాభపడిన కంపెనీలలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అగ్రస్థానంలో నిలిచింది. టీసీఎస్ మార్కెట్ విలువ అత్యధికంగా రూ.19,338.68 కోట్లు పెరిగి రూ.8,38,401.33 కోట్లకు చేరింది. ఆ తర్వాత ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.14,515.93 కోట్లు ఎగబాకి రూ.9,06,901.32 కోట్లకు చేరుకుంది.లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ.9,076.37 కోట్లు పెరిగి రూ.5,14,443.69 కోట్లకు చేరగా, బజాజ్ ఫైనాన్స్ విలువ రూ.3,797.83 కోట్లు పెరిగి రూ.5,70,515.57 కోట్లకు చేరుకుంది. లార్సెన్ అండ్ టూబ్రో సంపద కూడా రూ.2,685.87 కోట్లు పెరిగి మొత్తం రూ.5,40,228.21 కోట్లుగా నమోదైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) తమ మార్కెట్ విలువలు కొంతమేర కోల్పోయాయి. అత్యధికంగా భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ క్యాప్ రూ.20,229.67 కోట్లు తగ్గి రూ.11,40,295.49 కోట్లకు పడిపోయింది. హిందుస్థాన్ యూనిలీవర్ విలువ రూ.16,212.18 కోట్లు,ఎస్బీఐ విలువ రూ.12,784.4 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ.2,094.35 కోట్లు చొప్పున తగ్గాయి. దేశంలో అత్యంత విలువైన కంపెనీల ర్యాంకింగ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఆ తర్వాత భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్ ఉన్నాయి.

## ఐపిఒకు వస్తున్న ఎస్ఎంఆర్ జ్యూయెల్స్

**ముంబయి, మే 24:** లిస్టింగ్ గెయిన్స్ పొందాలనుకునే స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ల కోసం కొత్త ఎస్ఎంఈ ఐపీఓ అందుబాటులోకి వస్తోంది. సాంప్రదాయ బంగారు ఆభరణాలతోపాటు హెరిటేజ్ డిజైనర్ నగల తయారీ, పెళ్లిళ్లు, పండగల కోసం సరికొత్త డిజైన్లను రూపొందించే కంపెనీ ఎస్ఎంఆర్ జ్యూవెల్స్ లిమిటెడ్ పబ్లిక్‌ఇష్యూకు వస్తోంది. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ మే 26వ తేదీన ప్రారంభమవుతోంది. ఈ కొత్త పబ్లిక్ ఇష్యూ 29వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ఐపీఓ ద్వారా ఎస్ఎంఆర్ జ్యూయెల్స్ కంపెనీ మొత్తం రూ. 67.23 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఐపీఓ ప్రైస్ బ్యాండ్ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 128 నుంచి రూ. 135గా నిర్ణయించింది. ఈ ఐపీఓలో పాల్గొనాలనుకునే వారు కనీసం 1000 షేర్లు కొనుగోలు చేయాలి అంటే రూ. 2.70 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇక కంపెనీ షేర్లు జూన్ 3వ తేదీన బీఎస్ఈ సహా ఎస్ఎంఈలో లిస్టింగ్ కానున్నాయి.ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉన్న 2.49లక్షల షేర్లు విక్రయిస్తోంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.3 కోట్లు సమీకరించనుంది.




పబ్లిక్‌కి రూ. 10 ఫేస్ వ్యాల్యూ గల 47.31లక్షల షేర్లను విక్రయించనుంది. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.64 కోట్లు పొందనుంది. ఈ ఐపీఓ ద్వారా వచ్చిన నిధులను వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం, సాధారణ కార్పొరేట్ అవసరాలు, అదే విధంగా కంపెనీ తీసుకున్న లోన్స్ పూర్తిగా లేదా పాక్షికంగా పేమెంట్ చేసేందుకు ఉపయోగించాలని తెలిపింది.

చివరగా మూలధన వ్యయం అవసరాల కోసమూ వినియోగించనుందని తెలిపింది. ఇష్యూకు పూర్వ షేర్ రిజిస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించనుండగా, వెల్త్ మైన్ నెట్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఐపీఓ బుక్ రన్నింగ్ లీడ్ మ్యానేజర్‌గా వ్యవహరించనుంది. ఐపీఓలో రిటైల్ ఇన్వెస్టర్లకి 47.49 శాతం ఎన్ఐఐలకి 38.01 శాతం వాటా,మార్కెట్ మేకర్స్‌కి 5 శాతం వాటా, చివరగా క్యూఐబీలకి 9.50 శాతం వాటాని కంపెనీ కేటాయించింది. ఈ ఐపీఓ డేట్స్ పరిశీలిస్తే జూన్ 1 షేర్స్ ఎలాట్మెంట్ ఉండనుంది. జూన్ 2వ తేదీన ఎలాట్మెంట్ వచ్చిన వారికి డీమ్యాట్ అకౌంట్లోకి షేర్లు క్రెడిట్ అవుతాయి. అలాగే ఈ కంపెనీ షేర్లు జూన్ 3వ తేదీన బీఎస్ఈ ఎస్ఎంఈలో లిస్టింగ్ అవుతుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.